ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 3 | విజయవాడ, బుధవారం 3 జనవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00





మంగళవారం రాత్రి విజయవాడలో కనిపించిన సూపర్ మూన్

ఫొటో : రమణ

పంచాయతీలకు రేటింగ్




ప్రకాశం జిల్లా దర్శిలో అభివృద్ధి పథకాల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రతి ఒక్కరికీ డిజిటల్ లాకర్ ఏర్పాటు చేస్తాం

దర్శి 'జన్మభూమి-మా ఊరు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-ఒంగోలు ప్రతినిధి, దర్శి

'రానున్న కాలంలో పంచాయతీల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తాం, ఆ సౌకర్యాల ఆధారంగా 'స్టార్' గుర్తులిస్తాం. అప్పుడు మీ ఊరి పరిస్థితి ఏమిటో తెలుస్తుంది. ప్రతి ఇంటికీ ఫైబర్ కనెక్షన్‌తో నెట్, టీవీ, ఫోను సౌకర్యాలు కల్పించాం. ప్రతి ఒక్కరికీ డిజిటల్ లాకర్‌ను ఏర్పాటు చేస్తాం. వాటి ద్వారా అన్ని రకాల సర్టిఫికెట్లు అందులో భద్రపరుచుకోవచ్చు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. మంగళవారం దర్శిలో మిగతా 9లో



మహారాష్ట్రలో
దళితాగ్రహం

- ముంబయికి విస్తరించిన నిరసనలు
- నేడు రాష్ట్ర బంద్
- సిపిఎం మద్దతు

న్యూఢిల్లీ : మహారాష్ట్రంలో దళితులు భగ్గుమన్నారు. ముంబయిలో సోమవారం నిర్వహించిన చారిత్రాత్మక 1818 నాటి భీమ్ – కారేగావ్ యుద్ధ ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా సంఘపరివార్ శక్తులు ఒక వ్యూహం ప్రకారం దళితులపై చేసిన దాడులకు నిరసనగా మంగళవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగాయి. ముంబయి, పూణే, ఇతర తదితర ప్రాంతాలలో నిరసనలు తారాస్థాయిలో కొనసాగుతున్నాయి. సోమవారం చోటు చేసుకున్న హింసాత్మక సంఘటనల్లో కారేగావ్ భీమ్ గ్రామ సమీపంలో దళితుడు హత్యకు గురికావడంతో ఈ ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. ఈ సంఘటనకు నిరసనగా బుధవారం నాడు మహారాష్ట్ర బంద్‌కు పలు దళిత, బహుజనసంఘాలు పిలుపునిచ్చాయి. ఈ బంద్‌కు సిపిఎం మద్దతు ప్రకటించింది. హత్య సమాచారంతో మంగళవారం నాడే రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బంద్ వాతావరణం నెలకొంది. పశ్చిమ మహారాష్ట్రలోని పలు జిల్లాల్లోనూ, మరత్వాడా, విదర్భ ప్రాంతాలలోనూ ఉద్రిక్తత నెలకొంది. పలుచోట్ల ఆందోళనకారులు బస్సుల మిగతా 8లో



కళలకు చావు లేదు

ప్రజా నాట్యమండలి రాష్ట్ర మహాసభలో ఎల్‌బి శ్రీరాం, మాదాల రవి
ప్రారంభమైన బళ్లారి రాఘవ ప్రజా సాంస్కృతిక ఉత్సవాలు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

సమాజాన్ని జాగృతి చేసి వారిలో చైతన్యాన్ని నింపడంలో ముందు నుంచి ప్రజానాట్యమండలి చేస్తున్న కృషి అభినందనీయమని సినీ నటులు ఎల్‌బి.శ్రీరాం, మాదాల రవి పేర్కొన్నారు. కళలకు చావు లేదన్నారు. బళ్లారి రాఘవ ప్రజా సాంస్కృతిక ఉత్సవాల పేరుతో ప్రజానాట్యమండలి 9వ రాష్ట్ర మహాసభలు అనంతపురం నగరంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. లలిత కళా పరిషత్‌లో నిర్వహించిన ప్రారంభ సభకు అనంతపురం జిల్లాలోని ప్రముఖులు, సాహితీవేత్తలు, కళాకారులు పెద్దఎత్తున హాజరయ్యారు.

డప్పు కళాకారుల నృత్యాలు, చెక్కభజనలు, కోలాటాలతో ప్రదర్శన చేశారు. ప్రదర్శన నగరంలోని గీతా మందిరం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా టవర్‌క్లాక్ నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానం వరకు సాగింది. అనంతరం జరిగిన బహిరంగ సభకు సినీ నటులు ఎల్‌బి.శ్రీరాం, మాదాల రవిలు ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఈ సందర్భంగా ఎల్‌బి.శ్రీరాం మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసే క్రమంలోనే కళలు పుట్టుకొచ్చాయని చెప్పారు. నేడు సినిమాల్లో చూపినట్టు ఒక్కరే హీరో కాకుండా ఈ కళల్లో అందరూ హీరోలేనని చెప్పారు. సమాజంలో జరుగుతున్న చెడును ఎత్తి చూపడంలో ఇవి ఎంతో కీలకంగా పనిచేస్తాయని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని కళలకు విస్తృత ప్రచారం మిగతా 9లో



బహిరంగ సభలో మాట్లాడుతున్న సినీ నటులు ఎల్‌బి.శ్రీరాం



ప్రారంభోత్సవ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన ప్రతినిధులు



పోలీసుల అదుపులో గజల్ శ్రీనివాస్

లైంగిక వేధింపుల కేసులో
గజల్ శ్రీనివాస్ అరెస్టు

- 12 వరకు రిమాండ్
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- ఎలాంటి తప్పు చేయలేదు: శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గజల్ శ్రీనివాస్‌ను పంజాగుట్ట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. రేడియో జాకీగా పనిచేస్తున్న యువతిని గత రెండు నెలల నుంచి లైంగికంగా వేధిస్తున్నాడన్న ఫిర్యాదు మేరకు విచారణ చేసి పక్కా ఆధారాలతో అరెస్టు చేశారు. పోలీసుల విచారణ అనంతరం కోర్టులో ప్రవేశపెట్టగా ఈనెల 12 వరకు న్యాయస్థానం రిమాండ్ విధించింది. అనంతరం శ్రీనివాస్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. పోలీసులు తెలిపిన మిగతా 9లో



అమరావతికి రూ.3,324 కోట్ల రుణం..

- ప్రపంచ బ్యాంకు పరిశీలనలో ఉందన్న జైట్లీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు నుంచి రూ.3,324 కోట్ల మేర రుణం రానున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ రాజ్యసభలో ప్రకటించారు. ఈ రుణం ఇచ్చే అంశం ప్రపంచ బ్యాంకు పరిశీలనలో ఉందని ఆయన చెప్పారు. మంగళవారం రాజ్యసభలో అమరావతి నిర్మాణానికి నిధుల కేటాయింపుపై ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు జైట్లీ సమాధామిస్తూ, రాజధాని నిర్మాణానికి రూ.3324 కోట్లు కావాలని ఏపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకును కోరిందన్నారు. ఈ అంశం ప్రపంచ బ్యాంకు పరిశీలిస్తోందన్నారు. రుణం మంజూరు విషయంలో ప్రపంచ బ్యాంకు ప్రారంభించిన అధ్యయనం, మిగతా 9లో

హెచ్1 బి వీసాలకు పొడిగింపు లేదు

- నిబంధనలు కఠినతరం
- భారతీయులపైనా అధిక ప్రభావం

న్యూఢిల్లీ : అమెరికాలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం హెచ్1బి వీసాలకు గడవు పొడిగించకపోవడం, నిబంధనలు కఠినతరం చేస్తుండడం పట్ల ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఇందుకోసం ఉద్దేశించిన బిల్లుపై భారతీయులు ఆందోళన చెందుతున్నారు. అలాగే డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డిహెచ్ఎస్) ఇచ్చిన ప్రతిపాదన కూడా అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులపై పెద్ద ఎత్తున ప్రభావం చూపనుంది. అమెరికాలో శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నవారు ఇక హెచ్1 బి వీసాను పొడిగించుకునే అవకాశం లేకుండా చేయాలన్నదే ఈ ప్రతిపాదన. సాధారణంగా హెచ్1 బి వీసాపై అమెరికాలో ఉద్యోగాలు చేసుకుంటున్న భారతీయులు శాశ్వత నివాసం కోసం గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేస్తూంటారు. ఒక వేళ గ్రీన్‌కార్డు అనుమతి పొందడానికి కొంత సమయం ఉన్నప్పుడు తమ హెచ్-బి వీసాను పొడిగించుకుంటూ వుంటారు. ఈ ప్రతిపాదన అమలుతో ఆ అవకాశం కోల్పోనున్నారు. గ్రీన్‌కార్డు దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నప్పుడు వీసాను పునరుద్ధరించే వీలు లేకుండా చేయడమే ఈ ప్రతిపాదన అసలు ఉద్దేశం. ఈ ప్రతిపాదన అమలు అయితే భారత్‌కు చెందిన కనీసం 75 వేల మంది హెచ్1బీ వీసాదారులు స్వదేశానికి తిరిగిరావాల్సి వుంటుంది. ఇందులో కేవలం ఐటి రంగానికి చెందిన వారు మాత్రమే కాకుండా అర్కిటెక్కులు, ప్రొఫెసర్లు, ఫ్యాషన్ మోడళ్లు వున్నారు. గత ఆరేళ్ల నుంచి ప్రతీ ఏడాది సుమారు 85 వేల కొత్త హెచ్1 బీ వీసాలను అమెరికా మంజూరు చేస్తోంది. ఇందులో మిగతా 9లో



ఓవర్‌డ్రాఫ్ట్ దిశగా



- ఖజానా ఖాళీ
- సంక్రాంతిలోగా కావల్సింది 7300 కోట్లు
- అందుబాటులోకి వచ్చేది 2150 కోట్లే
- కార్పొరేషన్ల నిధులపై కన్ను..!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఈ ఆర్థిక సంవత్సర చివరి త్రైమాసికం ప్రారంభంలోనే రాష్ట్ర ఖజానా ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. అత్యవసరాల కోసం పెద్ద మొత్తంలో ఓవర్‌డ్రాఫ్ట్‌కు కూడా వెళ్లింది. ఖజానాలో కేవలం అతి తక్కువ మొత్తం అందుబాటులో ఉండడంతో, ఇక అప్పులపైనే ఆధారపడాల్సి ఉంటుందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. వచ్చే ఆదాయం, చేయాల్సిన ఖర్చులను బేరీజు వేస్తే కేవలం సంక్రాంతి పండుగ రోజు నాటికే రూ.5వేల కోట్లకు పైగా లోటు నెలకొంటోంది. ఈ కారణంగానే ఇతర సంస్థల నుంచి నిధులను సేకరించేందుకు ఆర్థిక శాఖ కసరత్తు ప్రారంభించింది.

తొలి మూడు త్రైమాసికాల్లో ఆర్థిక ఒడిదొడుకులనేకం ఎదురయ్యాయి. అనునిత్యం అప్పులతోనే ముందుకెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. చివరకు ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి కూడా పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అధికారికంగా ప్రకటించారు. చివరి త్రైమాసికంలో కూడా అదే పరిస్థితి కొనసాగుతోంది. అధికారుల అంచనా మేరకు 15వ తేదీలోగా రూ7వేల కోట్లకుపైగా నిధులు కావాల్సి ఉంటుంది. ఇందులో జీతాలు, పింఛన్లకు రూ.4వేల కోట్లు, రుణాలపై అసలు, వడ్డీ చెల్లింపులకు రూ. 800 కోట్లు, ఇప్పటికే ఉన్న ఓవర్‌డ్రాఫ్ట్ చెల్లింపులకు దాదాపు రూ.2వేల కోట్లు, దైనందిక ఖర్చులకు రూ. 600 కోట్లు కావాల్సివుంటుందని అంచనా వేస్తున్నారు.

కానీ వస్తుందని ఆశిస్తున్న ఆదాయం మాత్రం సుమారు రూ. రెండు వేల కోట్లుగానే కనిపిస్తోంది. రాష్ట్ర పన్నుల ద్వారా రూ.1500 కోట్లు, కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రూ. 200 కోట్లు, జిఎస్టీ ద్వారా రూ.100 కోట్ల వరకు, ఆదాయ లోటుగా కేంద్రం నుంచి రూ. 300 కోట్ల వరకు వస్తుందని ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. మొత్తంమీద రూ.5వేల కోట్లకు పైగా లోటు ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీంతో ఇతర మార్గాల్లో నిధులను సమీకరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే ఇతర ప్రభుత్వరంగ సంస్థలు తీసుకున్న అప్పులను పిడి ఖాతాల ద్వారా రాష్ట్ర ఖజానాకు మళ్లించాలని, ఆ నిధుల ద్వారా తమ అవసరాలు మిగతా 9లో



స్థాయీ సంఘానికి ఎన్ఎంసి బిల్లు 8

వైద్యుల ఆందోళన వాయిదా

SBI ఖాతాదారులపై 1,771 కోట్లు జరిమానా

వసూలు చేసిన ఎస్‌బిఐ 8

భారీగా బరులు

- కోడి పందేలకు సంసిద్ధం
- అధికార ప్రజాప్రతినిధుల వత్తాసు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జంతు ప్రేమికులు కాదన్నా, న్యాయ వ్యవస్థ ఆగ్రహించినా జూదంలో యావదాస్తినీ కోల్పోయిన బాధిత కుటుంబాల మహిళలు గగ్గోలు పెట్టినా... పందెం రాయుళ్లు మాత్రం మళ్లీ బరిలోకి దూకుతున్నారు. సంక్రాంతి సంప్రదాయం పేరిట కోట్లాది రూపాయల కోడి పందేల జూదానికి తెర లేపనున్నారు. పోలీసులు అడ్డుకున్నా తాము చూసుకుంటామని కొందరు నేతలే భరోసా ఇస్తున్నందున రాష్ట్రంలో ఈ ఏడాదీ జోరుగా పందేలకు బరులు సిద్ధమవుతున్నాయి. కోస్తా జిల్లాల్లో కోడి పందేలకు ప్రసిద్ధి చెందిన పశ్చిమ గోదావరి జిల్లాలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులే కొందరు దగ్గరుండి మరీ ఈ ఏర్పాట్లను మిగతా9లో

పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్

సంక్రాంతి సందర్భంగా కోడి పందేలను అడ్డంపెట్టుకుని అసాంఘిక కార్యకలాపాలను నిర్వహించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారో లేదో చెప్పాలని ఎపి సర్కార్‌ను హైకోర్టు నిలదీసింది. కోడి పందేల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు సాగుతుంటే చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు ఏం చేస్తున్నారని మిగతా9లో



ఐఇఎఫ్ అధ్యక్షుడిని అభినందించిన డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిజిపి మాలకొండయ్య ఇండియన్ ఎకనమిక్స్ ఫోరం అధ్యక్షునిగా ఎంపికైన సూర్యదేవర మహేంద్రదేవ్‌ను మంగళవారం అభినందించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడిలోని మహేంద్రదేవ్ స్వగృహానికి స్వయంగా వెళ్లిన డిజిపి, కొంత సమయం ఆయనతో వివిధ విషయాలపై చర్చించారు. ఎటువంటి హడావుడి లేకుండా తుమ్మపూడికి వచ్చిన మాలకొండయ్య తన కాన్వాయ్‌ను కొంచెం దూరంగానే నిలిపి మహేంద్రదేవ్ ఇంటికి కొంత దూరం కాలినడకనే వెళ్లడం విశేషం. పూర్వ పరిచయాన్ని పురస్కరించుకుని, స్నేహితునిగానే డిజిపి ఫోరం అధ్యక్షుడిని అభినందించినట్లు తెలుస్తోంది. డిజిపి అయిన తరువాత ఎటువంటి భద్రతా లేకుండా తొలిసారి ఆయన తుమ్మపూడికి వెళ్లారు. ఈ సందర్భంగానే అధ్యక్షులుగా ఎన్నికైన మహేంద్రదేవ్‌ను కలిసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పలువురు ఎమ్మెల్యేలు మహేంద్రదేవ్‌కు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు

సమాచారశాఖ కమిషనర్ వెంకటేశ్వర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ తిరుపాల్‌రెడ్డి, మేనేజర్లు రమేష్, గణేష్ తదితరులు

కెసిఆర్ మాయలో పవన్‌కల్యాణ్

ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ మాయలో పవన్‌కల్యాణ్ పడ్డారని ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మంగళవారం విలేకరుతో మాట్లాడుతూ 24 గంటల కరెంటు ఇవ్వడంపై కెసిఆర్‌ను పవన్ కల్యాణ్ అభినందించడాన్ని రేవంత్ తప్పుబట్టారు. విద్యుత్ కేటాయింపుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని, విద్యుత్ గురించి తన దగ్గరున్న పుస్తకాలను పవన్‌కు పంపిస్తానని తెలిపారు. 24 గంటల విద్యుత్ పంపిణీ వెనుక దోపిడీ తెలుసుకోవాలని సూచించారు. కెసిఆర్ తాను చేస్తున్న దోపిడీకి పవన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా చేసే విధంగా కన్పిస్తోందన్నారు. ఇప్పటికైనా వాస్తవాలు గుర్తించి కెసిఆర్ మాయలో పడొద్దని పవన్‌కు రేవంత్ సూచించారు ఎఐసిసి కార్యదర్శి, మాజీ ఎంపి వి హనుమంతరావు మాట్లాడుతూ కెసిఆర్ బుట్టలో పవన్‌కల్యాణ్ పడ్డారని తెలిపారు.

కెసిఆర్‌కు పవన్ తెలియదు: టిఆర్ఎస్

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు పవన్‌కల్యాణ్ ఎవరో తెలియదని టిఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వరరెడ్డి తెలిపారు. ఇప్పటివరకూ పవన్ సినిమా ఏ ఒక్కటి కూడా కెసిఆర్ చూడనప్పుడు ఎలా తెలుస్తుందన్నారు. రాష్ట్రపతి వచ్చిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కెసిఆర్‌ను పవన్ కలిసి, అపాయింట్‌మెంట్ కోరినందుకే ఇచ్చారని తెలిపారు.



పొడి వాతావరణం!

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రమంతటా పొడి వాతావరణం కొనసాగుతుందని విశాఖపట్నం వాతావరణ కేంద్ర అధికారులు వెల్లడించారు. రాష్ట్రం మీద పశ్చిమ ఆటంకాల ప్రభావం వల్ల మబ్బులు ఉన్నాయని, మరో రెండు రోజులు కొనసాగుతాయని తెలిపారు. ఎక్కడా వర్షాలు పడే అవకాశాలు లేవని వెల్లడించారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. మహిళా సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పోర్టల్?
2. 17వ ఆరాధన సంగీత మహోత్సవాలు ఎక్కడ జరుగుతున్నాయి?
3. ఇన్ఫోసిస్ నూతన సిఈఓ ?
4. ఫామే ఇండియా పథకం కింద ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలకు ఏ రాష్ట్రానికి అనుమవతి లభించింది?
5. రంజీ ట్రోఫీ 2017 విజేత?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రహదారులు రక్తసిక్తం

- వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి
- పలువురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రోడ్లు రక్తసిక్తమయ్యాయి. మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృత్యువాతపడ్డారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు గ్రామ సమీపంలో టాటా ఏస్‌ను కంటైనర్ ఢీకొట్టడంతో నలుగురు మృతిచెందారు. వారిలో కోటేకల్లుకు చెందిన కర్రెమ్మ(65), అంజనమ్మ(55), ఎమ్మిగనూరుకు చెందిన ఆటో డ్రైవర్ భీమిరెడ్డి(45) అక్కడికక్కడే మరణించారు. బనవాసికి చెందిన ఖాదర్ బాష(48) ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో మృతి చెందారు.

మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. చిత్తూరు జిల్లా గంగవరం మండలం కల్‌పల్లి వద్ద ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతిచెందారు. వారిలో చిన్నమనాయునిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ సుబ్రమణ్యం(30), పలమనేరుకు చెందిన అలెక్స్ పెయింటర్(50) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మున్నాభి(51) ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడిన మరో ఐదుగురుని వేలూరు సిఎంసికి తరలించారు. ప్రకాశం జిల్లా మార్టూరు మండలం బోల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద కారు, లారీ ఢీకొన్న ఘటనలో అద్దంకికి చెందిన సిహెచ్.కృష్ణమోహన్(37) మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. విశాఖ జిల్లా బుచ్చెయ్యపేట మండలం పెదమదీన శివారు ఉప్పరగూడెం సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడి జమ్ముల శ్రీబాలాజీ(25) మృతిచెందారు. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు మరోవ్యక్తి ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. కాగా గత నెల 31న జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో కూడా తొమ్మిది మంది మృతి చెందారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చెల్లాచెదురుగా పడిన మృతదేహాలు

జగ్గయ్య పేట నుంచి త్వరలో జల రవాణా : దేవినేని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



జగ్గయ్యపేట నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు జలరవాణాను త్వరలో ప్రారంభించనున్నట్లు జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో మంగళవారం నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కోనాయపాలెం వద్ద ఐకాన్ బ్రిడ్జి, ఇబ్రహీంపట్నం పవిత్రసంగమం వద్ద మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి 2018 నాటికి గ్రావిటీ ద్వారా నీరు అందిస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫైబర్ కనెక్టివిటీ ద్వారా తక్కువ ధరకే ఇంటర్‌నెట్, కేబుల్ కనెక్షన్ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ధనికులు తమకున్న దాంట్లో కొంత మానవత ధృక్పదంతో పేదలకు త్యాగం చేసి తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

18,19 తేదీల్లో కలెక్టర్ల సదస్సు

తొలిసారి వెలగపూడిలో నిర్వహణ
ఒక్కరోజు ముందు 17న క్యాబినెట్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈనెల 18, 19 తేదీల్లో కలెక్టర్ల సదస్సు నిర్వహించేందుకు షెడ్యూల్ ఖరారైంది. మూడు నెలల పురోగతిపై ప్రభుత్వానికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని ఇప్పటికే శాఖాధిపతులందరికీ ఆదేశాలు అందాయి. కలెక్టర్ల సదస్సును ఈసారి విజయవాడలో కాకుండా తొలిసారిగా వెలగపూడి తాత్కాలిక సచివాలయం ఐదో బ్లాకు సమావేశ మందిరంలో సిఎం నిర్వహించనున్నారు. సాధారణంగా మూడు నెలలకోసారి ఈ సదస్సు ఉంటోంది. గత కలెక్టర్ల సదస్సును సెప్టెంబర్ 20, 21 తేదీల్లో నిర్వహించారు. వాస్తవానికి 2017 డిసెంబర్‌లో చేపట్టాల్సిన ఈ సదస్సు కొద్ది ఆలస్యంగా నిర్వహిస్తున్నారు. సదస్సుకు ముందురోజు అంటే ఈనెల 17న రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఏర్పాటవుతోంది. ప్రభుత్వం ప్రకటించిన సాధారణ సెలవుల ప్రకారం 16 వరకు సంక్రాంతి సెలవులు. ఆ మరుసటి రోజు 17వ తేదీ ఉదయం టిడిపి సమన్వయ కమిటీ సమావేశం, మధ్యాహ్నం 3 గంటల నుంచి సచివాలయంలో క్యాబినెట్ సమావేశం నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా జగన్ సంకల్పయాత్ర

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రతిపక్షనేత వైఎస్ జగన్ చేపట్టిన ప్రజాసంకల్ప యాత్రకు చిత్తూరు జిల్లాలో ఉత్సాహంగా సాగుతుంది. మహిళలను, వృద్ధులను పలకరించుకుంటూ, చిన్నారులను ముద్దాడుతూ, యువతతో సెల్ఫీలు దిగుతూ ఆయన యాత్రను కొనసాగించారు. మంగళవారం ఉదయం మదనపల్లి మండలం చిన్నతిప్పసముద్రం నుంచి ప్రారం భమైన ప్రజాసం కల్పయాత్ర పూలవాండ్లపల్లి, కాశీరావు పేట మీదుగా వాల్మీకిపురం మండలానికి చేరుకుంది. వాల్మీకిపురం శివారు ప్రాంతంలోని బోగంపల్లె ప్రాజెక్టు వద్ద నుంచి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలోనూ మహిళలు హారతులు పట్టి, పూలమాలలు వేసి, పూల వర్షం కురిపించారు. మండలంలోని ఉపాధ్యాయులు జగన్‌ను కలిసి సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. అలాగే వేరుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలని, సహకార నూనె కర్మాగారాన్ని మూసేయించారని రైతులు ఫిర్యాదు చేశారు. సంఘమిత్రల ఉద్యోగాలు క్రమబద్ధీకరించి, జీతాలు పెంచాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేసి గద్దెనెక్కారని, టిడిపి పాలనలో అంతా తెలుగు తమ్ముళ్లకే మేలు జరుగుతుందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రంగాల వారిని అన్ని విధాలా ఆదుకుని పూర్వవైభవం తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. జమ్మళ్ల పల్లి వద్ద జగన్‌కు రాత్రి బస ఏర్పాట్లు చేశారు. ఈ కార్య క్రమంలో మదనపల్లి ఎంఎల్‌ఏ దేశాయ్ తిప్పారెడ్డి ఉన్నారు.



మాస్ కాపీయింగ్‌తో దిగజారుతున్న విద్యా ప్రమాణాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

తప్పు చేస్తూ మాస్ కాపీయింగ్‌కు సహకరించే ఉపాధ్యాయుడు మంచి వాడు.. చట్ట ప్రకారం మాస్ కాపీయింగ్‌ను అడ్డుకునే ఉపాధ్యాయుడు చెడ్డవాడు.. ఇదీ తప్పు చేసే విద్యార్థులు, వారిని ప్రోత్సహించే తల్లిదండ్రుల అభిప్రాయం. చూచి రాతలతో పరీక్షలు రాసే వారి వల్ల, వీటిని ప్రోత్సహించే వారి వల్ల విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయి.. అని ఉమ్మడి హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. మాస్ కాపీయింగ్‌ను నివారించేందుకు పరీక్షా కేంద్రాల్లో సిసి కెమేరా ల్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఏలూరుకు చెందిన ప్రొఫెసర్ గుంటుపల్లి శ్రీనివాస్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాం ప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మరోసారి విచారణ చేసింది. గత ఏడాది పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌పై తెలంగాణలో నాలుగు, ఎపిలో ఒకే ఒక్క కేసు నమోదైందనే అధికారుల నివేదికలను చూస్తే ఏం చెప్పాలో అర్థం కావడం లేదని బెంచ్ విస్తుపోయింది. పరీక్షల చట్టం 1997లో కేసు నమోదుతోపాటు ప్రాసిక్యూషన్‌కు వీలుగా చట్టాన్ని మారిస్తే మాస్‌కాపీయింగ్ రోగం కుదురుతుందని బెంచ్ వ్యాఖ్యానిం చింది. పరీక్ష పాస్ కావాలన్న తపనలో తల్లిదండ్రులు కూడా పిల్లల్ని తప్పుడు దారి ఎంచుకునేలో ప్రోత్సహిస్తున్నారని, దీని వల్ల విద్యార్థి జీవిత తొలి దశలోనే అనైతిక ప్రమాణాలు ప్రేరణ అవుతాయని బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది.

లోకేశ్ కోసమే తాంత్రిక పూజలు : అంబటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విజయవాడ దుర్గగుడిలో డిసెంబర్ చివరి వారంలో జరిగిన తాంత్రిక పూజలు సిఎం చంద్రబాబు తనయుడు లోకేష్‌ను ముఖ్యమంత్రిని చేయడానికేనని వైసిపి నేత అంబటి రాంబాబు ఆరోపించారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రత్యేక పూజలు చేయకూడదని ప్రభుత్వం జీవో ఇచ్చి, దీనికి వ్యతిరేకంగా మరోపక్క బెజవాడ కనకదుర్గ దేవస్థానం, తిరుమల నుంచి వచ్చిన అర్చకులు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు ఆశీర్వచనం ఇవ్వొచ్చా అని ప్రశ్నించారు. గుళ్లకూ, గోపురాలకు వెళ్లొద్దన్న చంద్రబాబు, తాగి తూలండంటూ అర్ధరాత్రి వరకు పబ్‌లకు అనుమతులిచ్చి రూ.230 కోట్లు రూపాయల విలువైన మద్యాన్ని తాగించారని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో వందల హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పట్టుమని పది హామీలు కూడా నెరవేర్చలేదని రాంబాబు విమర్శించారు. ఆయన కష్టపడేది రాష్ట్రం కోసం, ప్రజల కోసం కాదని తన కొడుకు లోకేష్ కోసమేనని విమర్శించారు. గత ఎన్నికల్లో టిడిపికి ఓటు చేసిన వారందరూ వీరికి ఎందుకు ఓటేసి అధికారంలోకి తీసుకొచ్చామా అని ఇప్పుడు సిగ్గు పడుతున్నారని తెలిపారు. విదేశీ పర్యటనలు చేసి డప్పాలు కొట్టడం మినహా చంద్రబాబు ఒరగబెట్టిందేమీ లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి మొదటి కూలీ అని చెప్పుకునే ముఖ్యమంత్రి ఫైవ్ స్టార్ హోటళ్లో లగ్జరీగా ఉంటూ విచ్చలవిడిగా ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారన్నారు.

రెండు కళాశాల వసతి గృహాలుగా ఏర్పాటు

అమరావతి బ్యూరో : పశ్చిమ గోదావరి జిల్లాలో బిసి సంక్షేమ శాఖకు చెందిన రెండు ప్రీ మెట్రిక్ వసతి గృహాలను కాలేజీ హాస్టళ్లుగా మార్పు చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బి ఉదయలక్ష్మి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తాడేపల్లిగూడెంలోని వసతి గృహాన్ని భీమవరంలో బాలుర కాలేజీ హాస్టల్ గాను, పెంటపాడులోని వసతి గృహాన్ని ఏలూరు బాలుర కాలేజీ హాస్టల్‌గాను మార్చినట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలి..

ప్రజాశక్తి - హైదరాబాద్

నెల్లూరు జిల్లా వెంకటగిరి మండలం చెవిరెడ్డిపల్లె గ్రామంలో స్పిన్నింగ్ మిల్లు నిమిత్తం 1991లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం యస్కో కంపెనీకి కేటాయించిన 30 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని తప్పుపట్టిన సింగిల్ జడ్జి ఉత్తర్వులను డివిజన్ బెంచ్ రద్దు చేసింది. తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఆ భూమిని ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. సింగిల్ జడ్జి తీర్పును ఎపి ప్రభుత్వం సవాల్ చేయగా బెంచ్ సానుకూలంగా ఉత్తర్వులు వెలువరించింది. ఆ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేయబోమని ఎపి ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. సింగిల్ జడ్జి వద్ద ఈ కేసును విచారణ కోరేందుకు యస్కో కంపెనీకి బెంచ్ అనుమతి మంజూరు చేసింది.

గవర్నర్ తెలంగాణ పక్షపాతి

బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్‌పై కేంద్రానికి ఫిర్యాదు చేస్తానని బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు వెల్లడించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు, పరిశ్రమలు నెలకొల్పేందుకు చెల్లించే నాలా పన్నును తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఆ భూమికి ఉన్న మార్కెట్ విలువలో ప్రస్తుతం 9 శాతం ఉన్న పన్ను 3 శాతానికి తగ్గించేలా అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపామన్నారు. నెల రోజులవుతున్నా ఆ బిల్లుకు ఇంతవరకు గవర్నర్ ఆమోదం లేదని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఇదే చట్టం రూపంలో తెలంగాణలో అమలవుతోందని, ఆ రాష్ట్రానికి మాత్రం గవర్నర్ వెంటనే ఆమోదించి పంపారని చెప్పారు. గవర్నర్ తెలంగాణ పక్షపాతిగా ఉన్నారని, ఏపిపై ఆయనకు ప్రేమ లేదన్నారు. ఆయన హైదరాబాద్‌లో ఉండటం వల్లే తెలంగాణకు మేలు చేస్తూ ఏపికి అన్యాయం చేస్తున్నారనే అనుమానం వస్తోందన్నారు. నాలా పన్ను ఎక్కువవుతుంటే పరిశ్రమలు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదని, దీంతో యువతకు ఉపాధి కూడా దూరమవుతోందన్నారు. ఇప్పటికైనా గవర్నర్ నాలా బిల్లును వెంటనే ఆమోదించాలని కోరారు. దీనిపై అవసరమైతే ప్రధాని మోడీని, రాష్ట్రపతిని కలిసి సమస్యను వివరిస్తానన్నారు.

ప్రత్యేకం

వసతులు లేకున్నా...
కొత్త ప్రాజెక్టులకు పరుగులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్న పర్యాటక ప్రాంతాల్లో తగినన్ని మౌలిక వసతులు లేవని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే అసంతృప్తి వ్యక్తం చేస్తూనే కొత్తగా పలు పర్యాటక ప్రాజెక్టులను ఆమోదించడం విశేషం. ఇప్పుడున్న వసతులపై ఇటీవల ఎపి పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ సంపద బోర్డు డైరెక్టర్ల సమావేశంలో సిఎం అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. ఉన్న పర్యాటక ప్రాంతాల్లో వసతులు మెరుగుపర్చడానికి బదులుగా కొత్త ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఏటా సగటున ఐదు లక్షల మంది పర్యాట కులు సందర్శించే అరకు లోయలో సైతం తగిన వసతులు లేవు. ఈ విషయాన్ని సిఎం అధికారులకు గుర్తు చేశారు. అరకు వెళ్లిన వారు అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ అక్కడ కనీసం ఒక్క రోజైనా బస చేసేందుకు తగిన వసతులైనా లేవు. వచ్చే ఐదేళ్ల నాటికి విశాఖపట్నం అభివృద్ధికి తగినట్లుగా 25 వేల హోటల్ గదులు అవసరమవుతాయి. ప్రస్తుతానికి కనీసం 2500 హోటల్ గదులు కూడా ఆ ప్రాంతంలో లేవు. ఇప్పటికి అభివద్ధి అయిన వాటి కాన్నా ఇంకా పది శాతం ఎక్కువ గదులు కావాల్సి ఉంది. ఇలా వసతులు లేని పరిస్థితి రాష్ట్రంలోని చాలా పర్యాటక ప్రాంతాల్లో నెలకొంది. ఇవిలావుండగా... కొత్త ప్రాజెక్టులను చేపట్టేందుకు పర్యాటక శాఖ ప్రణాళికలు తయారుచేసింది. శ్రీకాకళం జిల్లా కళింగపట్నంలో రూ.200 కోట్లతో బీచ్ రిసార్ట్ అభివృద్ధికి చేసిన ప్రతిపాదనలకు సిఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. క్లబ్ మహీంద్రకు చెందిన 15 ఎకరాల్లో ఈ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో 200 విలాస వంతమైన ఆతిథ్య విభాగాలు ఉండేలా పర్యాటక శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. బొర్రా గుహలు, అరకు వ్యాలీ, అనంతగిరి, చాపరాయి, లంబసింగిలను కలిపి పర్యాటక సర్క్యూట్‌గా అభివృద్ధి చేయనున్నారు. అరకు అభివృద్ధికి రూ.198 కోట్లతో తాజాగా ప్రణాళికను రూపొందించనున్నారు. ఇందులో కేంద్రం నుంచి రూ.100 కోట్లు పొందాలని పర్యాటక శాఖ ప్రయత్నాలు సాగిస్తోంది. విశాఖలోని మధురవాడ కొండలపై 240 ఎకరాలను పర్యాటక ఆకర్షక కేంద్రంగా రూపొందించే బృహత్తర ప్రణాళికను పర్యాటక శాఖ అధికారులు సిద్ధం చేశారు. ఇందు కోసం పోటీ పెట్టి మరీ డెవలపర్‌ను ఎంపిక చేయాలని యోచిస్తున్నారు. యుద్ధనౌక ఐఎన్ఎస్ విరాట్‌లో 148 గదుల హోటళ్ల ఏర్పాటుకు, నావల్ మారీటైమ్ ఇన్‌స్టిట్యూట్, వినోద కేంద్రం, కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గండికోటలో రోప్‌వే ప్రాజెక్టుకు రూ.7.5 కోట్లతో ప్రణాళికను రూపొందించారు.



సంక్షిప్తం

ఎయిడెడ్ టీచర్లకు జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

అమరావతి బ్యూరో : ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయుల వివరాలు మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ(హెచ్ఆర్ఎంఎస్)లో అప్‌లోడ్ చేయడం ఆలస్యమవుతున్నందున డిసెంబర్ జీతాలు పాత పద్ధతిలో చెల్లించాలని ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం రవిచంద్రను మంగళవారం సచివాలయంలో కలిసి కోరారు. పాత పద్ధతిలో జీతాలు చెల్లించేందుకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌కు తగిన ఆదేశాలు ఇస్తామని రవిచంద్ర వారికి హామీ ఇచ్చారు.

భక్తి ఛానల్ సిఇఒపై కేసులో ప్రతివాదులకు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్

తిరుమల వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలోని ఎస్విబిసి (భక్తి ఛానల్)లో అక్రమాలకు ఆ ఛానల్ సిఇఒ ఎవి నర్సింహారావు తెర లేపారన్న ఆరోపణలతో కూడిన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, టిటిడి ఇఒ, ఎస్విబిసి ఎండిలతో వ్యక్తిగతంగా నర్సింహారావు తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం నోటీసులు జారీ చేసింది. విచారణ నెల రోజులకు వాయిదా పడింది.

8న సెట్ల షెడ్యూల్

అమరావతి బ్యూరో : రాష్ట్రంలో వివిధ వృతి విద్య, సాంకేతిక కోర్సుల్లో నిర్వహించే ఉమ్మడి ప్రవేశాల పరీక్షల (సెట్స్) తేదీలను నెల 8న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు ఈ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఉన్నత విద్యా మండలి సెట్లపై గురువారం ప్రాథమిక సమావేశం కానుంది. ఈ సమావేశంలో పరీక్ష ఫీజులు, కన్వీనర్ల నియామకం తదితర అంశాలపై నిర్ణయం తీసుకొని 8న వెల్లడించనుంది. తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 28న ప్రకటించింది. మే 2 నుంచి 5 వరకు ఎంసెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణ కంటే ముందుగానే నిర్వహించాలని చూస్తోంది. మే నెలలో ఇసెట్, పిజిసెట్, ఎడ్‌సెట్, లాసెట్, పిఇసెట్‌లను నిర్వహించాలని భావిస్తోంది.

4వ తేదీన ఇచ్ఛాపురంలో సిఎం పర్యటన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం (శ్రీకాకుళం జిల్లా)

జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఈ నెల నాలుగో తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ పనులు, సురంగి రాజా క్రీడా మైదానంలో నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్అండ్‌బి, మున్సిపల్, డిఆర్‌డిఎ అధికారులను ఆదేశించారు. అవసరమైతే పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ నుంచి పారిశుధ్య సిబ్బందిని తీసుకురావాలన్నారు. సభాస్థలం వద్ద ముఖ్యమంత్రి పరిశీలించేందుకు



విశాఖ జిల్లా నక్కపల్లి మార్కెట్ సమీపంలో ఐసిడిఎస్ నూతన భవనాన్ని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు మంగళవారం ప్రారంభించారు.

మూగ గిరిజన బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం

దువ్వాడ ఎస్ఇజెడ్ పరిధిలోని హెచ్‌బిసిఎల్ కంపెనీలో కాంట్రాక్టు పద్ధతిన డ్రైవర్‌గా పని చేస్తున్న ఓ వ్యక్తి మూగ దళిత బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. శనివారం జరిగిన ఈ ఘటనపై బాలిక సోదరుడు దువ్వాడ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. దీంతో సౌత్ ఏసిపి రామ్మోహన్ ఆధ్వర్యంలో సిఐ సాయి కేసును దర్యాప్తు చేస్తున్నారు. సెజ్‌లో హైదరాబాద్‌కు చెందిన ఒక పరిశ్రమలో బస్సు డ్రైవర్‌గా శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసకు చెందిన చింతాడ విశ్వనాథం పని చేస్తున్నాడు. ఇదే కంపెనీలో తోట పనులు చేసేందుకుగాను అరకుకు చెందిన గిరిజన యువతిని పనిలో పెట్టుకున్నారు. శనివారం విధులు ముగించుకుని వెళుతున్న సమయంలో డ్రైవర్ విశ్వనాథం బస్సును నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ప్రతిఘటించిన ఆమెను తీవ్రంగా చితకబాదాడు. అంతటితో ఆగకుండా శరీరంపై ఉన్న దుస్తులను తొలగించి నగ్నంగా వదిలేసి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో బాధితురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సమాచారం సెజ్‌లోని సెక్యూరిటీ సిబ్బందికి తెలిసినా వారు బయటకు పొక్కనీయలేదు. పైపెచ్చు రూ.1.25 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం కుదర్చుకుని రూ.లక్ష చేతిలో పెట్టారు. అంతా సమసిపోయిందని అనుకున్న సమయంలో బాధితురాలి సోదరుడు పాడేరు నుంచి వచ్చి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు.

నిందితున్ని కఠినంగా శిక్షించాలి : ఎన్‌పిఆర్‌డి

మూగ దళిత బాలికపై అత్యాచారం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) నగర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకయ్య, కె.అప్పలనాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. వికలాంగుల చట్టం - 2016ను అనుసరించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

కుప్పంలో అవినీతి గృహాలు

- కోటీశ్వరులు, తెలుగు తమ్ముళ్ల అనుయాయులకే ఇళ్ల కేటాయింపు
- పేదల నోట్లో మట్టి

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి

ఈ చిత్రంలోని అందంగా ముస్తాబవుతున్న ప్రాంతం పేరు ఎన్‌టిఆర్ మోడల్ కాలనీ. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ కేంద్రంలోనిది. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఉన్న కూలీలకు, నిరుపేదలకు ఇక్కడ ఇళ్లు దక్కాల్సి ఉంది. అయితే వీటిల్లో ఎక్కువ భాగం అధికార పార్టీ నాయకుల బంధువులకు, నెలకు వేలకు వేలు జీతాలు తీసుకుంటున్న ఉద్యోగస్తులకు దక్కాయి. ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న పేదలకు మాత్రం మొండిచేయే ఎదురైంది. అధికారులు రాజకీయ నాయకులకు దాసోహమై తమ స్వామి భక్తిని చాటుకున్నారు.

కుప్పం నియోజకవర్గం కేంద్రంలో మోడల్ కాలనీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా బేవునిపల్లి రెవెన్యూ పలార్లపల్లిలో ప్రభుత్వం 19 ఎకరాలు కేటాయించింది. ఇందులో రెండు పంచాయతీలకు సంబంధించి 404 గృహాలకు అధికారులు మంజూరు ఉత్వర్వులు జారీచేశారు. ఇందులో ఎక్కువగా కుప్పం, డికెపల్లికి కేటాయించింది. దీనికి ఎన్‌టిఆర్ మోడల్ కాలనీ అని పేరు కూడా పెట్టారు. ఇలా కేటాయించిన గృహాల్లో అత్యధిక భాగం అధికారపార్టీ నాయకులకు నైవేద్యంగా మారింది.



అందంగా ముస్తాబవుతున్న గృహాలు

సాక్ష్యాలివిగో..

- అతను కుప్పంలో సర్పంచుకు దగ్గరి బంధువు. మిలటరీలో పని చేస్తూ రిటైర్ అయ్యారు. ఇతనికి ప్రభుత్వం మూడు ఎకరాల స్థలం కూడా మంజూరు చేసింది. అంతే కాకుండా మూడు సెంట్ల ఇంటి స్థలమూ ఇచ్చింది. అయినా ఇతనికీ ఎన్‌టిఆర్ మోడల్ కాలనీలో అధికారులు ఇళ్లు కేటాయించారు.
- మరొక అతని పేరు పద్మనాభం. కుప్పంలో పది కుటుంబాలకు ఇళ్లు అద్దెకు ఇచ్చుకున్నాడు. అంతే కాకుండా రెండు మూడు షాపింగ్ కాంప్లెక్స్‌లకు యజమాని. ఇతనికీ మోడల్ కాలనీలో ఇళ్లు కేటాయించారు. తమ యజమానికి ఇళ్లు ఇచ్చారు గాని, తమకు లేకుండా పోయిందని అద్దెకు ఉంటున్న వారే అధికారుల ఎదుట వాపోతున్నారు.
- కుప్పంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ సత్యంద్ర శేఖర్ కొడుకు పేరు కిరణ్. ఇతనికి కూడా మోడల్ కాలనీలో ఇళ్లుంది. ఇతను బ్యాంకులో ఉద్యోగి. రూ.50 వేలకు పైగానే నెలనెలా జీతం తీస్తారు. ఇతనికి రేషన్‌కార్డు కూడా ఉండడం మరో విశేషం.
- అలాగే ఆనందనాయుడు అనే గ్రానైట్ వ్యాపారి వద్ద పని చేస్తున్న ఉద్యోగస్తులకు 25 మందికి ఈ కాలనీలో ఇళ్లు మంజూరయ్యాయి. వీరందరూ రాజమండ్రికి చెందిన వారు. ఇతనికి ఇక్కడి అధికారులు రూ.రెండు కోట్లు మిగలబెట్టారు. ఇవే కాకుండా ఇక్కడ తవ్వే కొద్దీ ఇలాంటి అవినీతి ఉదాహరణలు బయటకొస్తూనే ఉన్నాయి.

పేదలకు మొండి చేయి..

తమకు ఇళ్లు కావాలని ఈ ఒక్క మండలంలోనే కూలీలు, చేతి పనులు చేసుకునే వారు దాదాపు రెండు వేల మందికిపైగా అర్జీలు పెట్టుకుని నిరీక్షిస్తున్నారు. వీరికి ఇవ్వకుండా టిడిపి కార్యకర్తలే వీటిని మెక్కేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు ఒక్కటై ఈ కాలనీలోని ఇళ్లను అక్రమంగా కొట్టేస్తున్నారు. దీని గురించి స్థానికంగా ఉన్న కొందరు పోరాటం చేస్తున్నా వారిపైన అధికారపార్టీ నేతలు దాడికి దిగుతుండడం కొసమెరుపు.

రబీసాగుకు నీటిగండం..!

- 'పశ్చిమ'లో నీటిఎద్దడి సమస్యతో రైతులు సతమతం
- ఇంకా దమ్ములు కూడా చేయని పరిస్థితి
- ఆందోళనకరస్థాయికి తగ్గిన గోదావరి నీటి ప్రవాహం

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

పశ్చిమగోదావరి జిల్లాలో డెల్టా రైతులకు కంటిమీద కునుకులేకుండా పోయింది. నీటిఎద్దడి సమస్యతో రబీసాగుపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. జనవరి వచ్చినా నాట్లు పూర్తికాని దుస్థితి దాపురించింది. పొలాలు దమ్ముకాక బీడు భూములుగా దర్శనమిస్తుండటంతో అన్నదాతకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. రబీలో 'పశ్చిమ' డెల్టాలో 4.60 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. గోదావరి నీటి ప్రవాహం తగ్గుముఖం పడుతుండటంతో పరిస్థితి రోజురోజుకీ ఆందోళనకరంగా మారుతోంది. జిల్లాకు ప్రతిరోజూ 6వేల క్యూసెక్కుల నీరు అవసరమవగా, 4,600 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేస్తున్నారు. దీంతో శివారు పొలాలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకూ 70 శాతం నాట్లు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా వాస్తవానికి 50 శాతం నాట్లు మాత్రమే అయినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి. ఉండి, నరసాపురం తదితర మండలాల్లో శివారు పొలాలకు ఇప్పటికీ నీరందక దమ్ములు చేయని పరిస్థితి నెలకొంది. నాట్లు వేసిన పొలాలకు నీరందక చేలు ఎండిపోతున్నాయి. జనవరి 4 నుంచి వంతులవారీ విధానం ప్రవేశ పెట్టనున్నట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముందుముందు పరిస్థితి ఏమిటనే భయం రైతులకు నిద్రలేకుండా చేస్తోంది. గోదావరి నీటి ప్రవాహం పూర్తిగా పడిపోవడంతో పూర్తిగా సీలేరుపైనే ఆధారపడాల్సిన విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. నీటిఎద్దడి వల్ల సంక్రాంతి పండుగ వరకూ నాట్లు పూర్తయ్యే పరిస్థితులు కన్పించడం లేదు.

రాత్రుళ్లు నిద్రలేకుండా తోడకాలు..

రబీసాగును కాపాడేందుకు డెల్టా రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. నీటిని తోడుకునే కారేలు, మోటార్ ఇంజన్లను ఉపయోగించి రాత్రీపగలు పడిగాపులు కాస్తూ ఉన్న కాస్త నీటినీ తోడుకుంటున్నారు. దీంతో అదనపు ఖర్చు అవుతోంది. వంతులవారీ విధానం అమలైతే తమ పరిస్థితి ఏమిటంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. డెల్టా ఆధునికీకరణ లేక కాలువలు పూడుకుపోయాయి. దీంతో శివారు పొలాలకు నీరందక కొంతమంది రైతులు నాట్లు వేయడం విరమించుకుంటున్నారు. ఒకప్పుడు పుష్కలంగా నీరందే డెల్టా ప్రాంతం నేడు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితికి చేరుకుంది. దీనిపై ఇరిగేషన్ ఎస్‌ఇ ఆర్.రఘునాధన్‌ను వివరణ కోరగా నీటికొరత ఉన్నమాట వాస్తవమేనన్నారు. ఎద్దడి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఈ నెల 4 నుంచి వంతులవారీ విధానం అమలు చేస్తామని చెప్పారు.

నీరందక సాగు చేయడం లేదు

రెండెకరాల పొలం ఉంది. సాగు నీరందడం లేదు. దీంతో రబీసాగు చేయకుండా పొలం బీడుగా వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆక్వా చెరువుల వల్లే ఇటువంటి పరిస్థితి ఏర్పడింది.

- నర్సన్న, రైతు, మహదేవపట్నం

ఇంకా నాట్లు వేయలేదు

రెండెకరాల్లో వరిసాగు చేస్తున్నాను. నారుమడి వేశాను. ముదిరిపోతోంది. ఇంకా నీరందకపోవడంతో నాట్లు వేయలేకపోయాను. నీటి ఎద్దడి సమస్యతో నరకం చూస్తున్నాం. ఎప్పటికి నాట్లు పడతాయో అర్థం కావడం లేదు.

పి.శ్రీను, రైతు, రామచంద్రపురం

నరసాపురంలో ఐదిళ్లు దగ్ధం

రూ.25 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-నరసాపురం

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో మంగళవారం గ్యాస్ లీకవడంతో ఐదు ఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. 13 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. స్థానికులు, అగ్నిమాపక శాఖ, రెవెన్యూ శాఖ అధికారుల కథనం ప్రకారం.. నరసాపురం 22వ వార్డు కొత్తకాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సమీపంలోని ఇంటిలోని మహిళ వంట చేసేందుకు గ్యాస్ వెలిగించి బయటకు వెళ్లింది. కొద్దిసేపటికి గ్యాస్ లీకవడంతో మంటలు ఎగసిపడి ప్రమాదం సంభవించింది. ఫైర్ స్టేషన్ సిబ్బంది సుమారు రెండు గంటలపాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో ఐదు తాటాకు ఇళ్లు పూర్తిగానూ, మరో రెండిళ్లు పాక్షికంగానూ కాలిపోయాయి. ఇళ్లలో ఉన్న బంగారం, వెండి, డబ్బు, దుస్తులు, ఇతర సామగ్రి, పిల్లల చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.25 లక్షల వరకూ ఆస్తినష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. బాధితులను ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, సబ్‌కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఇతర పార్టీల నాయకులు పరామర్శించి, సాయం అందజేశారు.

తెలుగు భాషా వికాసానికి కృషి

పుస్తక మహోత్సవ్‌లో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

తెలుగులోనే భాష వికసించే విధంగా విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. విజయవాడలోని స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవ్‌లో రెండో రోజైన మంగళవారం 'తెలుగు భాష - వికాసం' అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నేడు విద్యా సంస్థల్లో తెలుగు సబ్జెక్టుగానే చదువుతున్నారని, దానితో పాటు తెలుగు సాహిత్యాన్ని కూడా నేటి విద్యార్థులకు చెప్పాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాతృభాషలోనే మాట్లాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆంగ్ల భాష అవసరమని, అది ఉన్నత విద్య కోసం మాత్రమే కావాలని, అవసరమైన సమయంలో ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలని చెప్పారు. ముఖ్యంగా విద్యా సంస్థల్లో తెలుగులోనే ప్రాథమిక విద్యను పూర్తి చేయాలని సూచించారు. తెలుగు భాషా వికాసంలో సాహిత్యం పాత్ర గురించి ప్రముఖ రచయిత వాసిరెడ్డి నవీన్, గ్రంథాలయ పునరుద్ధరణ గురించి రావి శారద, తెలుగు భాష - శాసన సాహిత్యం గురించి ప్రముఖ చరిత్రకారులు ఈమని శివనాగిరెడ్డి ప్రసంగించారు. అనంతరం పుస్తక మహోత్సవ్‌లోఏర్పాటు చేసిన స్టాల్స్‌ను డొక్కా మాణిక్యవరప్రసాద్ సందర్శించి పలు పుస్తకాలను కొనుగోలు చేశారు.



విజయవాడ స్వరాజ్య మైదాన్‌లో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న మాణిక్యవరప్రసాద్

సేవకుడిలా పనిచేస్తా

రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అకాడమీ చైర్మన్‌గా కాకుండా సేవకుడిలా పనిచేస్తానని రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. మహతీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంఘీక నాటకోత్సవాలు రెండో రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడ సిద్ధార్థా ఆడిటోరియంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కళారంగానికి చెందిన వారి అభిప్రాయాలను క్రోడీకరించి ఒక బుక్‌లెట్‌ను తయారు చేశామన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నారులకు పద్య నాటకాలపై ఆసక్తి కలిగించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాటక ప్రదర్శనలు జరిగేలా చేయడం రంగ స్థల కళాకారులను ప్రోత్సహించేందుకు ఎన్ఆర్ఐలు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొస్తున్నారని చెప్పారు. ఈ సభకు సుమధుర కళానికేతన్ అధ్యక్షులు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రంగస్థల దర్శకులు అద్దంకి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రంగ స్థల కళాకారులు డాక్టర్ ఎంసి దాస్, ఢిల్లీ తెలుగు అకాడమీ కార్యదర్శి ఎంవిఎల్ నాగరాజు, మహతీ క్రియేషన్స్ అధ్యక్షులు ఉప్పలూరి సుబ్బరాయశర్మ, మాడుగల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. రెండో రోజు 'భల సింగరి' బాలల నాటిక, 'గుర్తుతెలియని శవం', 'పచ్చ చెందురుడు' నాటికలు ప్రదర్శించారు.

7న సిద్ధాపురం 'ఎత్తిపోతల' ప్రారంభం

ముఖ్యమంత్రి చంద్రబాబు రాక

ప్రజాశక్తి-ఆత్మకూరు

కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ఈ నెల 7వ తేదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ, ఎస్‌పి గోపినాథ్‌జెట్టి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర్‌రెడ్డి సిద్ధాపురం ఎత్తిపోతల పథకం పనులను, సభాస్థలాన్ని, హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఎత్తిపోతల పథకం సబంధించిన స్టేజ్-2 పంప్‌హౌజ్ ప్రాంతాలను పరిశీలించారు. దాదాపు 22 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ పథకానికి సిద్ధాపురం చెరువును నింపడానికి శ్రీశైలం బ్యాక్ వాటర్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి స్టేజీ-1 , స్టేజ్-2 లిఫ్టుల ద్వారా నీరు చేరుతాయి. చెరువు కట్ట కిందనే బహిరంగ సభను నిర్వహించనున్నారు. స్టేజీ-2 వద్ద ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తారు. దీనికి సంబంధించి అన్ని విషయాలను జిల్లా కలెక్టర్, ఎస్‌పి ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

విజయవాడలో అమరావతి మారథాన్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ ప్రతినిధి

ఈ నెల 7న విజయవాడలో నిర్వహిస్తున్న అమరావతి మారథాన్ కార్యక్రమాన్ని యువత జయప్రదం చేయాలని నగర పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ పేర్కొన్నారు. మంగళవారం సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీప్‌ట్రస్ట్ సహకారంతో హాఫ్ మారథాన్ 21కె, 10కె, 5కె రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మారథాన్ రన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారని తెలిపారు. మారథాన్‌లో పాల్గొనే వారు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.అమరావతి మారథాన్ డాట్ రన్ వెబ్‌సైట్‌లో తమపేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరథాన్‌లో 6 నుంచి 7 వేల మంది వరకుపైగా వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి రన్ మారధాన్‌ను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. 21కె రన్ ఐజిఎం నుంచి మంతెన సత్యనారాయణరాజు అతిథి గృహం వరకు, 10కె రన్ ఐజిఎం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు, 5కె రన్ ఐజిఎం నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్ వరకు నిర్వహించనున్నామని తెలిపారు.

తల్లిని హత్య చేసిన కసాయి కొడుకు

ప్రజాశక్తి - వి.కోట

మానవత్వం మంటగలిసింది.. కన్నతల్లిపైనే అఘాయిత్యానికి పాల్పడి, గొంతు నులిమి హత్య చేసిన ఘటన సభ్యసమాజం తలదించుకునేలా చేసింది.. దుండగుడు సుబ్రమణ్యంను విద్యుత్ స్తంభానికి కట్టేసి కొట్టి, గ్రామస్తులు వి.కోట పోలీసులకు సమాచారం అందించారు. చిత్తూరు జిల్లా వి.కోట మండల పరిధిలోని శివునికుప్పానికి చెందిన దంపతులు రామకృష్ణప్ప, భార్య పేరు బెల్లమ్మ(48) పెద్ద కొడుకు సుబ్రమణ్యం వ్యసనాలకు బానిసై జులాయిగా తిరిగేవాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి డబ్బుకోసం తల్లిని వేధించాడు. మత్తులో విచక్షణ కోల్పోయి కన్నతల్లిపైనే అఘాయిత్యానికి వొడిగట్టాడు. అనంతరం గొంతు నులిమి హత్య చేశాడు. మంగళవారం ఉదయం పక్కింటి సమీప బంధువులు ఇంట్లో విగతజీవిగా పడి ఉన్న బెల్లమ్మను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. గ్రామస్తులు సుబ్రమణ్యంను పట్టుకుని చితకబాది విద్యుత్ స్తంభానికి కట్టేశారు. సమాచారం అందుకున్న వి.కోట ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకున్నారు.

మద్యం మత్తులో తగాదా : ఒకరు మృతి

ప్రజాశక్తి- గుర్ల (విజయనగరం జిల్లా)

మద్యం మత్తులో పెట్టుకున్న తగాదా చివరకు ప్రాణాల మీదకు తెచ్చింది. విజయనగరం జిల్లా గుర్ల మండలంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పకీరుకిత్తలి గ్రామానికి చెందిన సబుకు రామారావు అలియాస్ ఈశ్వరరావు (35) మద్యం మత్తులో సోమవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో తన అక్క నీలాద్రి ఇంటి వద్ద గొడవ చేసి ఆ ఇంటి ముందున్న జామి చెట్టును నరికేశాడు. ఇంటి తలుపులను గునపంతో పొడిచాడు. దీంతో అతని తల్లి చిన్నమ్మలు వీధిలోకి వచ్చి కుమారుడు, కుమార్తె మధ్య జరుగుతున్న గొడవను విడిపించాలని స్థానికులను కోరింది. ఆ వీధిలో ఉంటున్న సబుకు శ్రీను వచ్చి రామారావును నిలువరించే ప్రయత్నం చేశాడు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య గొడవ పెరిగింది. ఈ కొట్లాటలో కిందపడిపోయిన రామారావు తలకు బలమైన గాయమైంది. వెంటనే ఆయనను భార్య సింహాచలం చీపురుపల్లిలోని పిహెచ్‌సికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. అదే రోజు రాత్రి 11 గంటలకు రామారావు మృతి చెందాడు. దీనిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

ప్రత్యేకం

రూ.50 లక్షల 'ఎర్ర చందనం' స్వాధీనం

- 14 మంది అంతర్ రాష్ట్ర, స్థానిక స్మగర్లు అరెస్టు
- మూడు మండలాల్లో ఏకకాలంలో దాడులు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

రూ.50 లక్షలు విలువైన 33 ఎర్ర చందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతోపాటు 14 మంది అంతర్ రాష్ట్ర, స్థానిక స్మగర్లను మంగళవారం అరెస్టు చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన విలేకర్ల సమావేశంలో క్రైం ఒఎస్‌డి విఠలేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జిల్లాలోని ఉదయగిరి, రాపూరు, సోమశిల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏకకాలంలో దాడులు నిర్వహించామన్నారు. దాడిలో రాపూరు పరిధిలో నలుగురు, ఉదయగిరిలో ఐదుగురు, సోమశిలలో మరో ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి 33 ఎర్రచందనం దుంగలు, ఎనిమిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరు కడప, నెల్లూరు జిల్లాకు చెందిన వారన్నారు. అటవీ ప్రాంతాల నుంచి ఎర్రచందనం దుంగలను చెన్నైకి తరలిస్తున్నారని, అక్కడి నుంచి కంటైనర్ ద్వారా విదేశాలకు ఎగుమతులు చేస్తున్నారని తెలిపారు. మూడు ప్రాంతాల్లో దాడులు చేసిన పోలీసులపై స్మగర్లు రాళ్లు, కర్రలతో దాడికి యత్నించారన్నారు. పట్టుబడిన వారితో సంబంధాలున్న స్మగర్ల కోసం మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలిస్తున్నామని తెలిపారు.

జిల్లాలో గతేడాది 34 ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులను నమోదు చేసి, 481 మందిని అరెస్టు చేసి, 45 వాహనాలను సీజ్ చేశామన్నారు. గతేడాది రూ.16 కోట్లు విలువైన 16.32 టన్నుల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎక్కడైనా ఎర్రచందనం స్మగ్లింగ్, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా జిల్లా పోలీస్ వాట్సాప్ నెంబర్ 9390777727కు సందేశం పంపాలన్నారు. కార్యక్రమంలో రాపూరు ఎస్ఐ లక్ష్మణరావు, ఉదయగిరి ఎస్ఐ నక్కా ప్రభాకర్, సోమశిల ఎస్ఐ జగన్‌మోహన్‌రావు, కానిస్టేబుళ్లు శిఖామణి, జిలానీ, సుబ్బయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.



దుంగల వద్ద కూర్చొన్న నిందితులతో పోలీసులు

సంక్షిప్తం

ఎసిబికి చిక్కిన విఆర్ఒ

జమ్మలమడుగురూరల్: కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం తహశీల్దార్ కార్యాలయంపై మంగళవారం ఎసిబి అధికారులు దాడులు నిర్వహించారు. సుద్దపల్లెకు చెందిన రైతు రంగస్వామి నుంచి నాలుగు వేల రూపాయలు లంచం తీసుకుంటున్న విఆర్ఒ చంద్రమోహన్‌ను ఎసిబి అధికారులు పట్టుకున్నారు. భూమిని ఆన్‌లైన్ చేసేందుకు విఆర్ఒ డబ్బులు డిమాండ్ చేయడంతో రైతు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు.

యువకుడు అనుమానాస్పద మృతి

రాజాం (శ్రీకాకుళం జిల్లా) :శ్రీకాకుళం జిల్లా రాజాం మండలం గురవాం సమీపంలోని నీలగిరి తోటలో మంగళవారం యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. గురవాంకు చెందిన పాలవలస రాజు (20) గ్రామ సమీపంలోని జ్యూట్ మిల్లులో కార్మికుడుగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో జ్యూట్ మిల్లు ముందు ఉన్న ఖానాపై రాజు ఒంటరిగా కూర్చొని ఉండటాన్ని కొంతమంది చూశారు. మంగళవారం ఉదయానికి చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా ఉన్నాడు.

ప్రకృతి వ్యవసాయంతోనే కర్బన ఉద్గారాల తగ్గుదల

గుంటూరు సిటీ ప్రతినిధి :కర్బన ఉద్గారాలను 22 శాతం తగ్గిస్తామని భారత ప్రభుత్వం ప్రకటించిందని, ఇది కేవలం ప్రకృతి వ్యవసాయం ద్వారా మాత్రమే సాధ్యమని సుభాష్ పాలేకర్ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఎఎన్‌యు) ఎదురుగా బైబిల్ మిషన్ ప్రాంగణంలో పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై రైతు శిక్షణ కార్యక్రమం మంగళవారమూ కొనసాగింది. ఈ సందర్భంగా పాలేకర్ మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో పంటలను తగలబెట్టాల్సిన అవసరముండదని, సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో కంపోస్టును తయారు చేస్తామని చెప్పారు.

సంపాదకీయం

కొరియాలో శాంతి పవనాలు

అమెరికా సామ్రాజ్యవాదం బెదిరింపులు, హూంకరింపులతో ఉద్రిక్తంగా మారిన కొరియా ద్వీపకల్పంలో ఇప్పుడు శాంతి పవనాలు వీస్తున్నాయి. కొత్త సంవత్సరం ప్రారంభంలో ఉభయ కొరియాలు తమ మధ్య విభేదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని నిర్ణయించడం ఆహ్వానించదగ్గ పరిణామం. ఇది కొరియా ద్వీపకల్పానికే కాక, యావత్ ప్రపంచానికే గొప్ప ఊరటనిస్తుంది. ఈ నెల9న ఉభయకొరియాల సరిహద్దుల్లోని పన్‌ముంజామ్‌లో జరిగే సమావేశం ఇరుదేశాల సంబంధాల్లో ఒక కొత్త శకానికి నాంది పలకనుందన్న ఆశాభావం వ్యక్తమౌతోంది. దక్షిణ కొరియా తూర్పు రాష్ట్రమైన ప్యాంగ్ చాంగ్‌లో ఫిబ్రవరిలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌ను కలసికట్టుగా విజయవంతం చేయడం, ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచుకోవడం పైనే ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఉభయ కొరియాల మధ్య తంపులు పెట్టి తమాషా చూస్తున్న అమెరికా సామ్రాజ్యవాదానికి ఇదొక చెంపపెట్టు. ఒక్కటిగా వున్న కొరియాను రెండు ముక్కలు చేసి, కొరియన్లు నిత్యం కలహించుకునేలా చూడాలన్న అగ్రరాజ్య కుతంత్రాలు బెడిసికొడుతున్నాయనడానికి ఇదొక స్పష్టమైన సంకేతం. తొమ్మిదో తేదీ జరిగే చర్చలు ఈ శాంతి ప్రక్రియకు ఒక ఆరంభం మాత్రమే! రెండేళ్ల క్రితం అమెరికా ప్రోద్బలంతో పార్క్ గుయెన్ హై నేతృత్వంలోని అవినీతికర ప్రభుత్వం ఉత్తర కొరియాతో తెగదెంపులు చేసుకున్నది. తరువాత కొన్నాళ్లకే ఆ ప్రభుత్వం అత్యంత అవమానకర రీతిలో నిష్క్రమించింది. పార్క్ గుయెన్ స్థానే అధ్యక్షుడిగా వచ్చిన మూన్ జే ఇన్ అమెరికా అనుకూల వైఖరిని కొనసాగిస్తున్నప్పటికీ ఉత్తర కొరియాతో సంబంధాల విషయంలో సానుకూలత ప్రదర్శించారు. ఉత్తర కొరియాను అస్థిరపరిచేందుకు అమెరికా సామ్రాజ్యవాదుల దుష్ట పన్నాగాలను తిప్పికొట్టడంలో విజయం సాధించిన ఉత్తర కొరియా సాహసోపేత నేత కిమ్ జోంగ్ ఉన్ ఇప్పుడు కొరియా ఏకీకరణపై దృష్టి సారించారు.

కిమ్ జోంగ్ వున్ నాయకత్వంలో ఉత్తర కొరియా శాస్త్ర సాంకేతికరంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించడమే కాక, రక్షణ రంగంలో స్వావలంబన, అణుశక్తిని సంతరించుకుని ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్నది. ఉత్తర కొరియాలో సోషలిస్టు వ్యవస్థను నాశనం చేయాలని చూస్తున్న శత్రువులు పన్నిన పన్నాగాలను, ఐక్యరాజ్య సమితిని అడ్డంపెట్టుకుని ఏకపక్షంగా రుద్దిన ఆంక్షలను దీటుగా ఎదుర్కొని ముందుకు సాగడం మామూలు విషయమేమీ కాదు. తమ ఆటగాళ్ల భద్రతకు గ్యారంటీ లేదన్న సాకుతో వింటర్ ఒలింపిక్స్ నుంచి తప్పుకోవాలని అమెరికా చూస్తున్న తరుణంలో దక్షిణ కొరియాకు బాసటగా నేనున్నానని ఉత్తర కొరియా నేత కిమ్‌జోంగ్ వున్ ముందుకురావడం హర్షణీయ పరిణామం. ఆయన తన నూతన సంవత్సర ప్రసంగంలో ప్యాంగ్ చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌కు తమ క్రీడాకారుల బృందాన్ని పంపుతున్నామని విస్పష్టంగా ప్రకటించారు. ఆ వెంటనే ద్వైపాక్షిక సంబంధాలపై ద. కొరియాతో చర్చలకు సంసిద్ధత తెలియజేశారు. కిమ్ జోంగ్ వున్ తీసుకున్న ఈ వైఖరి ట్రంప్‌ను ఆత్మరక్షణలో పడేసింది. 1945లో కొరియాలోకి అమెరికాసేనలు ప్రవేశించడం ద్వారా మొదలైన అగ్రరాజ్య జోక్యం 1950-53 కొరియా యుద్ధంతో పతాక స్థాయికి చేరింది. లక్ష మందికిపైగా అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఆ భయానక యుద్ధం కొరియా ద్వీపకల్పాన్ని రెండుగా చీల్చింది. ఆ తరువాత ఉత్తర కొరియాను 'దుష్ట రాజ్యం'గా ప్రకటించిన అమెరికా, దానిని అస్థిరపరిచేందుకు వేయని ఎత్తు లేదు. పన్నని కుట్ర లేదు. సోవియట్ యూనియన్, చైనా సహకారంతో చాలా కాలం పాటు వీటిని దీటుగా ఎదుర్కొంటూ వచ్చిన ఉత్తర కొరియా 1990లో సోవియట్ పతనం తరువాత తీవ్ర ఇబ్బందుల్లో పడింది. దక్షిణ కొరియాలోని తన తొత్తు ప్రభుత్వాలను ఉపయోగించుకుని ఉత్తర కొరియాను అణగదొక్కాలని అమెరికా ప్రయత్నించింది. ఇరాన్, ఇరాక్, లిబియాలతోబాటు ఉత్తర కొరియాను దుష్ట రాజ్యాల జాబితాలో చేర్చిన అగ్రరాజ్యం ద. కొరియా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూటమి కట్టి ఆ దేశ సరిహద్దుల్లో సంయుక్త సైనిక విన్యాసాలు నిర్వహించింది. ఈ పరిస్థితుల్లో ఆత్మ రక్షణ కోసం ఉత్తర కొరియా అణు కార్యక్రమాన్ని చేపట్టి అనతి కాలంలోనే అద్భుత పురోగతి సాధించింది. ఏడు దశాబ్దాలుగా అమెరికా సామ్రాజ్యవాదం కల్పించిన ఆటంకాలను అధిగమిస్తూ పురోగమిస్తున్న ఉత్తర కొరియా ఇప్పుడు కొరియన్లనందరినీ ఏకం చేసేందుకు పూనుకుంది. చర్చల ద్వారా ఉభయులకూ ఆమోదయోగ్యమైన రీతిలో కొరియాపునరేకీకరణ సాధించాలి. కొరియా ద్వీపకల్పంలో అమెరికా సామ్రాజ్యవాదులకు చోటు లేదని ఎలుగెత్తి చాటాలి.

ఇదీ విషయం



ఎలుకకు మార్జాల వీణ
నమో పనులు గొప్పవంట...
కొంపలు కూల్చడమే
దేశ ప్రగతి సూచికలట!

ఐఎమ్మెఫ్ కితాబుతో
కాషాయం కులుకుతోంది...
రేపటి పీఠం కోసం
పగటి కలలు కంటోంది!

- కొల్లూరు వెంకట్

స్త్రీ సమానత్వం కోసం సమరం

సందర్భం

నేడు సావిత్రీబాయి పూలే 187వ జయంతి



సావిత్రీ బాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీవిద్యను నిషేధించిన ఆ రోజుల్లోనే స్త్రీలకు విద్యను నేర్పించేందుకు పాఠశాలను ప్రారంభించారు. అగ్ర వర్ణ ఛాందసవాదులు ఆమెపై దాడి చేసి, పేడ నీళ్ళు కొట్టినా ఆమె వెనుకాడలేదు. ప్రతి రోజూ స్కూలుకు అదనంగా ఒక చీరను సంచిలో పెట్టుకుని వెళ్లేవారట. ఏ ఛాందసవాదానికి వ్యతిరేకంగా మహాత్ములు పూలే దంపతులు జీవితాలు అర్పించారో ఆ స్ఫూర్తిని నింపుకోవాలి.

జనవరి 3న సావిత్రీబాయి పూలే జన్మదినం. పూలే దంపతులు అభ్యుదయ విలువల కోసం ఎంతో శ్రమించారు. కుల వ్యవస్థను ప్రతిఘటించారు. కుల దురహంకారాన్ని, అణచివేతను వ్యతిరేకించారు. అణగారిన వర్గాల ప్రజలను, స్త్రీలను అక్కున చేర్చుకున్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలు జరిపించేందుకు 150 సంవత్సరాల క్రితమే పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. అభాగ్య వితంతు మహిళలకు ధైర్యం చెప్పి వారికి, వారి బిడ్డలకు ఆత్మవిశ్వాసం కల్పించారు.

సావిత్రీ బాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు. స్త్రీవిద్యను నిషేధించిన ఆ రోజుల్లోనే స్త్రీలకు విద్యను నేర్పించేందుకు పాఠశాలను ప్రారంభించారు. అగ్ర వర్ణ ఛాందసవాదులు ఆమెపై దాడి చేసి, పేడ నీళ్ళు కొట్టినా ఆమె వెనుకాడలేదు. ప్రతి రోజూ స్కూలుకు అదనంగా ఒక చీరను సంచిలో పెట్టుకుని వెళ్లేవారట.



ఎస్ పుణ్యవతి

అయితే మళ్ళీ ఛాందసవాదం పాత పద్ధతుల్లో విజృంభిస్తోంది. స్త్రీల హక్కులపై దాడి చేస్తోంది. ఆడపిల్లలకి రక్షణ కల్పించడం చేతగాక తిరిగి వారిపైనే అభాండాలు వేస్తోంది. ఇటీవల బెనారస్ హిందూ యూనివర్సిటీ ఘటనల వంటివి కొన్ని ఉదాహరణలు. సాయంత్రం 6 గంటల తర్వాత ఆడపిల్లలు బయట తిరగరాదని, ఇంటికే పరిమితం కావాలని, ఆడవాళ్ళు బయట పని చెయ్యరాదని, 'గృహమే కదా స్వర్గసీమ' అనే భావాలు తిరిగి మొలకెత్తుతున్నాయి. 1-2 సంవత్సరాల పసికూనలపైన కూడా లైంగిక దాడులు ఎందుకు జరుగుతున్నాయో ఈ పాలకులు చెప్పరు. ఇదిలా ఉంటే కొన్ని సందర్భాల్లో మేధావులు, న్యాయ వ్యవస్థలో ఉన్న జడ్జీలు కూడా స్త్రీల హక్కులను, వ్యక్తిత్వాన్ని గుర్తించేందుకు నిరాకరిస్తున్నారు. 498ఏ పై జరుగుతున్న రగడ ఇందుకు ఉదాహరణ.

భారత శిక్షా స్మృతి (ఇండియన్ పీనల్ కోడ్ - ఐపీసీ) 498ఏ ప్రకారం భర్త లేక అతని బంధువులు పెట్టే గృహ హింస నుండి స్త్రీలకు రక్షణ లభిస్తున్నది. కట్నం కోసం గానీ, మరే ఇతర కారణంగా గాని శారీరకంగా లేక మానసికంగా పెట్టే గృహహింస కొన్ని సందర్భాల్లో ఎంత తీవ్రంగా ఉండవచ్చంటే, దానివల్ల బాధిత స్త్రీ జీవితానికి భద్రత లోపించడం, ఆమె ఆరోగ్యానికి హాని కలిగించడం, చివరికి జీవితం పట్ల విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకునే స్థితికి కూడా దారి తీయవచ్చు. నేరం రుజువైతే 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించవచ్చు.

ఒక వేళ బాధిత స్త్రీ కట్నం వేధింపుల కారణంగా చనిపోతే అది హత్య కావచ్చు, ఆత్మహత్య కావచ్చు. నేరస్తులకు సెక్షన్ 30 4బి ప్రకారం శిక్షలు పడవచ్చు. చట్టం దాన్ని వరకట్న మరణంగా భావిస్తుంది.

భారతీయ సమాజంలో ఇప్పటికే మనం ఎంత అభివృద్ధి చెందామనుకుంటున్నా పితృస్వామ్య భావజాలం చాలా బలంగా ఉంది. ఇంకా సమాజంలో పురుషుని లాగే స్త్రీని కూడా సర్వ హక్కులు కలిగిన వ్యక్తిగా చూడటంలేదు. పెళ్లైన స్త్రీ, ఆమె ఎంత చదువుకొని ఉద్యోగమే చేయనీ, వ్యవసాయమే చేయనీ, ఏదో ఒక పని చేసి కుటుంబాన్ని పోషించనీ అత్తవారింటిలో అణగి ఉండాల్సిందే.

భర్త కుటుంబం మంచితనం మీద ఆమె వ్యక్తిగత సుఖం, సంతోషం, వైవాహిక జీవితం ఆధారపడి ఉన్నాయి. సంసార జీవితంలో ఏ ఇబ్బంది వచ్చినా బయటకి పొక్కకూడదు. అదేమంటే సీత, సావిత్రి కథలు ఉండనే ఉన్నాయి. నాలుగు గోడల మధ్య ఏం జరిగినా బయటికి రాదు, సాక్ష్యం దొరకదు.

ఈ స్థితిలో వరకట్న బాధితులైన ఇల్లాళ్ళు మరో మార్గం లేకే చెడి పుట్టింటికి చేరకూడదనే సామెతను రుజువు చేస్తుంటారు. వైవాహిక జీవితంలో సర్దుకు పోతుంటారు. తీరా జరగాల్సింది జరిగి వేధింపులకు గురయినా, హత్య లేక ఆత్మహత్య కారణంగా మరణించినా సాక్ష్యాలు దొరకవు.

ఆ కారణంగానే మహిళా ఉద్యమం ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగా ఐపీసీలో 498 ఏ, 304 బి సెక్షన్లు చేర్చారు.

ఇప్పుడు 498ఏ కి ఎసరొచ్చింది. ఆడవాళ్ళు అమాయకులైన భర్త, అతని బంధువులను వేధించడానికి ఈ సెక్షన్లను దుర్వినియోగం చేస్తున్నారని కోర్టుల్లో వాదనలు, జడ్జీలు కూడా అపోహపడే స్థితి వచ్చింది.

సర్వోన్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు జూలై 27న ఒక తీర్పునిచ్చింది. ఆ తీర్పు ప్రకారం 498ఏ కింద బాధిత మహిళ ఏదైనా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేస్తే, వెంటనే అరెస్టు చేయడానికి లేదు. ప్రతి జిల్లాలో ముగ్గురు పెద్ద మనుషులతో 'ఫ్యామిలీ వెల్‌ఫేర్ కమిటీ'లను ఏర్పాటు చేస్తారు. వచ్చిన కేసులను ఈ కమిటీలు పరిశీలించిన తర్వాత వేధించిన భర్త అతని బంధువుల్ని అరెస్టు చేయ్యాలా! వద్దా? అనే విషయం పోలీసు వారు నిర్ధారిస్తారన్నమాట. ఏ చట్టానికి లేని ముందస్తు తనిఖీలు ఈ చట్టానికెందుకో!

కానీ వాస్తవాలు కోర్టు ఆలోచనా విధానానికి భిన్నంగా ఉన్నాయి. 2015లో ప్రకటించిన ప్రభుత్వ రిపోర్టు ప్రకారం వరకట్న మరణాలు 2014లో 8,455, 2013లో 8,083 నమోదయ్యాయి. అంటే సరాసరిన రోజుకు 21 మంది వరకట్నం కారణంగా మరణిస్తున్నారు. గృహ హింస కేసులు ఒక్క 2015లో లక్షా 13 వేలు నమోదయ్యాయి. వైవాహిక జీవితంలో స్త్రీలు పడే హింసకు, స్త్రీ అస్వాతంత్ర్యానికి ఇవి నిదర్శనం.

మహిళా సంఘాలు సుప్రీంకోర్టు ముందు ఆందోళన చేయడం, ప్రధాన న్యాయమూర్తికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. కారణాలు ఏమైనా కోర్టు పునరాలోచనలో పడింది.


గతంలో ఇచ్చిన తీర్పులో చెప్పినట్లు కోర్టులకున్న న్యాయాధికారాలను ఫ్యామిలీ వెల్‌ఫేర్ కమిటీలకు బదలాయించడం సరైందికాదని చెప్తూ గతంలో ఇచ్చిన తీర్పును పునర్విచారణకు స్వీకరించింది.

అందువల్ల ఈ దశలో పౌర సమాజం స్పందించి అత్యున్నత న్యాయస్థానానికి మన ఆవేదన నివేదించడం అవసరం.

జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతి. ఏ ఛాందసవాదానికి వ్యతిరేకంగా మహాత్ములు పూలే దంపతులు జీవితాలు అర్పించారో ఆ స్ఫూర్తిని నింపుకోవాలి. కుటుంబ జీవితంలో స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం వేలాది స్త్రీపురుషులు సంతకాలు చేసి సుప్రీంకోర్టుకు మహజరు సమర్పించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ భావించింది.

సోషల్ మీడియా

మధ్య తరగతి మనస్తత్వం



రూపాయి బియ్యం తినలేం..
50 రూపాయలకి బియ్యం కొనలేం
మున్సిపల్ నీళ్ళు తాగలేం..
మినరల్ వాటర్ కొనలేం
ఇందిరమ్మ ఇళ్ళలో ఉండలేం..
కలల ఇల్లు కట్టుకోలేం
ప్రభుత్వ బడికి పంపలేం..
కార్పొరేట్ ఫీజులు కట్టలేం
సర్కారు దవాఖానా కు పోలేం..
కార్పొరేట్ బిల్లులు కట్టలేం
సిటీ బస్సుల్లో వెళ్ళలేం..
బండికి పెట్రోలు కొనలేం
ఎందుకంటే..మనం మిడిల్ క్లాస్..కాబట్టి.!!!

...

కులం పోవాలని చెప్పేది మనమే..
కులం చూసి ఓటు వేసేది మనమే..
అవినీతి పోవాలనేది మనమే..
అవకాశం. వస్తే అవినీతిని సమర్ధించేది మనమే..
ఇంటికో భగత్ పుట్టాలని చెప్పేది మనమే..
మన ఇంట్లో మాత్రం బిల్ గేట్స్ పుట్టాలని కోరుకునేది మనమే..
మార్పు రావాలని చెప్పేది మనమే..
అబ్బే పబ్లిక్ మారరండీ అంటూ నిరాశ నూరిపోసేది మనమే..
అందుకే.. మనం జస్ట్ ప్రభుత్వానికి పన్నులు కట్టే ....
వెర్రి గొర్రెలం..
ఇది ఎవరు రాసారో కానీ ... వాట్సప్‌లో ఎవరో షేర్ చేశారు...

ఎవరు దేవుడు..?



అదేదో ఊరి నుండి పెద్ద శిల్పి వచ్చాడు
మరేదో ఊరి నుండి పెద్ద బండ తెచ్చాడు
ఆరడుగుల కొలత పెట్టి బండను ఖండించాడు
మిగిలిన మూడడుగుల ముక్కను పక్కకు తోసేసాడు
ఆరడుగుల బండేమో విగ్రహమై వెలసింది
మూడడుగుల ముక్క బండ చాకిరేవు చేరింది
కంపు కంపు మనసులన్ని దేవుని ఎదుట నిలిచాయి
కంపుకొట్టే బట్టలన్నీ బండచట్టూ చేరాయి
గొంతెమ్మ కోర్కెల గొంతులన్ని తీర్థంతో తడిచాయి
మురికి మరకల బట్టలన్నీ నీటిలో మునిగాయి
అర్థం కాని స్తోత్రాలతో పూజారి భక్తి శ్రద్ధలు
చాకలి నోటి వెంట ఇస్సు ఇస్సు శబ్దాలు
శఠగోపం పవిత్రంగా ప్రతి తలనూ తాకుతోంది
పవిత్రతకై ప్రతి బట్ట బండను బాదుతోంది
కడకు గుడి నుండి మనసులన్ని కంపుతోనే వెళ్లాయి
రేవు నుండి బట్టలన్నీ ఇంపుగా వెళ్లాయి
గుడిలోని దేవుడా... రేవులోని బండ...?
ఎవరు దేవుడు..?

సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్న సినీ నటుడు రంగనాథ్ చివరి కవిత

మంచిదే...

సోషల్ మీడియాలో ఆడవాళ్లను కించపరుస్తూ పోస్టులు పెడితే చర్యలు తప్పవు.

- హోంమంత్రి ప్రకటన.

అయితే కాల్‌మనీ, సెక్స్ రాకెట్ నడిపినప్పుడూ, ఎమ్మార్వోని ఇసుకలో వేసి తొక్కినప్పుడూ చర్యలు తీసుకుంటే ఇంకా మంచిది కాదా...

జన వాక్యం

నాటి వాగ్దానాలేవి?


సరిగ్గా 35 ఏళ్ల క్రితం తిరుపతిలో జరిగిన తెలుగుదేశం పార్టీ మహాసభలో (1982) తెలుగుభాష, జాతి వికాసం కుంటుపడటానికి సంస్కృతం, పర్షియా, ఇంగ్లీషు భాషలను పూర్వ పాలకులు నెత్తిన పెట్టుకున్నారన్నారు. ఆ సందర్భంగా రాష్ట్రంలో విశ్వవిద్యాలయ స్థాయి వరకు అన్ని రకాల పాఠ్యాంశాలనూ తెలుగు భాషా మాధ్యమంలోనే నేర్పుతామనీ, పరిపాల నంతా తెలుగులోనే నిర్వహిస్తామనీ విస్పష్టంగా తీర్మానించారు కూడా. అంతేకాక హిందీని, ఇంగ్లీషును, ఐచ్ఛిక (ఆప్షనల్) భాషలుగా మాత్రమే నేర్పుతామని హామీ ఇచ్చారు. అయితే తీర్మానించిన తొలి రోజుల్లోనే తెలుగులోనే పాలన- తెలుగులోనే బోధన జరిగింది. కానీ ప్రస్తుతం ప్రయివేటు విద్యతోపాటు ప్రభుత్వ పాఠశాలలూ, మున్సిపల్ బడులలో కూడా ఇంగ్లీషే ఏకైక బోధనా మాధ్యమంగా అమలు జరుపుతామంటున్నారు. 'తెలిసిన జ్ఞానం ద్వారా తెలియని జ్ఞానం, తెలిసిన భాష ద్వారా తెలియని భాష నేర్చుకోవడం' ప్రపంచ వ్యాప్తంగా అమలవుతున్న విద్యా విధానం. అయినా నిరుద్యోగ సమస్యకు పాలకులు అనుసరిస్తున్న ఆర్థిక-రాజకీయ విధానాలే కారణం అవుతాయి. అంతేకాని, తెలుగు భాషా మాధ్యమ చదువులు ఎంత మాత్రం కావు. నిజానికి మాతృభాష ద్వారా ఎంత ఎక్కువ విషయ పరిజ్ఞానమూ, భాషాతత్వ పరిజ్ఞానమూ గడిస్తే అంత సులువుగా, ఇతర భాషలను నేర్చుకోవడం సాధ్యమన్నది జగమెరిగిన సత్యం. మరి ఎందుకింత తతం గం నడుపుతున్నారు. మున్సిపల్ బడులను కార్పొరేట్ శక్తులకు లీజుకిచ్చే దీర్ఘకాలిక కుట్రలో భాగమే ఇది. ఐదు నెలల క్రితం తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తామని గిడుగు జయంతి నాడు వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి-ఇప్పుడు 'సర్వం ఇంగ్లీషు మాధ్యమ మయం' అనే నిర్ణయం తీసుకున్నారు. ఇది తెలుగు భాష, జాతి, సంస్కృతులకు భవిష్యతు లో మరింత విఘాతం కలిగించే నిర్ణయం. కనుక యావన్మంది తెలుగు ప్రజానీకం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తిరస్కరించాలి.

జనసాహితి

కరెంటు ఛార్జీలు నిజంగానే పెరగవా?

విశ్లేషణ

కరెంటు ఛార్జీలు పెంచబోమని రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలు సాధారణ ప్రజా ప్రతినిధుల వరకు అందరూ గొప్పగా చెబుతున్నారు. దానికి అనుగుణంగానే రెండు డిస్కాంలు (ఇపిడిసిఎల్, ఎస్‌పిడిసిఎల్) విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్‌కు (ఎపిఈఆర్‌సి) సమర్పించిన 2018-19 ఆదాయ అవసరాల నివేదిక (ఎఆర్ఆర్)లో విద్యుత్ ఛార్జీల పెంపుదలను ప్రతిపాదించడం లేదని పేర్కొన్నాయి. రాష్ట్రంలో వచ్చే ఏడాది కరెంటు ఛార్జీలు పెరగబోవని ప్రజలు అనుకోవచ్చు. కానీ నిజం వేరుగా వుంది. ఈ ప్రకటనలు, ప్రతిపాదనల వెనుక భారాలను వాయిదా వేసే కుట్ర దాగి వుంది.



భారీ లోటు.. భర్తీ మార్గం లేదు..

రానున్న ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ కొనుగోలు, పంపిణీ, ఇతర ఖర్చులన్నింటికి కలిపి రూ. 21,429 కోట్లు అవసరం అవుతాయని, తమకు రూ.15,211 కోట్ల ఆదాయం లభిస్తుందని ఎస్‌పిడిసిఎల్ పేర్కొనగా ఇపిడిసిఎల్ రూ. 10,273 కోట్ల ఆదాయం, రూ. 12,036 కోట్ల ఖర్చు అంచనాగా తెలిపింది. రెండు డిస్కాంలు కలిపి 7,982 కోట్ల రూపాయల లోటు వుంటుందని పేర్కొన్నప్పటికీ దాన్ని ఎలా భర్తీ చేస్తారో మాత్రం తెలపలేదు. వ్యవసాయ విద్యుత్ వినియోగానికి సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తున్నది. ఇంకొన్ని ప్రభుత్వ పథకాలకు ప్రకటించిన మొత్తాలను కూడా సమకూరుస్తుంది. అయితే డిస్కాంల ఆదాయ లోటు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏనాడూ భర్తీ చేయలేదు... చేయదు కూడా. కాబట్టి డిస్కాంలు తమ ఎఆర్ఆర్‌లో లోటు భర్తీకి మార్గాన్ని తెలపలేదంటే అందుకు సంబంధించిన వడ్డన భవిష్యత్‌లో వినియోగదారుల నెత్తిన పడడం ఖాయం.



బి తులసీదాస్

ఇప్పటికే 2016-17, 2017-18 సంవత్సరాలకు సంబంధించిన ఆదాయ లోటు భర్తీ కావాల్సి వుంది. ఎస్‌పిడిసిఎల్‌కు రూ.3,851 కోట్లు, ఇపిడిసిఎల్‌కు రూ.1,074 కోట్లు ఉందని పేర్కొన్నారు. రూ.4,925 కోట్లకు సంబంధించిన ట్రూఅప్ ఛార్జీల ప్రతిపాదన విడిగా చేసేందుకు అనుమతించాలని ఎపిఈఆర్‌సిని డిస్కాంలు కోరాయి. కాబట్టి రూ. ఐదు వేల కోట్ల భారం పొంచి వుంది. సాధారణంగా అంతకు ముందరి సంవత్సరపు ఆదాయ లోటు గురించి ట్రూఅప్ ఛార్జీల రూపంలో ఇప్పుడే ప్రతిపాదన పెట్టాలి. నిజానికి 2016-17 సంవత్సర ఆడిట్ 2017 సెప్టెంబర్ 30లోగా పూర్తవుతుంది. లెక్కలన్నీ అందుబాటులో వున్నా ట్రూఅప్ ప్రతిపాదనలు డిసెంబర్‌లో కూడా చేయకుండా అదనపు గడువు కోరడంలోనే మర్మం దాగి వుంది. రెండేళ్ళుగా ఆ పని చేయని డిస్కాంలు తరువాతి సంవత్సరం కూడా అలాగే కొనసాగే అవకాశం వుంది. సాధారణ ఎన్నికలు 2019లో జరుగుతాయి కాబట్టి వినియోగదారులు మూడేళ్ళ ఆదాయలోటు భర్తీకి భారీ భారాలను ఎన్నికల తరువాత మోయాల్సి వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ ఎత్తుగడను డిస్కాంల ద్వారా ఇలా అమలు చేయిస్తున్నది.

అవసరం ఎక్కువ.... లభ్యత తక్కువట!

ఏ.పి.ఈఆర్‌సికి గత మూడేళ్ళుగా డిస్కాంలు సమర్పించిన ఎఆర్ఆర్‌లు పరిశీలిస్తే అవి ఎలా పొరపాటు ప్రతిపాదనలో కింది పట్టిక చూస్తే తెలుస్తుంది. ఈపట్టికలో మొదటివి డిస్కాంల ప్రతిపాదనలు కాగా బ్రాకెట్లలో వున్నవి ఎపిఈఆర్‌సి నిర్ధారించినవి.

సంఖ్య	సంవత్సరం	లభ్యత	అవసరం
1	2015-16	69,300 (55,624)	58,191 (54,224)
2	2016-17	66,591 (67,277)	57,564 (56,804)
3	2017-18	67,947 (68,597)	57,017 (56,583)

వాస్తవంగా 2015-16లో 49.514 మి.యూ మాత్రమే వినియోగించబడింది. అంటే డిస్కాంల ప్రతిపాదనకు వాస్తవ వినియోగం 15 శాతం తగ్గింది. కాబట్టి రానున్న ఏడాదికి ప్రతిపాదించిన 61,543 మి.యూ. వినియోగం కూడా వుండకపోవచ్చు. రాష్ట్రంలో విద్యుత్ లభ్యత ఉన్నదాన్ని తక్కువ చేసి చూపుతున్నారు. పై పట్టిక చూస్తే గత రెండేళ్ళలో సుమారు వెయ్యి మిలియన్ యూనిట్లు తక్కువగా పేర్కొన్నారు. అవసరాన్ని ఎక్కువగా చూపడం, లభ్యతను తగ్గించి పేర్కొనడం వల్ల అంచనాలు భారీగా తప్పుతున్నాయి. అంతేగాక కొన్ని సందర్భాల్లో అధిక ధరలకు మార్కెట్‌లో విద్యుత్ కొనుగోలు చేసి భారాలు ప్రజలపై వేస్తున్నారు.

ప్రయివేటు కోసమేనా?

కేంద్ర ప్రభుత్వ విద్యుదుత్పత్తి కేంద్రాల నుండి 16,112 మి.యూ. లభ్యత ఉన్నప్పటికీ బొగ్గు, ఇతర కొరతల మూలంగా 13,169 మి.యూ. మాత్రమే తమకు లభిస్తుందని డిస్కాంలు పేర్కొన్నాయి. కేంద్ర బొగ్గు శాఖ మంత్రి గనుల చుట్టూ బొగ్గు గుట్టలుగా పడి వుందని ప్రకటనలు చేస్తున్న నేపథ్యంలో ఇది మరీ విడ్డూరం. కేంద్ర విద్యుదుత్పత్తి సంస్థల నుండి మనకు రావాల్సిన వాటాను తెచ్చుకోవాలి. మనం తీసుకోకపోయినా పిపిఎల ప్రకారం ఆ తగ్గించుకున్న 2,943 మి.యూ.లకు వారికి ఫిక్స్‌డ్ ఛార్జీలు డిస్కాంలు చెల్లించాల్సిందే. ఇలాంటి చర్యల వల్ల డిస్కాంలు నష్టపోవడమేగాక వినియోగదారులపై భారం పడుతుంది. నెల్లూరులోని (జెన్‌కో) థర్మల్ పవర్ స్టేషన్లలో 80 శాతం పిఎల్ఎఫ్‌తో పని చేయించినా 35,110 మి.యూ. ఉత్పత్తి అవుతుంది. కానీ డిస్కాంలు 27,452 మి.యూ. లభిస్తుందని పేర్కొన్నాయి. సహజవాయువు ఆధారిత వేమగిరి, కోనసీమ, జివికె విస్తరణ, గౌతమి వంటి ప్లాంట్లు 80 శాతం పిఎల్ఎఫ్‌తో పని చేసిన 4,835 మి.యూ. విద్యుత్ వస్తుంది. కానీ సహజవాయువు లభించదన్న సాకు చూపి ఈ ప్లాంట్ల విద్యుదుత్పత్తినే డిస్కాంలు పరిగణలోనికి తీసుకోలేదు. లభ్యతను తక్కువగా చూపి ప్రయివేటుకు పెద్దపీట వేస్తున్నారు.

పిపిఎల గడువు ముగిసిపోయిన నేపథ్యంలో ల్యాంకో, స్పెక్ట్రం, గోదావరి గ్యాస్ ప్లాంట్ల నుండి స్వల్పకాలిక ప్రాతిపదిక మీద 2017-18 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే విద్యుత్ కొనుగోలు చేయవచ్చునని 2017 నవంబర్, 29న ఎపిఈఆర్‌సి తీర్పునిచ్చింది. అయినా 2018-19లో ఈ మూడు ప్లాంట్ల నుండి 2,711 మి.యూ. కొనుగోలు చేస్తామని డిస్కాంలు ప్రతిపాదించడం అక్రమమే అవుతుంది. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ విద్యుదుత్పత్తి కేంద్రాల నుండి, హిందూజ తదితర ప్లాంట్ల నుండి నిర్ణీత స్థాయిలో విద్యుత్ పొందితే తప్పక మిగులులోనే వుంటాం. కానీ ల్యాంకో, స్పెక్ట్రం వంటి గడువు మీరిన, ఎపిఈఆర్‌సి అనుమతి పొందని ప్లాంట్ల నుండి విద్యుత్ కొనుగోలు చేయడానికే డిస్కాంలు లభ్యతను తక్కువగా చూపించాయన్న విద్యుత్ రంగ నిపుణుల విమర్శ అక్షర సత్యం.

సంప్రదాయేతరం పేరిట....

జీవ ఇంధన వనరులు, సౌర, పవన విద్యుత్ వినియోగాన్ని పెంచడం కోసం డిస్కాంలు తమ విద్యుత్ అవసరాల్లో 9 శాతాన్ని సంప్రదాయేతర ఇంధన వనరుల నుండి కొనుగోలు చేయాలని నిబంధన ఉంది. కాని, ఎపి డిస్కాంలు మాత్రం ఏకంగా 22.34 శాతాన్ని కొనుగోలు చేస్తామని ప్రతిపాదించడం ఆశ్చర్యకరం. ధర కూడా అమాంతంగా సగటున రూ.4.99 గా నిర్ణయించారు. పవన విద్యుత్‌ను రూ. 3.46కు మించరాదని గుజరాత్‌లో, అలాగే కర్నాటకలో రూ.3.61కు మించరాదని అక్కడి రెగ్యులేటరీ కమిషన్లు నిబంధన విధించాయి. సాంకేతిక అభివృద్ధి, విద్యుదుత్పత్తి సంస్థల మధ్య పోటీ మూలంగా సౌర, పవన విద్యుత్ ధరలు భారీగా తగ్గుతున్నాయి. ఈ సానుకూల పరిణామాన్ని ఉపయోగించుకుని వినియోగదారులకు చౌకగా విద్యుత్ అందించే ప్రయత్నాలు చేయాల్సిన డిస్కాంలు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అన్యాయం.

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను పొరుగు రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సరం నుండి ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాను తన ఎన్నికల ప్రణాళికలోని 9 గంటల మేరకైనా పెంచకపోవడం అన్యాయం. అదే విధంగా వ్యవసాయంలో భాగంగా జరుగుతున్న బెల్లం గానుగలకు (షుగర్‌కేన్ క్రషర్స్) విద్యుత్ ఛార్జీలను కనీసం సన్న, చిన్నకారు రైతులకైనా తగ్గించాలి. అలాగే ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు ముఖ్యంగా సన్న, చిన్నకారు ఉత్పత్తిదారులకు రాయితీలివ్వడం, రక్షణ కల్పించడం అవసరం. ఒకవైపు మిగులు విద్యుత్ రాష్ట్రం అంటూ, ఉన్న జెన్‌కో విద్యుదుత్పత్తి కేంద్రాలను సైతం పూర్తిగా పని చేయించకుండా భారీ విధ్వంసానికి కారణమయ్యే కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంటు వంటి వాటికి ప్రభుత్వం పూనుకోవడం అనుచితం. అలాగే విద్యుదుత్పత్తి కేంద్రాల పేరుతో వేల ఎకరాల భూమిని (నెల్లూరు జిల్లాలోనే దాదాపు 18 వేల ఎకరాలు గుంజుకున్నారు) చేజిక్కించుకున్న కంపెనీల నుండి ఆ భూములను తీసుకొని సంబంధిత రైతులకు అప్పగించాలి.

విద్యుత్ వినియోగదారులకు నష్టకరంగా డిస్కాంలు చేసిన ప్రతిపాదనలను రెగ్యులేటరీ కమిషన్ తిరస్కరిస్తుందని ప్రజలు ఆశిస్తున్నారు. డిస్కాంలు 2016-17 ట్రూఅప్ ఛార్జీల ప్రతిపాదనలు ఇప్పుడే చేసి, వాటిపై బహిరంగ విచారణ జరపాలి. అలాగే 2018-19కి సంబంధించి ఎలాంటి ట్రూఅప్ ప్రతిపాదనలను అనుమతించబోమని ఎపిఈఆర్‌సి స్పష్టం చేయాలి. అలా అయితేనే ముఖ్యమంత్రి మొదలు ఛోటా, మోటా నాయకుల వరకు అందరూ చెబుతున్న 'కరెంటు ఛార్జీల్లో పెంపుదల లేదు' అన్న ప్రకటన నిజమవుతుంది. లేకపోతే అది జిమ్మిక్కుగా మిగిలిపోతుంది. ప్రజలపై అదనపు భారాలను వేయకుండా సర్కారును ఎపిఈఆర్‌సి నిరోధించాలి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపించాల్సిన చిరునామా
editpageps@gmail.com

ప్రజాశక్తి
జీవన the family
JEEVANA
jeevanapageps@gmail.com



కరకరల సంక్రాంతి



అందమైన రంగవల్లులతో ఇప్పటికే సంక్రాంతి శోభ, సందడి మొదలైంది. రుచికరమైన పిండివంటలకు సన్నాహాలూ ఆరంభమయ్యాయి. ఇప్పటికే పప్పులు, బియ్యాలు కడిగేసి, ఆరబోసే పని మొదలయ్యే ఉంటుంది కదా! కొంతమందికి కారా అంటే ఇష్టం.. మరికొందరికి స్వీటంటే ఇష్టం. ఈ పండక్కి రెండూ తప్పకుండా చేసుకోవడం ఆనవాయితీ. మరిప్పుడు రొటీన్‌గా కాకుండా జంతికలు, కారప్పూస, మురుకులు, సకినాలు,చెక్కల్నే వెరైటీగా ఎలా తయారుచేయాలో ఈ వారం తెలుసుకుందామా...

జొన్నపిండి జంతికలు



కావల్సిన పదార్థాలు : జొన్నపిండి - నాలుగు కప్పులు, వెన్న లేదా నెయ్యి - చెంచా, ఉప్పు - తగినంత, జీలకర్ర - అరచెంచా, నువ్వులు - చెంచా, పచ్చిమిర్చి పేస్టు - ఒకటిన్నర చెంచా, అల్లంవెల్లుల్లి పేస్టు - పావుచెంచా, వాము - పావుచెంచా, నూనె - వేయించడానికి సరిపడా.

తయారు చేసే విధానం : ఓ గిన్నెలో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ తీసుకుని బాగా కలపాలి. ఆ తరవాత వేడినీళ్లు పోస్తూ గట్టిగా ముద్దలా కలపాలి. ఇప్పుడు పాన్‌లో నూనె వేడిచేసి మంట తగ్గించాలి. గోరువెచ్చని నీటితో చేయిని తడిచేసుకుని తరవాత పిండిని తీసుకుని జంతికల గొట్టంలో ఉంచి నూనెలో జంతికల్లా వేయాలి. ఎర్రగా వేగాక తీస్తే సరిపోతుంది. జొన్నపిండి జంతికలు సిద్ధం.

సగ్గుబియ్యం మురుకులు



కావల్సిన పదార్థాలు : బియ్యంపిండి- రెండు కప్పులు, సెనగపిండి- అరకప్పు, వేయించిన సెనగపప్పుపిండి- అరకప్పు, సగ్గుబియ్యం- అరకప్పు, ఉప్పు- రుచికి సరిపడా, పెరుగు- అరకప్పు, కారం- టీస్పూను, వాము- పావుటీస్పూను

తయారుచేసే విధానం : సగ్గుబియ్యాన్ని మజ్జిగలో మూడు గంటలు నాననివ్వాలి. బియ్యపిండిలో మిగిలిన పిండ్లన్నీ కలపాలి. పెరుగు, ఉప్పు, కారం, వాము వేసి కలపాలి. సుమారు అరకప్పు నూనె వేడి చేసి పిండి మిశ్రమంలో కలపాలి. తరవాత మజ్జిగలో నానబెట్టిన సగ్గుబియ్యం కూడా వేసి కలపాలి. ఇప్పుడు తగినన్ని నీళ్లు పోసి చపాతీ పిండిలా కలుపుకోవాలి. పిండి ముద్దని జంతికలు లేదా మురుకుల గొట్టంలో పెట్టుకుని కాగిన నూనెలో జంతికల మాదిరిగానే చుట్టి, మీడియం మంటమీద వేయించి తీయాలి.

కారం సకినాలు



కావల్సిన పదార్థాలు : బియ్యం - నాలుగు కప్పులు, నువ్వులు - అరకప్పు, వాము - మూడు చెంచాలు, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా, కారం, జీలకర్రపొడి - రెండు చెంచాల చొప్పున, వెల్లుల్లి ముద్ద - పావుకప్పు.

తయారుచేసే విధానం : బియ్యాన్ని కడిగి నీళ్లలో నాలుగైదు గంటలు నానబెట్టాలి. తరవాత నీళ్లు వంపేసి బియ్యాన్ని బట్టమీద ఆరబెట్టాలి. బియ్యంలోని నీరంతా పోయి కాస్త తడిగా ఉన్నప్పుడే పిండి పట్టించుకోవాలి లేదా మిక్సీలో వేసి మెత్తని పిండిలా చేసుకోవాలి. ఇప్పుడు పాన్‌లో నువ్వుల్ని వేయించుకుని ఈ పిండిలో వేసేయాలి. అందులోనే వామూ, తగినంత ఉప్పు, వెల్లుల్లి ముద్ద, కారం, జీలకర్రపొడి వేసి నీళ్లు పోసుకుంటూ మురుకుల పిండిలా కలిపి పెట్టుకోవాలి. నిమ్మకాయంత సైజులో పిండిని తీసుకుని వేళ్లతో తడిబట్ట మీద గుండ్రంగా మూడు నాలుగు చుట్లొచ్చేలా చుట్టుకోవాలి. ఇలా మిగిలిన పిండినీ చేసుకుని నూనెలో ఒకటిరెండు చొప్పున వేసి వేయించుకుని తీసుకోవాలి. చల్లారాక డబ్బాలో వేసుకుంటే వారం రోజుల వరకూ నిల్వ ఉంటాయి.

ఆలూ చెక్కలు



కావల్సిన పదార్థాలు : నానబెట్టుకున్న బియ్యంతో చేసిన పిండి - కప్పు, బంగాళాదుంప ముద్ద - అరకప్పు (రెండు బంగాళాదుంపల్ని ఒక కూత వచ్చేవరకూ ఉడికించుకుని తీసుకోవాలి), నీళ్లలో నానబెట్టిన సెనగపప్పు - టేబుల్‌స్పూను, గింజలు తీసేసిన ఎండుమిర్చి పొట్టు - చెంచా, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా.

తయారుచేసే విధానం : ఓ గిన్నెలో బియ్యపిండి, బంగాళాదుంప ముద్దా, నానబెట్టిన సెనగపప్పు, ఎండుమిర్చి పొట్టూ, తగినంత ఉప్పు, టేబుల్‌స్పూను కాచిన నూనె వేసుకుని బాగా కలపాలి. అందులోనే కొద్దికొద్దిగా నీళ్లు పోసుకుంటూ చపాతీ ముద్దలా కలిపి పిండిని పదిహేను నిమిషాలు నాననివ్వాలి. తరవాత ఈ పిండిని చెక్కల్లా తట్టుకుని కాగుతోన్న నూనెలో వేసుకోవాలి. ఎర్రగా వేగాక తీసేస్తే సరిపోతుంది. ఇవి కరకరలాడుతూ ఉంటాయి. పదిహేను రోజులవరకూ నిల్వ ఉంటాయి.

కొబ్బరి చెగోడీలు



కావల్సిన పదార్థాలు : బియ్యంపిండి - ఒకటిన్నర కప్పు, తాజా కొబ్బరి తరుగు - అరకప్పు, పెసరపప్పు - టేబుల్‌స్పూను, కారం - చెంచా, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా.

తయారుచేసే విధానం : పెసరపప్పును అరగంట ముందు నానబెట్టుకోవాలి. కొబ్బరి తురుమును నీళ్లు చల్లుకుని మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. అడుగు మందంగా ఉన్న గిన్నెలో ఒకటిన్నర కప్పు నీళ్లు తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. అవి మరిగాక మూడు చెంచాల నూనె, కొద్దిగా ఉప్పు, నానబెట్టిన పెసరపప్పు, కారం, కొబ్బరి ముద్ద, బియ్యపిండి వేసుకుంటూ కలిపి మంట తగ్గించాలి. రెండు నిమిషాలకు అది గట్టిగా అవుతుంది. అప్పుడు దింపేయాలి. ఇది చల్లగా అయ్యాక చేతులకు నూనె రాసి, చేగోడీల్లా చేసుకోవాలి. వీటిని కాగుతోన్న నూనెలో వేసి వేగాక తీసేసుకుంటే సరిపోతుంది.

షుగర్‌ను కంట్రోలు చేస్తుంది

జొన్నపిండిలో చాలా శక్తి ఉంటుంది. దీనిలో విటమిన్‌బితోపాటుగా ఫైబర్ ఉంటుంది. కాల్షియం మరియు ఐరన్‌కూడా ఎక్కువగా ఉంటాయి. ఫైబర్ షుగర్‌ను కంట్రోలుచేస్తూ కొలెస్ట్రాల్‌ను అదుపుచేస్తుంది. బియ్యంపిండి, సగ్గుబియ్యంతో చేసే పదార్థాలలో ప్రొటీన్ శాతం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల మనం తినే ఆహారం త్వరగా అరుగుతుంది. ఆలూలో విటమిన్-ఏ ఉండటంవల్ల ఇది కళ్లకు, చర్మానికి చాలా మేలుచేస్తుంది. కొబ్బరి మలబద్ధకం నుంచి దూరం చేస్తుంది.



- జానకి బడుగు,
పోషకాహార నిపుణులు.

జీవన సౌరభం

మార్చలేని గతాన్ని గురించి ఆలోచించకుండా, చేతిలో ఉన్న భవిష్యత్తు కోసం శ్రమించు.

రమణుల రంగవల్లి

పి.వి ప్రత్యూష
పరాశర భారతి స్కూలు దగ్గర
సింగరాయకొండ
ప్రకాశం జిల్లా


26 చుక్కలు
8వరుసలు
8వచ్చేవరకు,
సరిచుక్క



బహుమతి పొందిన ముగ్గు



ఎ.అశ్విని
పెద్దాపురం



21 చుక్కలు ,1వరుసలు
సరిచుక్క

11 చుక్కలు
11వరుసలు
సరిచుక్క



వై. కీర్తిరెడ్డి
పురంధరపురం
పిచ్చిరెడ్డిపాలెం
నెల్లూరుజిల్లా



ఎల్. చరిత
మర్రిపూడి
ప్రకాశంజిల్లా



15 చుక్కలు,
8 వచ్చేవరకు
మధ్యచుక్క



26 చుక్కలు 26 సార్లు




డి. వందన
వెంకటగిరి,
యూసఫ్‌గూడ
హైదరాబాద్



మా చిరునామా:
జీవన,'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevana-pageps@ gmail.com
ఫోన్ నెం.
9490099006

మీ కోసం



తుప్ప పట్టిన సూదులను సోప్‌లో గుచ్చితే తుప్ప పోతుంది. వినియోగానికి వీలుగా తయారవుతుంది.

సెన్సెక్స్ ↓ 0.49
33,812

నిఫ్టీ ↑ 07
10,442

రూపాయి ↑ 22 పై॥
అమెరికా డాలరుకు రూ.
63.46



| ప్రారంభం

కొత్త ఏటీఎం కేంద్రాలను రిమోట్‌తో ప్రారంభిస్తున్న ఎస్‌బిఐ సిజిఎం మని పల్వేసన్, ఇతర ఉన్నతాధికారులు.

ఒకే రోజు 151 ఏటిఎంలు..

అందుబాటులోకి తెచ్చిన ఎస్‌బిఐ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కొత్త ఏడాది సందర్భంగా స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఒకే రోజు 151 ఏటిఎం కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఈ ఏటిఎం కేంద్రాలను ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ మనీ పల్వేసన్ హైదరాబాద్‌లోని అమరావతి లోకల్ హెడ్ ఆఫీస్ నుంచి రిమోట్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్వేసన్ మాట్లాడుతూ అమరావతి సర్కిల్‌లోని పట్టణ, గ్రామాల్లో 3633 ఏటిఎం కేంద్రాలతో విస్తరించి సేవలు అందిస్తున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1158 ఏటిఎం కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 706 కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రాజెక్టు 'నవీన్' పేరుతో తమ ఖాతాదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడానికి మరిన్ని ఏటిఎం కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతుందన్నారు. 2018 జనవరి 31 కల్లా మరిన్ని ఏటిఎం కేంద్రాలను అందుబాటులోకి తేనున్నామని చెప్పారు.

హీరో మోటో అమ్మకాల్లో 43% వృద్ధి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన కంపెనీ హీరో మోటోకార్ప్ డిసెంబర్ నెలలో 43 శాతం వద్ధితో 4,72,731 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే నెలలో 3,30,202 వాహనాలను విక్రయించినట్లు కంపెనీ తెలిపింది. కాగా 2017లో రికార్డు స్థాయిలో 72,07,363 యూనిట్లు విక్రయించినట్లు ఆ కంపెనీ ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-డిసెంబర్ కాలంలో 11 శాతం వ ద్ధితో మొత్తం 55,85,558 యూనిట్లు అమ్మకాలు చేసింది. కేవలం భారత మార్కెట్‌లోనే కాక, విదేశీ మార్కెట్‌లోనూ మెరుగైన అమ్మకాలు సాధించామని హీరో మోటోకార్ప్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ పవన్ ముంజల్ పేర్కొన్నారు.


ఊగిసలాటలో మార్కెట్లు



ముంబయి : వివిధ పరిణామాల మధ్య మంగళవారం దేశీయ స్టాక్ మార్కెట్లు ఊగిసలాటకు గురై తుదకు యథాతథంగా ముగిశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 0.49 పాయింట్లు తగ్గి 33,812 వద్ద ముగిసింది. ఉదయం 33,914 వద్ద మొదలైన సూచీ ఓ దశలో 101 పాయింట్ల లాభాల్లో నమోదయ్యింది. ఇంట్రా ట్రేడింగ్‌లో 33,964-33,703 మధ్య ట్రేడింగ్ అయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 6.65 పాయింట్లు పెరిగి 10,442.20 వద్ద నమోదయ్యింది. రంగాల వారిగా బిఎస్ఇలో ఆయిల్ అండ్ గ్యాస్ 0.51 శాతం, ఎఫ్ఎంసిజి 0.42 శాతం, పిఎస్‌యు, మౌలిక వసతులు 0.34 శాతం చొప్పున నష్టపోయాయి. మరోవైపు ఆటో 0.15 శాతం, విద్యుత్ 0.13 శాతం, లోహ 0.05 శాతం చొప్పున పెరిగాయి. సెన్సెక్స్‌లో టాటా మోటార్స్ 3.16 శాతం, ఓఎన్‌జిసి 2.36 శాతం, కోల్ ఇండియా 1.46 శాతం, ఎన్‌టిపిసి 1.19 శాతం, ఇండుస్‌ఇండ్ బ్యాంకు 1.15 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు భారతీ ఎయిర్‌టెల్ 2.24 శాతం, ఎస్‌బిఐ 1.35 శాతం, మారుతి సుజుకి 1.24 శాతం, ఎల్అండ్‌టి 1.01 శాతం, హీరో మోటో కార్ప్ 0.92 శాతం చొప్పున అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఆర్ఐఎన్ఎల్ టర్నోవర్ అదుర్స్

- ఏప్రిల్-డిసెంబర్‌లో రూ.11,405 కోట్లు
- ఉత్పత్తిలో 13% వృద్ధి
- స్పెషల్ స్టీల్ మార్కెట్ వాటాపై లక్ష్యం
- వైజాగ్ స్టీల్ సిఎండి మధుసుధన్ వెల్లడి



న్యూఢిల్లీ : రాష్ట్రీయా ఇస్పాట్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) టర్నోవర్ దూసుకుపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ కాలంలో ఈ ప్రభుత్వ రంగ సంస్థ టర్నోవర్ రూ.11,405 కోట్లకు చేరింది. ఇంత క్రితం ఏడాది ఇదే కాలం టర్నోవర్‌తో పోల్చితే 30 శాతం వృద్ధి సాధించింది. ఇదే సమయంలో 13 శాతం పెరుగుదలతో 36.5 లక్షల టన్నుల హాట్ స్టీల్ ఉత్పత్తిని సాధించింది. కాగా 15 శాతం వృద్ధితో పెరుగుదలతో 35.4 లక్షల మిలియన్ టన్నుల లిక్విడ్ స్టీల్ ఉత్పత్తిని నమోదు చేసింది. సీలేబుల్ స్టీల్ ఉత్పత్తి 15 శాతం పెరిగి 31.9 లక్షల టన్నులుగా నమోదు చేసింది. 2017లో విస్తరణ కూడా పూర్తి అయ్యిందని ఆర్ఐఎన్ఎల్ విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) మధుసూధన్ తెలిపారు. విస్తరణ, ఆధునీకరణతో ఈ ప్లాంట్ సామర్థ్యం 73 లక్షల టన్నులకు చేరిందన్నారు. ఆర్ఐఎన్ఎల్ ఇది వరకు ఎప్పుడూ లేని విధంగా ప్రగతిని కనబర్చిందని మధుసూధన్ పేర్కొన్నారు. నవంబర్, డిసెంబర్ కాలంలో స్థూల మార్జిన్లు సాధించామని, ఇదే సమయంలో ఎలాంటి అప్పులు తీసుకోలేదన్నారు. నవంబర్, డిసెంబర్ మాసాల్లో మార్కెటింగ్ డిపార్టుమెంట్ 10 లక్షల టన్నుల అమ్మకాలు చేసిందన్నారు. చివరి నెలలో రూ.2,000 కోట్ల టర్నోవర్ వచ్చిందన్నారు. 2017-18లో 10 లక్షల మిలియన్ టన్నుల ప్రత్యేక స్టీల్‌ను ఉత్పత్తి చేయాలని గతేడాది అక్టోబర్‌లో ఆర్ఐఎన్ఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో ఈ రంగంలో అధిక మార్కెట్ వాటాను లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఆర్ఐఎన్ఎల్ ఇప్పటికే నూతన టెక్నలాజీని అందిపుచ్చుకుందని సిఎండి తెలిపారు. స్పెషల్ స్టీల్ సెగ్మెంట్‌లో మార్కెట్ వాటా పెంపునపై దృష్టి కేంద్రీకరించామన్నారు.

బంగారానికి డిమాండ్



ముంబయి : కొత్త ఏడాదిలో బంగారం ధరలు పెరుగుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో బంగారం ధర రూ.30 వేల స్థాయికి ఎగువన కొనసాగుతోంది. మంగళవారం బులియన్ మార్కెట్లో 10 గ్రాముల ధర రూ.50లు పెరిగి రూ. 30,450 కొనసాగుతోంది. ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల ఫిబ్రవరి ఫ్యూచర్స్ రూ. 42 ఎగసి రూ. 29,165 వద్ద ఉంది.సింగపూర్ మార్కెట్‌లో ఔన్స్ బంగారం 0.42 శాతం పెరిగి 1,308 డాలర్లకు చేరుకుంది. స్థానిక నగల విక్రయదారుల కొనుగోళ్లు, గ్లోబల్ మార్కెట్ల ధోరణితో బంగారం ధరలు పుంజుకున్నాయి. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వఛతే కలిగిన బంగారం రూ. 50 రూ. 30,450 వద్ద, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ. 30,300గా పలికింది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్ల పెంపు అంచనాలతో డాలర్ బలహీనపడడంతో బంగారం కొనుగోళ్లు కు డిమాండ్ పెరిగింది. మరోవైపు ఉత్తర కొరియా పరిణామాలు పసిడిపై పెట్టుబడులకు దోహదం చేస్తున్నాయి.

జిఎస్‌టిపై ఎఫ్టాపీ్స శిక్షణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

జిఎస్‌టి కంప్లియన్స్ అంశంపై నాలుగు రోజుల సర్టిఫికేట్ కోర్స్‌ను అందిస్తున్నట్లు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక మరియు వాణిజ్య సంఘాల సమాఖ్య (ఎఫ్టాప్సీ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 5నుంచి దీన్ని నిర్వహించ నున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా గత జూలై నుంచి అమలులోకి వచ్చిన జిఎస్‌టి అమలు, సందేహాల నివత్తి, ఇప్పటికీ అర్థంకాని సాంకేతిక అంశాలు, జిఎస్‌టి చెల్లింపు పట్ల ఎదురవుతున్న సాంకేతిక అంశాలు వ్యాపార సంస్థల సిబ్బంది పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో సమస్యల నివత్తికోసం శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో ఈ శిక్షణ అందించనున్నామన్నారు.

రెస్టారెంట్ల తప్పడు జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : హార్డ్‌క్యాసిల్ రెస్టారెంట్లు, వెస్ట్, సౌత్‌లోని మెక్‌డొనాల్డ్స్, రిటైల్ లైఫ్‌స్టయిల్, హోండా డీల్స్ సంస్థలు తప్పుడు వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)తో వినియోగదారులను మోసం చేస్తున్నాయి. జిఎస్‌టి ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయడం లేదు. మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నందున్న ఈ సంస్థలపై యాంటీ-ప్రాఫిటరింగ్ చర్యలకు ప్రభుత్వం దిగింది. ఇలాంటి ఐదు సంస్థలకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సేఫ్‌గార్డ్స్ (డిజి సేఫ్‌గార్డ్స్) ఈ నోటీసులు జారీచేసింది. హార్డ్‌క్యాసిల్ రెస్టారెంట్లపై కూడా జిఎస్‌టి రేటును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. కాని ఈ పన్ను ఫలితాలను ఆ సంస్థ వినియోగదారులకు బదిలీ చేయలేదు.

టెట్, డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

'ఫాదర్ ఆఫ్ ఇంటర్నెట్' అని ఎవరిని అంటారు?



ఎస్.పి. మనోహర్‌కుమార్,
టీచర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నున్న, కృష్ణాజిల్లా.
సెల్ : 9490300637

సమాచారాన్ని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి అత్యంత వేగంగా పంపడానికి ఉపయోగించే సాంకేతిక విధానాన్ని ఇంటర్నెట్ అంటారు. మొట్టమొదటిగా అమెరికాలో 1960 సంవత్సరంలో 'ARPANET' అనే పేరుమీద రక్షణ అవసరాల కోసం ఇంటర్నెట్‌ను ఏర్పాటుచేశారు. వింట్‌సెర్ఫ్, రాబర్ట్ కాన్ అనే శాస్త్రవేత్తలు దీనిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. అందువల్ల వీరిద్దరినీ 'ఫాదర్ ఆఫ్ ఇంటర్నెట్' అంటారు. దీనిని ఉపయోగించి సమాచారాన్ని అత్యంత వేగంగా, సులువుగా అక్షరాల రూపంలో, చిత్రాలు, వీడియోలు, ఆడియోల రూపంలో ఇతరులకు చేరవేయవచ్చు.

★ **ఇంటర్నెట్ వల్ల ఉపయోగాలు :** సమాచారం ప్రతిఒక్కరికీ అందుబాటులోకి రావడం వల్ల పరిశోదన అనేది చాలా సులభంగా మారింది. ఒకరితో ఒకరు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం అత్యంత తేలికగా మారింది. మనకు పరిచయం లేని వ్యక్తులనుంచి కూడా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి సరైన అవకాశం మనకు లభిస్తుంది. డిజటల్ రూపంలో సమాచారాన్ని ముద్రించి సరఫరా చేయడానికి వీలు కల్పిస్తుంది. కాబట్టి పేపర్‌ను పొదుపు చేయగల వీలు లభించింది. వ్యాపార రంగంలో వివిధ సంస్థల గురించి విస్తృత ప్రచారానికి ఒక ప్రధాన సాధనంగా ఉంది.

★ **ఇంటర్నెట్ వల్ల నష్టాలు :** కంప్యూటర్‌ల యొక్క వైరస్‌లకు, వాటి వ్యాప్తికి ప్రధాన కారణం ఇంటర్‌నెట్. సైబర్‌నేరాలు పెరిగిపోయి. క్రెడిట్, డెబిట్ కార్డునెంబర్ల చౌర్యం, మోసం వంటి వాటికి అవకాశం చిక్కింది. ఇంటర్నెట్‌లో లభించే సమాచారం ఒక్కోసారి సరైనది కాకపోవచ్చు. ఇ-మెయిల్ ద్వారా ఒకచోట నుంచి మరోచోటుకి వెళ్లే మెసేజ్‌లు హాకింగ్‌కు గురయ్యే అవకాశం ఉంది. దీని వల్ల భద్రతకు ముప్పు కలిగే అవకాశం ఏర్పడుతుంది.

కంప్యూటర్ నెట్‌వర్క్‌ల రకాలు

1. LAN (Local Area Network): LAN అనేది ఒక చిన్న సింగిల్ సైట్ నెట్‌వర్క్. తక్కువస్థాయి ఉన్నటువంటి చిన్న భౌగోళిక పరిధిలో ఉపయోగపడుతుంది. అంటే ఇల్లు, ఆఫీసు, బిల్డింగ్, స్కూలు వంటి ఒక కిలోమీటరు కంటే తక్కువ పరిధిలో ఉండే ప్రాంతాల్లో పరికరాలను ఒకదానితో ఒకటి కలిపి ఉపయోగిస్తారు. దీనిలో అన్ని టెర్మినల్‌లూ ప్రధానమైన కంప్యూటర్‌కు అనుసంధానించి ఉంటాయి. ఈ ప్రధాన కంప్యూటర్‌ను ' సర్వర్' అంటారు. సాధారణంగా LAN లో డాటా ట్రాన్స్‌ఫర్ రేటు 10 నుంచి 100 MBPS (Mega bits per second) గా ఉంటుంది.


2. W-Lan (Wireless LAN) : సమాచార సరఫరా కోసం రేడియో తరంగాలను ఉపయోగించే LAN వ్యవస్థనే W-Lan అంటారు. ఈ వ్యవస్థను నెలకొల్పడానికి wi-fi

అంతర్జాలం (ఇంటర్నెట్)

(Wireless fidility) సాధనంగా ఉపయోగిస్తారు. ఈ wi-fi ద్వారా ఎటువంటి తీగెల సహాయం లేకుండా వైర్‌లెస్ పద్ధతిలో ఇంటర్నెట్ సదుపాయం అందించవచ్చు. ఇది రేడియోతరంగాల ఆధారంగా పనిచేస్తుంది.

3. WAN (Wide Area Network) : ఒక భౌగోళిక పరిధిలో ఉన్నటువంటి అనేక LAN ల మొత్తాన్ని WAN అని అంటారు. LAN లన్నింటినీ WAN తో కలపడానికి 'రూటర్' అనే నెట్‌వర్క్ డివైస్‌ను ఉపయోగిస్తాం. దీనిలోపల టెలిఫోన్ లైన్స్, శాటిలైట్స్ లింకులు, ఇతర కమ్యూనికేషన్ టెక్నాలజీలను ఉపయోగిస్తారు.

4. MAN (Metropolitan Area Network) : ఇది ఒక పట్టణం కోసం లేదా నగరం కోసం తయారుచేసిన డాట్‌నెట్‌వర్క్. ఇది LAN కంటే పెద్ద విస్తృత స్థాయిలో ఉన్న భౌగోళిక ప్రదేశాన్ని WAN కంటే తక్కువ స్థాయి ప్రాంతాన్ని కలిగి ఉంటుంది. దీనికి ఉదాహరణగా 'కేబుల్ నెట్‌వర్క్' ను



చెప్పవచ్చు.

6. PAN (Personal Area Network) : చాలా తక్కువ పరిధి కలిగిన నెట్‌వర్క్. ఉదాహరణ బ్లూటూత్.

7. VPN (Virtual Private Network) : అంతర్గత సమాచారాన్ని ఎక్కువ సంఖ్యలో ప్రసారం కోసం, దాని భద్రతకోసం ఉపయోగించే అధునిక టెక్నాలజీ.

8. Modem : Modem అనేది ఒక పరికరం. ఇది సమాచారాన్ని పంపేవారి దగ్గర డిజిటల్ సిగ్నల్‌ని అనలాగ్‌సిగ్నల్‌గా మారుస్తూ సమాచారాన్ని అందుకునే వారి దగ్గర అనలాగ్ సిగ్నల్స్‌ను డిజటల్ సిగ్నల్‌గా మారుస్తుంది. ఇలా మార్చడం అనేది ప్రత్యేక వైర్‌లైన్ లేదా టెలిఫోన్ లైన్ ద్వారా సమాచారాన్ని పంపే అవకాశం కలుగుతుంది. టెలిఫోన్ లైన్‌కు, కంప్యూటర్‌కు మధ్య ఈ మోడెమ్‌ను అనుసంధానించడం ద్వారా సిగ్నల్‌ను మార్చి డిజటల్ సిగ్నల్‌రూపంలో మనకు కనిపించేట్లు చేస్తుంది.

9. www : దీనిని సృష్టించిన వ్యక్తి 'టిమ్ బెర్నర్స్‌లీ' దీని సేవలను మొదటిసారిగా 1991 ఆగస్టు 6న అందుబాటులోకి తెచ్చారు. ఒక కంప్యూటర్ నుంచి మరొక కంప్యూటర్‌కు ఫైల్స్‌ను ఇంటర్నెట్ ద్వారా అనుసంధానించడం. 'వరల్డ్ వైడ్ వెబ్'


కంప్యూటర్ భద్రత : కంప్యూటర్ భద్రతనే సైబర్ సెక్యూరిటీ లేదా ఐ.టి సెక్యూరిటీ అంటారు. కంప్యూటర్‌ల మధ్య జరిగేటటువంటి సమాచార రవాణాలలో భద్రతను కాపాడటమే దీని ప్రధాన లక్ష్యం.

★ **కంప్యూటర్ వైరస్ :** కంప్యూటర్ పరిభాషలో వైరస్ అనగా 'వైటల్ ఇన్ఫర్మేషన్ రిసోర్సెస్ అండర్ సీజ్'. ఈ కంప్యూటర్ వైరస్ ఒక కంప్యూటర్ నుంచి మరొక కంప్యూటర్‌కు వేగంగా వ్యాప్తి చెందుతూ ఆ కంప్యూటర్ పనితీరులో జోక్యం చేసుకుంటూ ఇబ్బందిపెట్టే ఒక చిన్న సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం. ఇవి కంప్యూటర్ పనితీరును దెబ్బతీస్తాయి.1986లో సృష్టించిన మొట్టమొదటి పిసిబూట్ సెక్టార్ వైరస్ 'బ్రెయిన్'. 1971లో సృష్టించిన మొట్టమొదటి కంప్యూటర్ వైరస్ పేరు 'క్రీపర్'

★ **యాంటీవైరస్ :** కంప్యూటర్‌లోకి చొరబడిన వైరస్‌ను వెతికి, దానిని తొలగించి మళ్ళీరాకుండా నిరోధించే కంప్యూటర్ ప్రోగ్రామ్‌నే **'యాంటీవైరస్'** అని అంటారు.

★ **ట్రాన్స్‌పాండర్స్ :** వివిధ పౌనఃపున్యాల వద్ద తరంగాలను గ్రహించి, వాటిని ద్విగుణీకృతం చేసి, తిరిగి పంపే సాధనాలను ట్రాన్‌పాండర్స్ అంటారు. దీని విస్తృత రూపం ట్రాన్స్‌మీటర్ రెస్పాండర్. కమ్యూనికేషన్ శాటిలైట్ ఛానళ్లను ట్రాన్స్‌పాండర్స్ అంటారు. డిజటల్ వీడియో డేటా కంప్రెషన్, మల్టిప్లెక్సింగ్ విధానాలను ఉపయోగించి ఒక ట్రాన్‌పాండర్ ద్వారా ఒకే సమయంలో అనేక వీడియో ఆడియోలను ఒకే పౌనఃపున్యం వద్ద పంపించవచ్చు. ఇవి మూడు రకాల పౌనఃపున్య అవధులను కలిగి ఉంటాయి.





1. ఎస్-బాండ్ : దీని పౌనఃపున్య అవధి రెండు నుంచి నాలుగు హెర్జ్‌ల వరకూ ఉంటుంది. స్పేస్ షటిల్, ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌తో కమ్యూనికేట్ కావడానికి ఆ పౌనఃపున్య అవధిని ఉపయోగిస్తారు. వాతావరణ రాడార్‌లు, ఉపరితల నౌకారాడార్‌లు, కమ్యూనికేషన్ శాటిలైట్స్ కూడా ఈ పౌనఃపున్య అవధిని ఆధారంగా చేసుకొని పనిచేస్తాయి.

2. సి-బాండ్ : వీటిని సాధారణంగా రేడియో టెలీకమ్యూనికేషన్‌లో ఉపయోగిస్తారు. మైక్రోవేవ్స్, విద్యుదయస్కాంత తరంగాల కలయికను ఉపయోగిస్తారు.

3. కెయు-బ్యాండ్ : వీటి పౌనఃపున్య అవధి 11.2 నుంచి 14.4 గిగాహెర్జ్‌గా ఉంటుంది. ఈ పౌనఃపున్యం విద్యుదయస్కాంత పట్టికలోని ఒక భాగం. దీనిని కమ్యూనికేషన్ ఛానల్‌లో ఉపయొగిస్తారు. డైరక్ట్ టు హోమ్ (డిటిహెచ్) లలోకూడా ఉపయోగిస్తారు. నాసావారు దీనిని ట్రాకింగ్ డాటా రిలే శాటిలైట్‌లలో ఉపయోగిస్తారు. శాటిలైట్ న్యూస్ సేకరణలో ఈ కెయు-బాండ్‌ను ఉపయోగిస్తారు.

★

ఉద్యోగాలు

ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్‌లో 241 పోస్టులు

కేంద్ర హోంశాఖ పరిధిలోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీఎఫ్)లో మోటార్ మెకానిక్ విభాగంలో ఖాళీగా ఉన్న 241 గ్రూప్ 'సి' కేటగిరీ కొలువుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది.

పోస్టు పేరు-ఖాళీలు : హెడ్ కానిస్టేబుల్-60 (అన్‌రిజర్వుడ్-23+ఓబీసీ (ఎన్‌సీఎల్)- 22+ఎస్సీ-12+ఎస్టీ-3), కానిస్టేబుల్-181 (అన్‌రిజర్వుడ్-85+ఓబీసీ (ఎన్‌సీఎల్)-48+ఎస్సీ-31+ఎస్టీ-17).

విభాగం : మోటార్ మెకానిక్.

వేతనశ్రేణి : హెడ్ కానిస్టేబుల్ రూ.25,500-రూ.81,100, కానిస్టేబుల్- రూ.21,700-రూ.69,100.

అర్హతలు : హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు ఇంటర్మీడియెట్/ తత్సమాన ఉత్తీర్ణత. అలాగే మోటార్ మెకానిక్‌లో సర్టిఫికెట్/ ఐటీఐతో పాటు ఏదైనా వర్క్‌షాప్‌లో కనీసం మూడేళ్ల ప్రాక్టికల్ అనుభవం (లేదా) ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా, కానిస్టేబుల్ పోస్టులకు పదోతరగతి/ తత్సమాన విద్యలో ఉత్తీర్ణత. అలాగే సంబంధిత విభాగంలో ఐటీఐ సర్టిఫికెట్/ ఏదైనా సంస్థలో మూడేళ్ల ఉద్యోగానుభవం.

వయసు : దరఖాస్తు గడువు ముగిసే నాటికి 18-25 ఏళ్ల లోపు ఉండాలి. రిజర్వేషన్ వర్తిస్తుంది.

శారీరక ప్రమాణాలు (ఫిజికల్ స్టాండర్డ్స్) : ఎస్టీ అభ్యర్థులకు ఎత్తు-162.5 సెం.మీ., ఛాతీ 76 (సాధారణం)-81 (గాలి పీల్చినపుడు) సెం.మీ.బీ మిగిలిన అభ్యర్థులకు ఎత్తు-170 సెం.మీ., ఛాతీ 80 సెం.మీ. (సాధారణం)-85 (గాలి పీల్చినపుడు) సెం.మీ. ఉండాలి. అలాగే అన్ని కేటగిరీల అభ్యర్థులకూ ఎత్తు, వయసుకు అనుగుణంగా బరువు ఉండాలి. దీంతోపాటు తగిన దృష్టి సామర్థ్యం తప్పనిసరి. అలాగే టాటూ (పచ్చబొట్లు) ఉండకూడదు.

ఎంపిక : ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ), ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్‌టీ), రాతపరీక్ష, ప్రాక్టికల్ (స్కిల్) టెస్ట్.

దేహ దారుఢ్య పరీక్ష (ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ : పీఈటీ) : ఇందులో పరుగుపందెం-1.6 కి.మీ. దూరాన్ని ఏడు నిమిషాల 30 సెకన్లలోపు పరిగెత్తగలగాలి. అలాగే లాంగ్ జంప్-11 అడుగుల దూరాన్ని మూడు అవకాశాల్లో, హై జంప్- మూడున్నర అడుగుల ఎత్తును మూడు అవకాశాల్లోగా అధిగమించాలి.

ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్ (పీఎస్‌టీ) : పీఈటీలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల శారీరక ప్రమాణాలు పరిశీలించి, నిబంధనల మేర ఉంటే రాతపరీక్షకు ఎంపిక చేస్తారు.

రాతపరీక్ష : దీన్ని ఆబ్జెక్టివ్ విధానంలో ఓఎంఆర్ ఆధారంగా నిర్వహిస్తారు. మొత్తం 50 ప్రశ్నలు ఇస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్ నుంచి 10, మ్యాథమెటిక్స్ నుంచి 5, హిందీ నుంచి 10, ఇంగ్లిష్ నుంచి 10, ట్రేడ్‌కు సంబంధించి 15 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం గరిష్ఠ మార్కులు 50. హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ప్రశ్నలు ఇంటర్మీడియెట్ స్థాయిలో, కానిస్టేబుల్ అభ్యర్థులకు పదోతరగతి స్థాయిలో ఉంటాయి. పరీక్ష వ్యవధి గంట. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీల్లో మాత్రమే ఉంటుంది.

ప్రాక్టికల్ (స్కిల్) టెస్ట్ : ఇందులో నాలుగు అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. వెహికల్ ఇన్‌స్పెక్షన్, ఐడెంటిఫికేషన్ ఆఫ్ ఫాల్ట్స్, రెక్టిఫికేషన్ ఆఫ్ డిఫెక్ట్స్ అంశాల్లో ఒక్కో దాన్నుంచి 15 చొప్పున 45 ప్రశ్నలు ఇస్తారు. మిగిలిన 5 ప్రశ్నలు హ్యాండ్లింగ్ ఆఫ్ టూల్స్ నుంచి ఉంటాయి. గరిష్ఠ మార్కులు 50. ఈ మార్కుల మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు డిటెల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్ (డీఎంఈ) నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఫీజు : జనరల్/ ఓబీసీ-రూ.100, ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగ కేటగిరీలకు ఫీజు లేదు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్.

దరఖాస్తుల ప్రారంభం : జనవరి 2, 2018.

దరఖాస్తు చివరి తేదీ : జనవరి 31, 2018.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్ : www.recruitment.itbpolice.nic.in

నోడల్ ఆఫీసర్లుగా ప్రధానోపాధ్యాయులను నియమించరాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమిలో ఉపాధ్యాయును నోడల్ ఆఫీసర్లుగా నియమించరాదని యుటియఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి.బాబురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులతో బోధనేతర పనులు కేటాయించరాదని చట్టాలు చెబుతుంటే మన రాష్ట్రంలో రోజు రోజుకూ బోధనేతర పనులు ఎక్కువై విద్యాబోధన కుంటుబడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాక్రమాలకు పాఠశాలలను ప్రచార వేదికలుగా మార్చరాదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు తీవ్రంగా నష్టపోతాయని పేర్కొన్నారు.



యువజనోత్సవాలు

ఆంధ్ర యూనివర్సిటీలోని టిఎన్ఎన్ సభామందిరలో జాతీయ సేవ పథకం (ఎన్ఎస్ఎస్) యువజనోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

పథకం ప్రకారమే దాడి

– పెదగొట్టిపాడు దళితులకు కెవిపిఎస్, వ్యకాస, పలువురు పరామర్శ

ప్రజాశక్తి – ప్రత్తిపాడు (గుంటూరు)

చిన్న ఘటనను ఆసరాగా చేసుకున్న పెత్తందార్లు తమ స్వార్థ, రాజకీయ ప్రయోజనాల కోసం పథకం ప్రకారమే దళితులపై దాడికి పాల్పడ్డారని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి విమర్శించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో దళితులపై పెత్తందార్లు దాడికి పాల్పడిన నేపథ్యంలో భయాందోళనలో ఉన్న ఎస్సి కాలనీ వాసులను కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, భీమ్ పత్రిక ఎడిటర్ మాతంగి దిలీప్‌కుమార్, దళిత నాయకులు ప్రసాద్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా దళితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. చర్చిలో ప్రార్థనలకు వెళ్లిన సందర్భంలో యువకులపై దాడికి పాల్పడడం చూస్తుంటే పథకం ప్రకారమే చేసినట్లు ఉందన్నారు. వ్యకాస రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. ఇక్కడ యువకులు చదువుకుని సొంతంగా నిర్మాణ రంగ పనులు చేసుకుంటున్నారని, పెత్తందార్ల పొలాల్లో పనులకు వెళ్లడం లేదనే అక్కసుతోనే దాడి చేశారని చెప్పారు. జిల్లా కలెక్టర్, ఎస్పి సందర్శించి 24 గంటలైనా దాడి చేసినవారిని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. 'బాంబులు కూడా తెచ్చాం.. సర్వనాశనం చేస్తాం' 'ఐదు నిమిషాలు కళ్లు మూసుకోండి.. లేదా పక్కకైనా వెళ్లండి' అని పోలీసులతోనే అంటున్నారంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దళితులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

జన్మభూమిలో ఆందోళనలు, నిలదీతలు

- మంగళగిరిలో సిపిఎం నేతలపై దాడి
- నక్కపల్లిలో ముందస్తు అరెస్టు
- బోయవాల్మీకులను ఎస్‌టిల్లో చేరిస్తే రాజీనామా : అరకు ఎంఎల్ఎ
- తొలిరోజు తీరు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఐదో విడత జన్మభూమి-మాఊరు కార్యక్రమం ఆందోళనల నడుమ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా జన్మభూమి కమిటీల పెత్తనం చేయడం పట్ల పలు సభల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సిపిఎం నేతలపై అధికార పార్టీ కార్యకర్తలు దాడి చేయగా, నక్కపల్లిలో ముందస్తుగా అరెస్టు చేశారు. బోయ వాల్మీకులను ఎస్‌టిల్లో చేర్చొద్దంటూ పలుచోట్ల గిరిజనులు డిమాండ్ చేశారు.

గుంటూరు జిల్లా మంగళగిరి 3వ వార్డులో సిపిఎం కౌన్సిలర్ ఎం.రాగవీణపై టిడిపి నాయకులు వీరంగం వేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఎస్.చెంగయ్య అడ్డుకునేందుకు ప్రయత్నించగా, దాడి చేశారు. దీంతో చెంగయ్య, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వై.కమలాకరరావు, రాగవీణ గాయపడ్డారు. దీనిపై సిపిఎం నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తుళ్లూరు మండలంలో సిఐటియు నాయకులు జె.నవీన్‌కుమార్ కార్మిక శాఖాధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం భట్టిప్రోలు మండలంలో మంత్రి ఆనందబాబు మాట్లాడే సందర్భంలో సిపిఎం నాయకులు కలుగజేసుకుని పథకాల అమలులో పక్షపాతాన్ని, గతేడాది ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు బిల్లులు రాకపోవడాన్ని ప్రశ్నించారు.

కృష్ణా జిల్లాలో ప్రజాప్రతినిధులు పలు జన్మభూమి కార్యక్రమాల్లో పాల్గొనేలా షెడ్యూలు ఏర్పాటు చేసుకోవటంతో సమస్యలు వినకుండానే వెనుదిరిగారు.

గత జన్మభూమిలో మందుకొచ్చిన తాగునీరు, దళితపేట శ్మశాన అభివృద్ధి నిధులు, ఉపాధి పనుల బకాయిలపై మండవల్లి మండలం ఉనికిలి గ్రామంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం తూర్పు కృష్ణా కార్యదర్శి మురాల రాజేష్ నేతృత్వంలో గ్రామస్తులు నిలదీయగా సమాధానం చెప్పకుండా అధికారులు వెళ్లిపోయారు.

విశాఖ జిల్లా నక్కపల్లిలో జన్మభూమి కార్యక్రమానికి ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు రావడంతో సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజు, పి.వెంకటస్వామి, సత్యనారాయణ, దాసులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సక్రమంగా రుణమాఫీ చేయలేదని నక్కపల్లికి చెందిన రైతు కొల్నాటి అప్పారావు సభలో నిలదీయడంతో పోలీసులు ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు ఎందుకు మంజూరు చేయలేదంటూ డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టులో గిరిజనులు నిలదీశారు. అరకులోయ మండలం చినలబుడు, పెదబయలు మండలం లక్ష్మింపేట, బొండపల్లి పంచాయతీల్లో గత జన్మభూమి సమస్యలనే పరిష్కరించకుండా మళ్లీ నిర్వహించి ప్రయోజనమేమిటని గిరిజనులు ప్రశ్నించారు. పింఛన్, రేషన్ కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తారని అనకాపల్లి మండలం భట్లపూడి, అక్కిరెడ్డిపాలెం, గోపాలపురం గ్రామస్తులు నిలదీశారు. చినగుమ్ములూరులో పింఛన్లు, ఇళ్లు, రేషన్ కార్డులు అర్హులకు ఇవ్వడం లేదని నిలదీశారు.

బోయవాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దంటూ విశాఖ జిల్లా అరకులోయ మండలం చినలబుడు, డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు, కొర్రాయి, అరకు, సాగర, అనంతగిరి మండలం రొంపలి, అనంతగిరి, పెదబయలు మండలం లక్ష్మీంపేట, బొండపల్లి పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యాన తీర్మానాలు చేసి అధికారులకు నివేదించారు. చినలబుడులో సిపిఎం అరకు డివిజన్ కార్యదర్శి సురేంద్ర, ఇతర నేతల ఆధ్వర్యాన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావును ప్రశ్నించారు. దీనిపై ఎమెల్యే కిడారి స్పందించి తీర్మానం రద్దయ్యేలా చూస్తానని, బిల్లు పాసైతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, పోరాటం చేస్తానని హామీనివ్వడంతో జన్మభూమికి అడ్డంకి లేకుండా కొనసాగేలా సహకరించారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలం పెద్దపొల్ల, టిటుకుపాయి, పూతికవలస పంచాయతీల్లో గిరిజనులు రెండు గంటలపాటు జన్మభూమిని బహిష్కరించారు.

శ్రీకాకుళం ఆదివారంపేటలో పేదల ఇళ్ల మంజూరులో అక్రమాలు చోటు చేసుకున్నాయని టిడిపి నాయకులను అదే పార్టీకి చెందిన వారు నిలదీశారు. టిడిపి డివిజన్ ఇన్‌ఛార్జి రాజారావు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమస్యలు పరిష్కరించనప్పుడు జన్మభూమి సభలు ఎందుకంటూ విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం జరజాపుపేట దళిత కాలనీలో సిపిఎం నాయకులు, గరికిపేటలో వైసిపి నాయకులు నిలదీశారు. చిన్నపాలెంలో ఇనాం భూ సమస్య పరిష్కరించకపోవడంపై సిపిఎం ఆధ్వర్యాన రైతులు నిలదీశారు.

తూర్పుగోదావరి జిల్లా చింతూరు మండలం చిడుమూరు, చదలవాడ సభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. ఎన్‌టిఆర్ పక్కా ఇళ్లకు బిల్లులు చేయాలంటే హౌసింగ్ ఎఇ రూ.10 వేలు లంచం అడుగుతున్నారని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. పిఠాపురం 20వ వార్డు వెలంపేట సభలో స్థానికులు అధికార పార్టీ నాయకుల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రెండు పక్షాల మధ్య బాహాబాహి, తోపులాట జరిగింది.



పిఠాపురంలో ఇరుపక్షాలనూ అదుపుచేస్తున్న పోలీస్ కానిస్టేబుల్

పశ్చిమగోదావరి జిల్లాలో సభలు పేలవంగా సాగాయి. బుట్టాయగూడెం మండలం దొరమామిడిలో ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడంపై గ్రామస్తులు సభను అడ్డుకున్నారు. బోయ, వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చే తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యాన ఆందోళన చేశారు.

ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం గుడిపాటిపల్లి సభలో అధికారులను స్థానికులు నిలదీశారు. 2005 భూ పంపిణీలో పట్టాలిచ్చిన 35 మందికి ఇప్పటికీ భూమి చూపలేదనీ, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోనప్పుడు సభలు ఎందుకని గ్రామస్తులు నిలదీశారు. నెల్లూరు జిల్లా దొరవారిసత్రం మండలం మీజూరులో చెక్‌డ్యామ్ నిర్మించకపోవడంపై జన్మభూమిని స్థానికులు అడ్డుకున్నారు.

కడప జిల్లా వేంపల్లె మండలం గిడ్డంగులవారిపల్లెలో అధికారులను గ్రామంలోకి రానివ్వకుండా స్థానికులు అడ్డుకున్నారు. రహదారిపై ధర్నా చేశారు. వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు.

చిత్తూరు జిల్లా వరదయ్యపాళ్యం మండలం బత్తలవల్లంలో సభను గ్రామస్థులు అడ్డుకున్నారు. సత్యవేడు మండలంలో పింఛన్లు కోసం మహిళలు నిలదీశారు. పుత్తూరు మున్సిపాలిటీలో ప్రజాసమస్యలపై ప్రశ్నించిన రెండో వార్డు కౌన్సిలర్ మున్నీబాయి, ఆమె భర్త శ్రీనులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పెండేకల్లులో సభను గ్రామస్తులు బహిష్కరించారు. ఎద్దులదొడ్డి నుంచి పెండేకల్లు వరకు రోడ్డు వేసేవరకూ జన్మభూమి నిర్వహించవద్దని, కార్యక్రమం నిర్వహిస్తే పెట్రోలు పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ప్రజలు తేల్చి చెప్పారు. అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం నాగినాయన చెరువు గ్రామంలో క్వారీ పనులను ఆపాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సభను బహిష్కరించారు. కుందుర్పి మండలం ఎనుమలదొడ్డిలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ గ్రామస్తులు అధికారులను అడ్డుకుని, నిర్బంధించారు.

పింఛను మంజూరు కాక స్పృహతప్పిన వృద్ధుడు

ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి సభలో పింఛను కోసం వచ్చిన సింగరాయపాలేనికి చెందిన వృద్ధుడు గుత్తుల అప్పారావు స్పృహతప్పి పడిపోయాడు.

పేదల పథకాలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు

– 23న సమ్మె జయప్రదానికి పిలుపునిస్తూ స్కీం వర్కర్ల ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలను ఆదుకునే పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి స్కీం వర్కర్ల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) ప్రధాన కార్యదర్శి లలిత అధ్యక్షత వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వారందరినీ కార్మికులుగా గుర్తించాలి. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలి. రూ.3 వేల పెన్షన్, పిఎఫ్, గ్రాట్యూటీ, వైద్య సౌకర్యం కల్పించాలి. వివిధ పథకాలకు 2018-19 బడ్జెట్‌లో నిధులు పెంచాలి. పథకాల ప్రైవేటీకరణ ఆపాలి అని కోరుతూ, ఈ నెల 23న కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే స్కీం వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ శ్రామిక మహిళ కన్వీనర్ కె ధనలక్ష్మి తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ పలువురు ప్రసంగించారు. నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు కేంద్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించి రాష్ట్ర ప్రభుత్వాలపై భారం మోపుతోందని విమర్శించారు. ఎపి ఉపాధి హామీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మోడీ-చంద్రబాబు ప్రభుత్వాలకు మొట్టికాయలాగా సమ్మె సాగాలన్నారు. అన్ని పార్టీలు, సంఘాలను కలుపుకొని ఆందోళనలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఆందోళన నిర్వహిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ (ఎఐటియుసి) అధ్యక్షురాలు వి ప్రియదర్శిని మాట్లాడుతూ అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి, ఎపి మిడ్ డే మీల్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) జాయింట్ సెక్రటరీ ఎం రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం పెట్టే విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆశా వర్కర్ల యూనియన్(సిఐటియు) నాయకురాలు శ్రీలక్ష్మి, ఆశా వర్కర్ల యూనియన్(యూనియన్) రాష్ట్ర నాయకురాలు ఎల్ శాంతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు వైద్య పరంగా అన్ని సేవలు చేసే ఆశా వర్కర్లకు కనీసం యునిఫాం కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రామికా మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి కె శైలజ, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్ సిహెచ్ సుప్రజ, సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్, వేమేశ్వరి,108 యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలిచ్చే వరకూ పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ప్రజాశక్తి – సింగ్‌నగర్ (విజయవాడ)

విజయవాడ వాంబేకాలనీలోని ఇళ్లకు పట్టాలిచ్చే వరకూ పోరాటం చేస్తామని, ఇవ్వకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు చెప్పారు. మంగళవారం వాంబేకాలనీలో ఇళ్ల పట్టాల కోసం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పోరాటాల ద్వారానే వాంబేకాలనీ వాసులకు ఇళ్లు వచ్చినట్లు గుర్తు చేశారు. సొంతిళ్లు గల వారికి ఇళ్ల పట్టాలివ్వాలని, అద్దెదారులకు పక్కనే నిర్మిస్తున్న ఇళ్లివ్వాలని డిమాండ్ చేశారు. ఒక ఇంట్లో ఎవరు అద్దెకు ఉంటే వారికే ఇళ్ల పట్టాలివ్వాలని మంత్రి దేవినేని ఉమా అన్నారని, అలా చేస్తే ఇంటి యజమానులకు, అద్దెదారులకు మధ్య గొడవలు పెట్టడమేనని చెప్పారు. అలా చెప్పిన మంత్రి తనకు ఉన్న ఎన్ని ఇళ్లను అద్దెదారుల సొంతం చేసి పట్టాలిప్పిస్తారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు కె.దుర్గారావు, ఎస్‌కె.సుభాని, ఎ.రత్నకుమారి, కె.ఓంకార్, జె.విజయలక్ష్మి, ఎస్.గోవింద్, ఎస్.అప్పన్న పాల్గొన్నారు.

పచ్చ చొక్కా నేతలను నిలదీయండి

ప్రజాశక్తి – కర్నూలు సిటీ

పచ్చ చొక్కా నేతలను నిలదీయాలని, ప్రజలకు పనికిరాని జన్మభూమి, ప్రభుత్వ వైఫల్యాలపై తిరగబడాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బివై.రామయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కర్నూలు నగరంలోని కృష్ణకాంత్ ప్లాజాలోని వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జన్మభూమి ఒక ఫ్లాప్ షో అని, ప్రజలకు పనికిరాని జన్మభూమి ఎవరి కోసమని ప్రశ్నించారు. 4 విడతల్లో వచ్చిన ప్రజా సమస్యల్లో పరిష్కరమయినవి 10 శాతమేనని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు గ్రామాల్లోకి వెళ్లేందుకు భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు వెళ్లాలని తెలుగు తమ్ముళ్లే ప్రశ్నించుకుంటున్నారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 889 పంచాయతీల్లో 270 వార్డుల్లో నాలుగేళ్లుగా సమస్యలు తిష్టవేశాయని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైసిపి నాయకులు మద్దయ్య, కర్నాటి పుల్లారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, ధనుంజయాచారి, మహిళా నాయకులు విజయకుమారి పాల్గొన్నారు.

'ఉక్కు'పై సిఎం ప్రకటన చేయాలి

ప్రజాశక్తి – కడపఅర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనకు 50 సార్లు వచ్చారని ఏ ఒక్క పర్యటనలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై ప్రకటన చేయలేదని ఉక్కు సాధన ఐక్యవేదిక నాయకులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, లెక్కల జోగిరామిరెడ్డి అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రజ్ఞ

జవాబులు

1. నారీ.ఎన్ఐసి.ఇన్
2. తిరువైయారు (తమిళనాడు)
3. సలిల్ పారెఖ్
4. కర్నాటక
5. విదర్భ

'క్యాన్సర్ వైద్య కేంద్రం' నిధులను తరలించొద్దు

ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో క్యాన్సర్ వైద్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.45 కోట్ల నిధులు విశాఖపట్నం తరలించొద్దని సిపిఎం రూరల్ కార్యదర్శి మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యాన ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఎదుట మగళవారం ధర్నా చేపట్టారు. పార్టీ నాయకులు అరిగెల రమమ్మ అధ్యక్షత వహించిన ధర్నానుద్దేశించి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నెల్లూరులోనే క్యాన్సర్ వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. సిటీస్కాన్, ఎంఆర్ఐ, పిఇటి స్కాన్ తదితర అధునాతన పరికరాలు ఏర్పాటుచేయడంతో పాటు రేడియోథెరఫీ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన నిధులు విశాఖపట్నం తరలించే ప్రయత్నం విరమించుకోవాలని కోరారు. కలెక్టరు ముత్యాలరాజు, మంత్రులు పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు రూరల్ కార్యదర్శి అల్లాడి గోపాల్, భవన నిర్మాణ సంఘం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు ఒంగోలు సుధీర్, ఎస్ఎఫ్ఐ నెల్లూరు రూరల్ కార్యదర్శి ఎస్‌కె షారుఖ్ ఖాన్ తదితరులు మాట్లాడారు. అనంతరం వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభుకు వినతిపత్రం అందజేశారు.



నెల్లూరులో ప్రభుత్వాస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు


ప్రత్యేకం

వేలల్లో అర్జీలు.. వందల్లోనే లబ్ధి

గిరి పుత్రిక కల్యాణం ఇంతేనా..!

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

గిరి పుత్రిక కల్యాణం పేరిట గల పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయించేందుకు ప్రభుత్వం శ్రద్ధ వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ పథకం కింద వేలాదిగా దరఖాస్తులు వస్తుంటే వాటిలో కొందరికే ఫలాలు అందుతున్నాయి. నామమాత్రంగానే లబ్ధిదారులను మే అవుతోందని గిరిజన సంఘాల నేతలంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సంలో రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల దరఖాస్తులు అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. గిరి పుత్రిక కల్యాణ పథకాన్ని ప్రభుత్వం 2015లో ప్రారంభించింది. వివాహ సమయానికి రూ.50 వేలు గిరిజన వధువుకు అందించాలని ఈ పథకంలో నిర్దేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత రెండేళ్లలో కేవలం 3,212 మందికి మాత్రమే ఈ ఆర్థిక సహాయం అందింది. ఈ పథకాన్ని ప్రారంభించిన సంవత్సరంలోనే దాదాపు నాలుగు వేలకు పైగా దరఖాస్తులు అధికారులకు అందాయి. 2016-17లో సుమారు 5 వేలు. 2017-18లో 6 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయని సమాచారం. 2015-16లో వెయ్యి మందికి, 2016-17లో 1,388 మందికి ఆర్థిక సహాయం అందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1,500 మందికి ఈ పథకాన్ని అమలు చేయాలనేది లక్ష్యంగా నిర్ణయించారు. కానీ ఇంతవరకు కేవలం 824 మందికే ఈ చేయూతను అందించారు.



గిరిజన కుగ్రామాల్లో అవగాహన లేమి

ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు ఈ పథకం గురించే తెలియని పరిస్థితీ ఉంది. గిరిపుత్రిక కల్యాణ పథకం అనేది ఉందని, వివాహం చేసుకునే గిరిజన యువతి దీనికి దరఖాస్తులు చేసుకోవాలని తెలియని వారు అనేకులు మారుమూల గిరిజన గ్రామాల్లో ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఈ పథకం గురించి తగినంత ప్రచారం లేదు. వస్తున్న దరఖాస్తులు వేల సంఖ్యలో ఉండడానికి మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు గల అవగాహనే కారణమంటున్నారు. అర్హమైన దరఖాస్తుదారులు ఎందరుంటే అందరికీ సాచ్యురేషన్ మోడ్‌లో ఈ పథకాన్ని అమలు చేయాలని గతంలో నిర్ణయించారు. కానీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఏటా ఇంత మందికేనంటూ లక్ష్యం ఇస్తుండటం సరికాదంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు వేల కోట్ల రూపాయలున్నా ఈ పథకం కింద ప్రభుత్వం ఎక్కువ మంది లబ్ధిదారులను ఎంపిక చేయించడం లేదని, చేయూతను అందించడం లేదని గిరిజన సంఘాల వారు ఆందోళన చెందుతున్నారు.

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి న్యాయం చేయండి

ప్రజాశక్తి-అరకు రూరల్ (విశాఖ)

అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన మోహనరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన బాధిత కుటుంబీకులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే కిడారి, ఐటిడిఎ పిఒ రవిసుభాష్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ, సంబంధిత కాంట్రాక్టర్ వచ్చి స్పష్టతనిచ్చే వరకు మృతదేహానికి పోస్టుమార్టం జరగనివ్వమని అరకు ఏరియా ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. సోమవారం గరడగుడలో రక్షితనీటి పథకం మోటారు స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లి, విద్యుదాఘాతానికి గురై మోహనరావు అనే గిరిజనుడు మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ ఆస్పత్రికి చేరుకుని సిపిఎం నేతలు, బాధిత కుటుంబీకులతో మాట్లాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటానని ఎమ్మెల్యే, చంద్రన్న బీమా పరిహారంతో పాటు ఐటిడిఎ నుంచి సాయం అందిస్తామని తెలిపారు.

ఫార్మా-డి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఫార్మా డి కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు, ప్రభుత్వాసుపత్రుల్లో ఖాళీ పోస్టుల భర్తీలో ఈ కోర్సు చేసిన వారికి అవకాశం ఇవ్వాలన్నారు. 2008లో కేంద్ర ప్రభుత్వం ఈ కోర్సును ప్రవేశపెట్టిందని, దీన్ని ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తించిందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మాస్యూటికల్ టెక్నాలజి, ఫార్మకాలజి, ఫార్మ కోర్ థెరపి, పాసాలజి, టాక్సికాలజి, క్లినికల్ రీసెర్చ్, థెరప్యూటిక్ డ్రగ్ మానిటరేటింగ్ తదితర అంశాల్లో ఈ అభ్యర్థులు నైపుణ్యంతో కూడిన సేవలు అందించగల్గుతారన్నారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారిని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, హెల్త్ కేర్, టిబి, మలేరియా, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో వినియోగించుకోవచ్చని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్‌ప్రకాష్ నడ్డాను కోరుతూ లేఖ రాసినట్లు పేర్కొన్నారు. ఈ పట్టభద్రుల స్వయం ఉపాధికి రుణ సదుపాయం కల్పించాలన్నారు.

దళితులకు పునరావాసం కల్పించాలని ప్రజాసంఘాల డిమాండ్

ప్రజాశక్తి – రుద్రవరం

కర్నూలు జిల్లా రుద్రవరం మండలం నక్కల దిన్నె గ్రామంలో పెత్తందారులు గ్రామ బహిష్కరణ చేసిన దళితులకు పునరావాసం కల్పించాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నక్కలదిన్నె గ్రామ దళితులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 31న జరిగిన సంఘటనపై వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ రూ.లక్ష చొప్పున ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలన్నారు. గ్రామంలో ఉన్న వందలాది ఎకరాల దేవాలయ భూములను దళితులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు పూర్తి రక్షణ కల్పించాలన్నారు.

రామారావుకు అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి- మందస (శ్రీకాకుళం జిల్లా)

విధి నిర్వహణలో గుండెపోటుతో సోమవారం హఠాన్మరణం చెందిన ప్రజాశక్తి శ్రీకాకుళం జిల్లా పలాస డివిజన్ ఇన్‌ఛార్జి జన్ని రామారావు అంతిమయాత్ర అశ్రు నయనాల మధ్య హరిపురంలో మంగళవారం జరిగింది. రామారావు భౌతికకాయానికి ప్రజాశక్తి సిబ్బంది, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు, బంధుమిత్రులు నివాళ్లర్పించారు. హరిపురంలోని రామారావు అత్తారింటి నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనగల శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగింది. అనంతరం భౌతికకాయానికి దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి విశాఖపట్నం, శ్రీకాకుళం ఎడిషన్ల మేనేజర్లు ఎస్.సుధాకర్, ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజాశక్తి అభివృద్ధికి అంకితభావంతో రామారావు పాటుపడ్డారని నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు చౌదరి తేజేశ్వరరావు మాట్లాడుతూ రామారావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి తీరనిలోటని అన్నారు. అంత్యక్రియల్లో సిపిఎం నాయకులు కె.మోహనరావు, బమ్మిడి ఆనందరావు, కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి దున్న వాసుదేవరావు, వైసిపి నాయకులు మరడ భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నాడిఎంకె నుండి దినకరన్ మద్దతుదారుల తొలగింపు

చెన్నై : దినకరన్ శిబిరంపై అణచివేత చర్యలను అన్నాడిఎంకె కొనసాగిస్తోంది. రెబెల్ శిబిరానికి చెందిన తొమ్మిదిమంది మద్దతుదారులను మంగళవారం తొలగించింది. ఉప ఎన్నికల్లో ఓటమితో కంగు తిన్న అన్నాడిఎంకె ఈ చర్యకు పాల్పడింది. ఆర్.కె.నగర్ నియోజకవర్గానికి ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో అన్నాడిఎంకె అభ్యర్థి మధుసూదన్‌పై 40వేల ఓట్ల మెజారిటీతో దినకరన్ గెలుపొందారు. పాలక పార్టీలోని ఇపిఎస్-ఒపిఎస్ వర్గం కొన్ని నెలల క్రితం దినకరన్‌ను పక్కకు పెట్టడంతో ఉప ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

- డిపాజిట్‌దార్ల ఆందోళన

కేంద్రం యఫ్‌ఆర్‌డిఐ చట్టాన్ని తీసుకురానున్నదని తెలియటంతో బ్యాంకుల నుండి తమ డిపాజిట్లను ఉపసంహరించుకోవటానికి బారులు తీరిన ఖాతాదారులు



బ్యాంకుల్లో డిపాజిట్ల ఉపసంహరణ

ఎఫ్‌ఆర్‌డిఐ బిల్లు ప్రభావం...

న్యూఢిల్లీ : ఆర్థిక పరిష్కారాలు, డిపాజిట్లు బీమా (ఎఫ్‌ఆర్‌డిఐ) బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఈ బిల్లు ఆమోదం పొందితే తమ డిపాజిట్లకు రెక్కలు వస్తాయనే భయంతో పెద్ద సంఖ్యలో డిపాజిటర్లు తమ మొత్తాలను బ్యాంకుల నుండి తీసుకుంటున్నట్లు వార్తలు అందుతున్నాయి. దీంతో దేశంలో పెట్టుబడుల సంక్షోభం తలెత్తవచ్చన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఒక బ్యాంక్‌లో గత వారంలో ఒక్క రోజునే రు.22కోట్ల మొత్తాలను విత్‌డ్రా చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ భయాందోళనలు మరీ ఎక్కువగా వున్నాయి. బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టినప్పటి నుండి ఇప్పటివరకు బ్యాంకుల నుండి రు.15వేల కోట్లు బయటకు వెళ్ళిపోయినట్లు అంచనా అని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఎఐబిఇఎ) జాతీయ కార్యదర్శి ఎ.రాంబాబు చెప్పారు. బెంగళూరుకు చెందిన బ్యాంక్ మేనేజర్ రామనారాయణ మాట్లాడుతూ, గతంలో తమ బ్యాంక్ రు.10నుండి 15లక్షల వరకు డిపాజిట్లను సమీకరించిందని, కానీ గత వారం నుండి మొత్తంగా పరిస్థితి స్తంభించిందని చెప్పారు. ఆర్థిక, సామాజిక అధ్యయనాల డైరెక్టరేట్ కార్యాలయం డైరెక్టర్ ఎస్.గలబ్ మాట్లాడుతూ, ప్రభుత్వం వెంటనే ఎలాంటి చర్యలు తీసుకోని పక్షంలో తీవ్రమైన పెట్టుబడుల సంక్షోభానికి దారి తీయవచ్చని అన్నారు. దీనివల్ల అభివృద్ధి క్రమం కుంటుపడుతుందన్నారు. ఇటువంటి ధోరణి, ఇటీవలే రెండు రాష్ట్రాలుగా విభజించబడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాల పునర్నిర్మాణ క్రమాన్ని దెబ్బతీసే అవకాశం వుందని పేర్కొన్నారు. మౌలిక, నీటిపారుదల ప్రాజెక్టులకు నిధుల కోసం పెట్టుబడులను సమీకరించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా ఉదహరించారు.

ఖాతాదారులపై 1,771 కోట్లు జరిమానా

వసూలు చేసిన ఎస్‌బిఐ

న్యూఢిల్లీ: తమ పొదుపు ఖాతాలలో కనీస నగదు నిల్వను కొనసాగించని బ్యాంకు ఖాతాదారులనుండి భారతీయ స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బిఐ) గత ఏడాది ఏప్రిల్ నవంబర్ మధ్య కాలంలో దాదాపు రు.1,771 కోట్ల జరిమానా వసూలు చేసినట్లు వెల్లడయింది. ఏటా పెరిగి పోతున్న పారు బకాయిలతో లాభాలకు గండిపడుతుండటంతో బ్యాంకులు అదనపు ఆదాయాన్ని పెంచుకునేందుకు ఖాతాదారుల కనీస నగదు నిల్వలపై కన్నేసిన విషయం తెలిసిందే. ఈ వసూళ్లలో దేశంలోని అతిపెద్ద బ్యాంక్ అయిన భారతీయ స్టేట్ బ్యాంక్ 1,771 కోట్ల రూపాయల భారీ మొత్తంతో అగ్రస్థానంలో నిలిచినట్లు తెలుస్తోంది. గత ఏడాది ద్వితీయ త్రైమాసికంలో ఈ బ్యాంకు ఆర్జించిన లాభాల మొత్తం రు.1,581.55 కోట్ల కంటె ఇది అధికం కావటం విశేషం. గత ఆర్థిక సంవత్సరంలో కనీస నగదు నిల్వల నుండి ఎస్‌బిఐకి ఎటువంటి ఆదాయమూ సమకూరలేదు. దాదాపు ఐదేళ్ల విరామం అనంతరం గత ఏడాది ఏప్రిల్ నుండి ఈ జరిమానా విధింపును ఎస్‌బిఐ తిరిగి ప్రవేశపెట్టింది. బ్యాంకులో మొత్తం 42 కోట్లకు పైగా పొదుపు ఖాతాలుండగా అందులో 13 కోట్ల మేర ప్రాథమిక పొదుపు ఖాతాలు, జన్‌ధన్ యోజన ఖాతాలు. ఈ రెండు తరహాల ఖాతాలను కనీస నగదు నిల్వ ఛార్జీల నుండి మినహాయించారు. ఎస్‌బిఐ తరువాత కనీస నగదు నిల్వలపై జరిమానా రూపంలో రు.97.34 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి పంజాబ్ నేషనల్ బ్యాంక్ తరువాతి స్థానంలో నిలిచింది. కాగా ప్రభుత్వ ఆధీనంలోనే వున్న పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్ ఒక్కటే ఖాతాదారుల నగదు నిల్వలపై ఎటువంటి జరిమానాలూ వసూలు చేయకపోవటం గమనార్హం. కనీస నగదు నిల్వల కొనసాగింపు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల్లో అధికశాతం ఖాతాదారులపై జరిమానాల భారం మోపుతున్న విషయం తెలిసిందే.

రాజకీయ విప్లవం సృష్టిస్తా: రజనీకాంత్

చెన్నయ్: త్వరలో ప్రకటించనున్న రాజకీయ పార్టీ ఏర్పాటు ద్వారా తాను తమిళనాట రాజకీయ విప్లవం సృష్టించాలని భావిస్తున్నట్లు ప్రముఖ నటుడు రజనీకాంత్ చెప్పారు. గత నెల 31న తన రాజకీయ రంగ ప్రవేశాన్ని ప్రకటించి అందరి దృష్టినీ ఆకర్షించిన రజనీకాంత్ మంగళవారం ఇక్కడ కొంతమంది ఎంపిక చేసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తమ పార్టీ కుల, మతాలకు అతీతంగా ఆధ్యాత్మికతతో కొనసాగుతుందన్నారు. తమిళనాడు రాజకీయంగా అనేక ప్రధాన ఘటనలకు వేదికగా మారిందని, మహాత్మాగాంధీ సైతం ఇక్కడే తన విదేశీ వస్త్రబహిష్కరణ చేపట్టారని గుర్తు చేశారు. తాను కూడా ఇక్కడ రాజకీయ విప్లవం సృష్టిస్తానని ఆయన చెప్పారు. ఇప్పుడు మార్పు సంభవిస్తే భావితరాలకు మెరుగైన జీవితం లభిస్తుందన్నారు. గతంలో ఎస్‌ఎస్‌ఎల్‌సి పరీక్ష ఫెయిలనప్పుడు కొత్త కాలం ఓ కన్నడ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పనిచేశానని ఆయన వివరించారు. తాను సిగ్గరినని, తాను తగిన సమయంలో మీడియాతో ముచ్చటిస్తానని ఆయన చెప్పారు.

'సైనికులు చావాల్సిందే'

నోరు పారేసుకున్న బిజెపి ఎంపి, క్షమాపణ

న్యూఢిల్లీ : దేశ సరిహద్దుల రక్షణ కోసం ప్రాణాలొడ్డుతూ అనుక్షణం అప్రమత్తంగా వుండే సైనికులపై నోరుపారేసుకున్న బిజెపి ఎంపి నేపాల్ సింగ్ తరువాత తీరిగ్గా క్షమాపణ చెప్పారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని తప్పును మీడియాపైకి నెట్టే ప్రయత్నం చేశారు. రాంపూర్ నుండి లోక్‌సభలో ప్రాతినిధ్యం వహిస్తున్న ఘనత వహించిన ఈ ఎంపీ గారు మాట్లాడుతూ 'సైనికులు చావాల్సిందే' నంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అయితే తరువాత నాలుక్కరుచుకుంటూ తనకు సైనికులంటే అమిత గౌరవం వుందని, వారిని కించపర్చే వ్యాఖ్యలు తాను చేయబోనని అన్నారు. తన వ్యాఖ్యలను మీడియా వక్రీకరించిందని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెబుతున్నానని, శత్రు సైన్యాల బుల్లెట్ల బారి నుండి సైనికులను కాపాడే కవచాలను శాస్త్రవేత్తలు రూపొందించే వరకూ సైనికులు యుద్ధరంగంలో వీరమరణం చెందాల్సి వుంటుందన్నదని తన ఉద్దేశమని ఆయన వివరణ ఇచ్చారు. అంతకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ సిఆర్‌పి శిబిరంపై పాక్ సైనికుల కాల్పుల ఘటనను ప్రస్తావిస్తూ సైన్యంలో వున్న వారూ రోజూ మరణిస్తూనే వుంటారని, పోరాటంలో సైనికులు మరణించని దేశం ఏదీ లేదని అన్నారు. ఈ పోరులో మధ్యలో వున్న గ్రామస్తుల్లో కనీసం ఒక్కరైనా గాయపడుతుంటారన్నారు.

మహారాష్ట్రలో దళితాగ్రహం

మొదటి పేజీ తరువాయి

అద్దాలను పగులగొట్టారు. టైర్లు తగులబెట్టి నిరసన తెలిపారు. దళిత సంస్థలకు చెందిన కార్యకర్తలు, సామాజిక సంస్థలు, అంబేద్కర్ సంఘాలు తమ నిరసనలను వ్యక్తం చేశాయి. రహదారులను దిగ్బంధించాయి. సోమవారం జరిగిన హింసను తీవ్ర స్వరంతో ఖండించాయి. ఆందోళనలతో హార్బర్ లైన్‌లో పలు స్థానిక రైళ్ళ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కుర్ల-వశీల మధ్య నడిచే రైలుతో సహా పలు రైళ్లను రద్దు చేశారు. ముంబయిలోని పలు ప్రాంతాలలో రహదారులను దిగ్బంధించారు. దుకాణాలు మూయించారు. పునేలోని పలు ప్రాంతాలల్లోనూ, పింప్రి-చిన్చ్వడ్ లోనూ వాణిజ్యం, ప్రయాణీకుల రాకపోకలు స్తంభించాయి. పలు ప్రాంతాలలో బస్సులను దారి మళ్ళించారు. ఓల్డ్ ముంబయి-పునే జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది.భీమ-కొరెగావ్ ప్రాంతంలో కర్ఫ్యూ కొనసాగుతున్నప్పటికీ నిరసన కారులు తమ ఆందోళనను కొనసాగించారు. అహ్మద్‌నగర్ జిల్లాలో రాళ్ళు రువ్విన సంఘటనలు చోటు చేసుకున్నాయి. అనేక ప్రాంతాలలో బంద్ నిర్వహించారు. ప్రత్యేకించి మరట్వాడా ప్రాంతంలో నిర్వహించిన బంద్ ఉద్రిక్తతలకు దారితీసింది. పలు పార్టీలు, సంస్థలు నిగ్రహం పాటించాలని ఆందోళనకారులను కోరాయి.. మతోన్మాద సంస్థలే ఈ ఘర్షణలకు కారణమని భీమ-కొరెగావ్ శౌర్య దిన్ ప్రేరణ అభియాన్ నిర్వాహకులు ఆరోపించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేష్ మెవాని, రోహిత్ వేముల తల్లి రాధిక వేములతదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర బంద్

భీమ్ - కారెగావ్ యుద్ధ ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలకు నిరసనగానూ, సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగానూ బుధవారం రాష్ట్ర బంద్‌కు దళిత సంఘాలు పిలుపు ఇచ్చాయి. దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలకు నిరసనగా కూడా ఈ బంద్‌ను నిర్వహిస్తున్నట్లు సంఘాలు ప్రకటించాయి. దళితులు నిర్వహిస్తున్న ర్యాలీపై ప్రణాళిక ప్రకారంమే ఆర్‌ఎస్‌ఎస్, శివసేన దాడికి పాల్పడ్డాయని సంఘాలు ఆరోపించాయి. బుధవారం జరిగే బంద్‌కు సిపిఎం మహారాష్ట్ర రాష్ట్ర శాఖ పూర్తి మద్దతు ప్రకటించింది. హిందుతత్వ శక్తుల చేతిలో దళిత యువకుడి దారుణ హత్యను తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, లౌకిక ఆలోచనా ధోరణులను ప్రోత్సహించాలని సిపిఎం పిలుపు ఇచ్చింది.

సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ : ఫడ్నవీస్

భీమా-కారెగావ్ యుద్ధ ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం చోటు చేసుకున్న ఘర్షణలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు ఆదేశించినట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం తెలిపారు. ఘర్షణల నేపథ్యంలో చెలరేగిన హింసాకాండలో మృతి చెందిన యువకుని కుటుంబానికి రూ.10 లక్షలు నష్ట పరిహారాన్ని ప్రకటించారు. రాష్ట్రంలో శాంతి నెలకొనేలా సంయమనం పాటించాలని ఫడ్నవీస్ కోరారు

దేశవ్యాప్తంగా వైద్యుల నిరసన

- పలు చోట్ల వైద్య సేవలకు అంతరాయం



న్యూఢిల్లీ : వైద్య వృత్తి నిపుణుల కోసం కేంద్రం తాజాగా ప్రతిపాదిస్తున్న నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) బిల్లుపై వైద్యులు దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఈ బిల్లుకు వ్యతిరేకంగా భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఎ) పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మందికి పైగా వైద్యులు మంగళవారం నాడు 12 గంటల ఆందోళనను నిర్వహిం చారు. దీంతో పలుచోట్ల వైద్య సేవలకు అంతరాయం కలిగింది.

ప్రస్తుతం అమలులో వున్న భారతీయ వైద్య మండలి (ఎంసిఐ) స్థానంలో ఎన్ఎంసిని అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఈ బిల్లును ప్రతిపాదిస్తోంది. ప్రత్యామ్నాయ వైద్య విద్యనుఅభ్యసించిన వారందరినీ అలోపతి వైద్య విధానానికి అనుమతించే ఈ బిల్లు ప్రతిపాదించిన రోజు దేశ వైద్య చరిత్రలో బ్లాక్‌డే అని వైద్యులు పేర్కొన్నారు. దీనితో పాటు ప్రైవేటు వైద్య కళాశాలల విధి విధానాలను సులభతరం చేసేందుకు కూడా ఈ బిల్లులో వెసులుబాటు లభిస్తుంది. న్యూఢిల్లీతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలో వైద్యులు ఔట్‌పేషెంట్ సేవలను బహిష్కరించి తమ నిరసన తెలియచేశారు. కేంద్ర ప్రభుత్వం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు పేషెంట్ వ్యతిరేకమైనదని, ప్రజా వ్యతిరేకమైనదని వరల్డ్ సైకియాట్రిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాయ్ అబ్రహామ్ కల్లివయలిల్ విమర్శించారు.

వైద్య వృత్తికి ప్రయోజనకరం : ఆరోగ్యమంత్రి నడ్డా

మంగళవారం రాజ్యసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన ఆరోగ్యశాఖ జగత్ ప్రకాశ్ నడ్డా మాట్లాడుతూ భారతీయ వైద్య మండలి (ఎంసిఐ) స్థానంలో ఏర్పడనున్న కొత్త వ్యవస్థ వైద్య వృత్తికి అత్యంత ప్రయోజనకరంగా వుంటుందన్నారు. ఈ బిల్లుపై వైద్యుల సందేహాలను నివృత్తి చేసేందుకు ఐఎంఎతో చర్చలు జరుగుతున్నాయన్నారు. తాము ప్రవేశపెడుతున్న బిల్లు వైద్య వృత్తికి ప్రయోజనకరంగా వుంటుందని, దీనిపై వారి అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

తమిళనాడులో వైద్యుల నిరసన

చెన్నై నగరంతో పాటు తమిళనాడు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ నగరాలు, పట్టణాలలో వైద్యులు ఎన్ఎంసి బిల్లుకు నిరసనగా ఆందోళన నిర్వహించారు. చెన్నై నగరంలో పిజి వైద్య విద్యార్థులు మద్రాస్ వైద్య కళాశాల ఎదుట సాయంత్రం 4.30 గంటలకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. రోగులకు, ప్రజలకు వ్యతిరేకంగా వున్న ఈ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని పట్టాలి మక్కల్ కచ్చి (పిఎంకె) యువజన విభాగం నేత, మాజీ కేంద్ర మంత్రి అన్బుమణి రామ్‌దాస్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్రం తలపెట్టిన ఈ చర్య రాష్ట్రాల వ్యవహారాలలో అనుచిత జోక్యం చేసుకోవటమేనన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా తమిళనాడు ప్రభుత్వ వైద్యుల సంఘం (టిఎన్‌జిడిఎ) నిరసన ప్రదర్శన నిర్వహిస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు కె సెంథిల్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహారాష్ట్రలో

ఎన్ఎంసి బిల్లుకు నిరసనగా మహారాష్ట్రలో దాదాపు 40 వేల మందికి పైగా వైద్యులు మంగళవారం సమ్మెలో పాల్గొన్నారు. కేవలం అత్యవసర కేసులు, ఇంతకు ముందే అడ్మిట్ అయిన కేసులకు మాత్రమే వైద్య చికిత్స అందిస్తున్నామని, అవుట్‌పేషెంట్ విభాగంలో సేవలు వుండవని ఐఎంఎ జాతీయకార్యదర్శి డా.జయేష్ లేలే చెప్పారు. కొత్తమండలిలో మెజార్టీ సభ్యులు ప్రభుత్వంతో నియమితులైన వారేనని, ఇందులో సమస్యాత్మకమైన అంశాలు అనేకం వున్నాయని అన్నారు.

కర్నాటకలో

ఎన్ఎంసి బిల్లుకు వ్యతిరేకంగా ఐఎంఎ ఇచ్చిన పిలుపు మేరకు కర్నాటకలో వైద్యులు పూర్తి స్థాయి సమ్మెలో పాల్గొన్నారు. హుబ్బళ్లి నగరంలో వైద్యులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించిన ఎన్ఎంసి బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తాసిల్దార్‌కు వినతిపత్రం అందచే శారు. వైద్యుల ఆందోళనతో రాష్ట్రంలోని దాదాపు అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఔట్‌పేషెంట్ విభాగాలు మూతపడ్డాయి.

కేరళలో..

కేంద్రం ప్రతిపాదిస్తున్న ఎన్ఎంసి బిల్లుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ఆందోళనకు కేరళ ప్రభుత్వ వైద్యాధికారుల సంఘం (కెజిఎంఒఎ) పూర్తి మద్దతు ప్రకటించింది. ఆందోళనలో భాగంగా మంగళవారం ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకూ ఔట్‌పేషెంట్ సేవలను వైద్యులు బహిష్కరించారని ఐఎంఎ నేతలు వివరించారు. అయితే కేజువాలిటీ, ఎమర్జెన్సీ సేవలకు మాత్రం మినహాయింపునిచ్చారు.

స్థాయీ సంఘానికి ఎన్ఎంసి బిల్లు

వైద్యుల ఆందోళన వాయిదా

న్యూఢిల్లీ: భారతీయ వైద్య మండలి (ఎంసిఐ) స్థానంలో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి)ని ఏర్పాటుచేయాలని ప్రతిపాదిస్తూ కేంద్రం ప్రవేశపెట్టిన బిల్లును మంగళవారం నాడు పార్లమెంటరీ స్థాయీ సంఘ పరిశీలనకు నివేదించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్య రంగ నిపుణులు మంగళవారం నాడు దాదాపు 12 గంటలసేపు ఆందోళన నిర్వహించారు. పార్లమెంట్‌లోని పలువురు సభ్యులు, వైద్య రంగానికి చెందిన నిపుణుల సూచనలు, డిమాండ్ల మేరకు ఈ బిల్లును పార్లమెంటరీ స్థాయీ సంఘానికి నివేదించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ లోక్‌సభలో ప్రకటించారు. ప్రత్యామ్నాయ వైద్య విధానాలను అభ్యసించిన వైద్య నిపుణులు ఒక 'బ్రిడ్జ్ కోర్స్'ను పూర్తి చేయటం ద్వారా అలోపతి వైద్య విధానాన్ని అనుసరించేందుకు ఈ బిల్లు అనుమతిస్తోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావటానికి ముందే కమిటీ తమ నివేదికను అందచేయాలని కోరినట్లు మంత్రి వివరించారు. భారతీయ వైద్య మండలిస్థానంలో ఏర్పాటయ్యే జాతీయ వైద్య కమిషన్‌కు ఛైర్మన్‌ను సభ్యులను ప్రభుత్వం నియమిస్తుంది. వీరిని కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని ఒక కమిటీ ఎంపిక చేస్తుంది. అంతకు ముందు వైద్యుల సమ్మె విషయాన్ని పార్లమెంట్ ఉభయసభల్లో సభ్యులు జీరో అవర్ సమయంలో ప్రస్తావించారు.

ఆందోళన వాయిదా వేసుకున్న వైద్యులు

ఎన్ఎంసి బిల్లుకు వ్యతిరేకంగా మంగళవారం నాడు 12 గంటల సమ్మె నిర్వహించిన వైద్యులు బిల్లును స్థాయీ సంఘానికి నివేదించినట్లు తెలియటంతో ఆందోళనను వాయిదా వేసుకుంటున్నట్లు ప్రకటించారు.

నేడు రాజ్యసభ ముందుకు ట్రిపుల్ తలాక్ బిల్లు

- కాంగ్రెస్‌తో బిజెపి మంతనాలు
- సవరణలకు ప్రతిపక్షాలు యోచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తీవ్ర చర్చనీయాంశమైన ట్రిపుల్ తలాక్ బిల్లును బుధవారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్, సిపిఎం, టిఎంసి, బిజెడి వంటి ప్రతిపక్ష పార్టీలు బిల్లుపై సవరణలను ప్రతిపాదించాలని భావిస్తున్నాయి. గురువారం లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదించారు. బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు (కాంగ్రెస్, సిపిఎం, ఎంఐఎం, బిజెడి) పలు సవరణలకు పట్టుబట్టాయి. కాంగ్రెస్ ఎంపి సుస్మితా దేవ్, సిపిఎం ఎంపి ఎ.సంపత్, ఎంఐఎం అసదుద్దీన్ ఒవైసి, బిజెడి ఎంపి భర్తృహరి మెహతాబ్ సవరణలు ప్రతిపాదించారు. కానీ సభలో అధికార పక్షానికి పూర్తి మెజారిటీ ఉండటంతో మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందింది.

అయితే రాజ్యసభలో మాత్రం ప్రతి పక్షాలకు మెజారిటీ వుండటంతో తలాక్ బిల్లుకు ఆమోదం లభిస్తుందా, లేదా అన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ నేతత్వంలో అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమైతే తలాక్ బిల్లు వీగిపోయే అవకాశాలే ఎక్కువ. తలాక్ బిల్లు విషయంలో రాజ్యసభలో అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్, సిపిఎం, ఇతర పక్షాల మధ్య చర్చలు నడిచాయి కానీ ఉమ్మడి నిర్ణయానికి సంబంధించిన ప్రకటన మాత్రం వెలువడలేదు. మిగతా పక్షాలతో సంబంధం లేకుండా కాంగ్రెస్ సొంతగా బిల్లులో కొన్ని మార్పులను సూచించే అవకాశాలున్నట్లు తెలిసింది. మార్పులకు ప్రభుత్వం అంగీకరించని పక్షంలో "సెలెక్ట్ కమిటీ"కి పంపాలనే డిమాండ్‌ను తెరపైకి తేనున్నట్లు సమాచారం. వివాహాలకు సంబంధించినవి సివిల్ వివాదాలు కాగా.. బిజెపి తీసుకొచ్చిన బిల్లుతో వాటిని క్రిమినల్ వివాదాలుగా మార్చేసిందన్న సిపిఎం వాదనతో ఏకీభవిస్తున్నట్లు కాంగ్రెస్ గతంలోనే ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజ్యసభలో కాంగ్రెస్ తీసుకోబోయే నిర్ణయం కీలకంగా మారింది. అయితే ఈ బిల్లు విషయంలో కాంగ్రెస్ ముందస్తు వ్యూహ రచన చేసిందని ఆ పార్టీ వర్గాల సమాచారం. ట్రిపుల్ తలాక్ చట్టంలో పేర్కొన్న క్రిమినల్ చర్యల విషయంలో రాజ్యసభలో చర్చ సందర్భంగా సవరణలకు పట్టుబట్టాలని కాంగ్రెస్ వ్యూహంగా తెలుస్తోంది. క్రిమినల్ చర్యలను సివిల్ చర్యలుగా మార్చడం, అందుకు ప్రభుత్వం ఒప్పుకోని పక్షంలో సెలెక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేయడం, అందుకూ ఒప్పుకోనట్లయితే ఓటింగ్‌కు పట్టుబట్టడం కాంగ్రెస్ వ్యూహంగా చెబుతున్నారు. రాజ్యసభలో బిజెపికి మెజారిటీ లేకపోవడం కూడా ప్రతిపక్షాలకు కలిసొచ్చే అంశం.

కాంగ్రెస్‌తో సంప్రదింపులు

రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందేలా చూసేందుకు కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతరులను కూడా సంప్రదిస్తున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్ కుమార్ తెలిపారు. ఏకగ్రీవంగా బిల్లు ఆమోదం పొందుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. కాగా, బిల్లును సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని వామపక్షాలు పట్టుబట్టనున్నట్లు సిపిఐ నేత డి.రాజా తెలిపారు.

బిజెపి ఎంపిలకు విప్ జారీ

ట్రిపుల్ తలాక్‌తో పాటు మరికొన్ని కీలక బిల్లులు కూడా బుధ, గురువారాల్లో ఉభయసభల్లో ప్రవేశపెట్టనున్నారు. దీంతో జనవరి 3,4 తేదీల్లో సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ బిజెపి తన సభ్యులకు విప్ జారీ చేసింది. బుధవారం ఉదయం బిజెపి పార్లమెంటరీ పార్టీ భేటీ జరగనుంది.

రాజకీయ విరాళాలకు ఎలక్టోరల్ బాండ్లు : అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ : ఎన్నికల విరాళాలలో అవినీతిని నిరోధించడం కోసం ఎలక్ట్రోరల్ బాండ్లను ప్రవేశం పెట్టారు. రాజకీయ పార్టీలకు విరాళం ఇవ్వడానికి ఉపయోగించే బాండ్లు ఎంపిక చేసిన ఎస్‌బిఐ శాఖాల్లో లభ్యమవుతాయి. చెల్లింపుదారు పేరు లేకుండా ఈ బాండ్లను కొనుగోలు చేయవచ్చని, రూ. 1000, రూ 10 వేలు, రూ. లక్ష, రూ, కోటి విలువల్లో ఈ బాండ్లు లభ్యమవుతాయని లోక్‌సభలో ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు.

నమోదైన రాజకీయ పార్టీలకు మాత్రమే విరాళాలు ఇవ్వడానికి ఉపయోగించే బాండ్లు 15 రోజుల వ్యవధిని మాత్రమే కలిగివుంటాయి. జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో 10 రోజుల చొప్పున ఈ బాండ్లు లభ్యమవుతాయి. కొనుగోలుదారులు తమ పేరు, వివరాలు చెప్పకుండా ఈ బాండ్లు కొనుగోలు చేయవచ్చని, భారతీయ పౌరసత్వం కలిగినవారు మాత్రమే బాండ్లు కొనుగోలుకు అర్హులని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ మహిళా పథకాల సమాచారానికి కొత్త పోర్టల్

న్యూఢిల్లీ : మహిళల కోసం ప్రభుత్వం చేపట్టే వివిధ పథకాలు, చొరవలకు సంబంధించిన సమాచారమంతా ఒక్కచోటే లభించేలా కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఒక పోర్టల్‌ను ప్రారంభించింది. 'నారి' అనే పేరుతో కొత్త వెబ్‌ను కేంద్ర మంత్రి మనేకా గాంధీ మంగళవారం ప్రారంభించారు. ఇందులో 350 పథకాలకు సంబంధించిన సమాచారం వుంటుంది. ఈ సందర్భంగా మంత్రి మనేకా గాంధీ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్దిష్ట కార్యక్రమాలు, పథకాలకు సంబంధించిన సమాచారంతో 'నారి' పేరుతో తీసుకువచ్చిన ఈ చొరవ చాలా మంచిదని పేర్కొన్నారు. మంచి పోషకాహారంపై పలు సూచనలు, సలహాలు ఈ వెబ్‌సైట్‌లో వుంటాయి. అలాగే మహిళల ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం, ప్రధాన వ్యాధులపై అవగాహన, ఉద్యోగాల అన్వేషణకు, ఇంటర్వ్యూలు ఎదుర్కొనడానికి, పెట్టుబడులు పెట్టడానికి, పొదుపు మొత్తాలపై సూచనలు, సలహాలు వుంటాయి. అలాగే మహిళలపై జరిగే నేరాలు, వాటిని ఎలా ఫిర్యాదు చేయాలో కూడా తెలియచేస్తారు. లీగల్ ఎయిడ్ సెల్స్ సమాచారం కూడా వుంటుంది. 'ఇ సంవాద్' అనే మరో వెబ్ పోర్టల్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. ఎన్‌జిఓలు, ఇతర పౌర సమాజ ప్రముఖులు తమ ప్రతిస్పందనలను, సలహాలను, ఇబ్బందులను ఇందులో తెలియచేస్తారు.

ప్రత్యేకం

తప్పుల తడకగా అసోం తొలి జాబితా

- 3.29 కోట్లమందిలోనే 1.9 కోట్ల మంది పేర్లు మాత్రమే
- భర్త పేరు వుంది.. భార్య పేరు గల్లంతు
- ఆరుగురి కుటుంబంలో ముగ్గురికే స్థానం

గువాహతి : అసోంలో దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సి) తొలి జాబితాను ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 3.29 కోట్ల జనాభాలో ఈ తొలి జాబితా ద్వారా 1.9 కోట్ల మందిని చట్టబద్ధమైన భారతీయులుగా గుర్తించారు. అసోంలో మొత్తం 3.29 కోట్ల మంది భారతీయ పౌరసత్వం నమోదు చేసుకున్నారు. అయితే ఇందులో ఈ తొలి జాబితా ద్వారా 1.9 కోట్ల మందిని భారత పౌరులుగా నిర్ధారించారు. ఈ జాబితా కోసం ఆతృతగా వేచి చూసిన అస్సామీల్లో అనేక మంది పేర్లు గల్లంతయ్యాయి. మిగిలినవారి పేర్లు తనిఖీ చేయబడుతున్నాయని అధికారులు అంటున్నారు. అక్రమంగా ఎవ్వరూ వలసదారులుగా గుర్తించబడరని అధికారులు చెబుతున్నారు.

అయితే ఈ జాబితాపై అస్సామీల నుంచి వ్యతిరేకత, అసంతృప్తి వస్తోంది. ఉదాహరణకు దిగువ అసోంలోని గోయల్పర జిల్లాలో బెంగాల్ నుంచి వచ్చిన ముస్లింలు అధిక సంఖ్యలో వుంటారు. అయితే వీరందరినీ బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా వలస వచ్చినవారుగా స్థానికులు, అధికారులు భావిస్తుంటారు. వీరి పేర్లు తాజా జాబితాలో లేవు. తదుపరి వచ్చే జాబితాలోనూ వుంటాయనే నమ్మకం లేదు.


అలాగే మణిదాస్ అనే వ్యక్తి పేరు జాబితాలో వుంది. కానీ అతని భార్య పేరు లేదు. అతనికి కూడా జలాలుద్దీన్‌కు ఇచ్చిన సమాధానమే లభించింది.

అలాగే, జలాలుద్దీన్ అనే రైతు కుటుంబంలో ఆరుగురు సభ్యులకు గానూ, ముగ్గురి పేర్లు మాత్రమే జాబితాలో వున్నాయి. మరో ముగ్గురు పేర్లు లేవు. దీని గురించి అధికారులను అడగగా, 'ఇది ఆందోళన చెందాల్సిన విషయం కాదు' అని సమాధానం ఇచ్చారు. మిగిలిన పేర్లు తదుపరి జాబితాలో వస్తాయని తెలిపారు.

సేవా కేంద్రాల వద్ద ప్రజలు తమ పేర్లను తనిఖీ చేసుకున్నారు. ఒక సేవా కేంద్రం వద్ద 13 వేలకు పైగా ప్రజలు తనిఖీ చేసుకోగా, వారిలో కేవలం 3,511 మంది పేర్లు మాత్రమే జాబితాలో వున్నాయి. ఈ 3,511 మంది కూడా పురుషులే కావడం గమనార్హం.



ముజిబుర్ రహ్మాన్ అనే ఈ-రిక్షా డ్రైవర్ పేరు లేదు. 'మీరు ఏమీ ఆందోళన చెందాల్సిన పనిలేదు. మీ దగ్గర అన్ని పత్రాలు వున్నప్పుడు తప్పని సరిగా వచ్చే జాబితాలో మీ పేరు వుంటుంది' అని అధికారులు తెలిపారు.



'మా కుటుంబంలో పురుషుల అందరి పేర్లు వున్నాయి. కానీ నా పేరు, నా కుమార్తెలు పేర్లు, నా కోడళ్ల పేర్లు లేవు' 'మా పేర్లు తరువాత జాబితాలో వుంటాయని నా కుమారులు తెలిపారు' దీపాలి

కాగా, సంసల్ హాక్ అనే వ్యక్తి మాత్రం ఈ జాబితాతో ఊరట లభించింది. ఈ జాబితాతో అతను చట్టబద్ధమైన భారతీయ పౌరుడుగా గుర్తింపు లభించింది. 1997లో హక్‌ను సందేహాస్పద ఓటరుగా ఎన్నికల సంఘం ప్రకటించింది. 2015లో విదేశీయుల ట్రిబ్యునల్ దీన్ని కొట్టివేసింది. దీంతో అతనికి ఈ జాబితాలో స్థానం దక్కింది. దీనిపై సంసల్ హాక్ మాట్లాడుతూ 'వారు నన్ను భారతీయుడుగా గుర్తించారు. అయితే 20 ఏళ్ల నేను, నా కుటుంబం తీవ్ర అవమానాలు ఎదుర్కొన్నాం' అని తెలిపాడు.

తొలి జాబితాలో స్థానం దక్కడంపై సంసల్ సంతోషంగా వున్నాడు. అయితే సంసల్ హాక్ వంటి వారి సంఖ్య అస్సోంలో చాలా తక్కువగా వుంది.

సంక్షిప్తం

బెంగాల్‌లోని ఉల్బెరియాలో సిపిఎం ప్రచారం

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని ఉల్బెరియా నియోజకవర్గ ఉప ఎన్నికలకు లెఫ్ట్‌ఫ్రంట్ తరుపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి సబిరుద్దీన్ మొల్లా ప్రచారాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో అవినీతి తృణమూల్ కాంగ్రెస్, కేంద్రంలో మతతత్వ బిజెపిని వ్యతిరేకిస్తూ సిపిఎంను గెలిపించాలని ప్రజలను కోరుతూ ప్రచారం సాగిస్తున్నారు. మొల్లాకు ఓటు వేసి తృణమూల్, బిజెపి ద్వయానికి బుద్ధి చెప్పాలని విన్నవించారు.

ప్రముఖ ఉర్దూ కవి అన్వర్ జలాల్పురి కన్నుమూత

లక్నో : పద్య రూపంలో భగవద్గీతను ఉర్దూలోకి అనువాదం చేసిన ప్రముఖ ఉర్దూ కవి అన్వర్ జలాల్పురి మంగళవారం ఉదయం ఇక్కడ కెజిఎంయు ఆస్పత్రిలో గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయస్సు 71సంవత్సరాలు. గత గురువారం ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో విషమ పరిస్థితిలో ఆస్పత్రిలో చేర్చారు. బాత్ రూంలో కాలు జారి పడడంతో తలకు గాయమై స్పృహ కోల్పోయిన ఆయన్ని వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్ళారు. ఆయన మెదడులో రక్తం గడ్డ కట్టిందని తెలియడంతో వెంటనే కెజిఎం యుకి తరలించారు.

గంటలో ... ఆరుగురి హత్య..

హర్యానాలో అటవీ శాఖ అధికారి నిర్వాకం

పల్‌వాల్ : హర్యానాలోని పల్వాల్ జిల్లాలో వ్యవసాయ శాఖకు చెందిన సబ్ డివిజనల్ అధికారి నరేష్ కడియన్ మంగళవారం గంటలో ఆరుగురిని హత్య చేసి సంచలనం సృష్టించాడు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో మంగళవారం తెల్లవారు ఝామున హత్యాకాండను సాగించాడు. హత్యకు గురైన వారిలో ఒక మహిళ కూడా ఉన్నారు. ఆ తరువాత కడియన్‌ను పోలీ సులు అరెస్టు చేశా రు. ఒక ప్రైవేటు ఆసుపత్రిలో రోగికి సహాయకురాలిగా వచ్చిన ఒక మహిళ మొదటిసారిగా హత్యకు గురయ్యింది. మంగళవారం తెల్లవారు ఝామున 2.30 గంటల సమయంలో ఈ హత్య జరిగింది. ఆ తరువాత ఒక గంట సమయంలోనే మరో ఐదు హత్యలు జరిగినట్లు పోలీసులకు సమాచారం అందింది.

బ్రిటన్‌లో భారీ టిక్కెట్ ధరలు

ప్రయాణికుల ఆందోళన

లండన్ : బ్రిటన్‌లో భారీ టిక్కెట్ల ధరలను పెంచారు. ఈ టిక్కెట్ ధరలు వంద పౌండ్ల కన్నా ఎక్కువకు పెరగడంతో బ్రిటన్‌లో రైల్వే ప్రయాణికులు ఆందోళన నిర్వహించారు. దాదాపు 40స్టేషన్లలో ఆందోళనలకు చేపట్టారు. బ్రిటన్ రైలు ఛార్జీలు యూరప్‌లోకెల్లా అత్యంత ఎక్కువగా వున్నాయని విమర్శిస్తున్నారు. తాము చెల్లిస్తున్న ఛార్జీలకు అనుగుణంగా సరైన ప్రయోజనా లను పొందలేకపోతున్నామని వారు పేర్కొంటున్నారు. సోషల్ మీడియాలో ఈ పెంపుపై తీవ్రంగా విమర్శలు వెల్లువెత్తాయి. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగానే టిక్కెట్ల ధరలను పెంచాల్సి వచ్చిందని బ్రిటన్ రవాణా విభాగం తెలిపింది.



బాదుడుపై ఆగ్రహం

రైల్వే ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ లండన్‌లోని కింగ్స్ క్రాస్ రైల్వే స్టేషన్‌లో ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న ప్రయాణికులు

కిమ్ ప్రకటనను స్వాగతించిన ద.కొరియా

సియోల్: తాము నిర్వహించనున్న శీతాకాలపు ఒలింపిక్ క్రీడలలో పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ ఉ.కొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్ చేసిన ప్రకటనను తాము స్వాగతిస్తున్నట్లు ద.కొరియా ప్రకటించింది. 2018 శీతాకాలపు ఒలింపిక్స్‌కు తమ క్రీడాకారుల బృందాన్ని పంపనున్నట్లు కిమ్ చేసిన ప్రకటనను తాము స్వాగతిస్తున్నామని ద.కొరియా అధ్యక్ష ప్రతినిధి పార్క్ సూహ్యూన్ మంగళవారం ఇక్కడ మీడియాకు చెప్పారు. కిమ్ నిర్ణయం ఉభయ కొరియాల మధ్య సంబంధాల మెరుగుదలకు దారితీస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. దీనితో పాటు కొరియా ద్వీపకల్పంలోనూ, ఈశాన్య ఆసియా, ఇతర ప్రపంచ దేశాలలో శాంతి, సామరస్యాల మెరుగుదలకు దోహదపడుతుందని భావిస్తున్నామన్నారు. కొరియా ద్వీపకల్పానికి సంబంధించిన సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకునేందుకు ఉ.కొరియాతో కలిసి పని చేయాలని తాము కోరుకుంటున్నామన్నారు. అదే విధంగా అంతర్జాతీయ సమాజ సహకారంతో ఉ.కొరియా అణ్వస్త్ర వివాదాన్ని పరిష్కరించుకుంటామన్నారు. ద.కొరియా ఆధ్వర్యంలో జరిగే శీతాకాలపు ఒలింపిక్స్‌కు తమ క్రీడాకారుల బృందాన్ని పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కిమ్ ప్రకటించిన నేపథ్యంలో ద.కొరియా ఈ వ్యాఖ్యలు చేయటం విశేషం. ఉభయ దేశాల మధ్య శాంతియుత వాతావరణాన్ని కల్పించేందుకు వీలుగా సైనిక ఘర్షణల అవకాశాలకు తెరదించేందుకు ఉభయదేశాలూ కృషి చేయాలని కిమ్ తన ప్రకటనలో పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. శీతాకాలపు ఒలింపిక్, పారాలింపిక్ క్రీడలు ద.కొరియాలోని తూర్పు ప్రాంతంలో వున్న గాంగ్వాన్ ప్రావిన్స్‌లోని పియాంగ్‌చాంగ్ పట్టణంలో ఫిబ్రవరిలో ప్రారంభం కానున్నాయి.

సిరియాలో కొత్త మంత్రుల నియామకం

డెమాస్కస్: సిరియా అధ్యక్షుడు బషరల్ అసద్ తన మంత్రివర్గంలో కొత్త మంత్రులను నియమిస్తూ సోమవారం నాడు డిక్రీ జారీ చేశారు. రక్షణ, సమాచార, పరిశ్రమల శాఖకు లెఫ్టినెంట్ జనరల్ ఆలీ అబ్దుల్లా ఆయూబ్, లెఫ్టినెంట్ జనరల్ ఫహేద్ జస్సేమ్ అల్ ఫ్రెజ్‌తో పాటు ఎమాద్ అబ్దుల్లా సరాలను మంత్రులుగా నియమించినట్లు తెలిపారు.. ప్రధాని ఇమాద్ ఖమీస్ నేతృత్వంలోని ప్రభుత్వంలో చేపట్టిన ప్రక్షాళనలో భాగంగా ఈ కొత్త నియామకాలు జరిగాయని అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో జనరల్ ఆయూబ్ గతంలో సైనిక దళాల అధిపతిగా వ్యవహరించారు. సమాచార మంత్రిగా నియమితులైన ఎమాద్ అబ్దుల్లా సారా సిరియన్ రేడియో, టెలివిజన్ డైరెక్టర్ జనరల్‌గా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. గతంలో అహ్మద్ అల్ హము నిర్వహించిన పరిశ్రమల శాఖ బాధ్యతలను మహ్మద్ మజెన్ ఆలీ యూసుఫ్ చేపట్టారు. 2016లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఖమీస్ మంత్రివర్గ ప్రక్షాళన జరగటం ఇదే తొలిసారి కావటం విశేషం.

65మంది ఐఎస్ తీవ్రవాదులు హతం

కాబుల్ : ఆఫ్ఘనిస్తాన్‌లోని తూర్పు ప్రాంతాల్లో 65మంది ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) తీవ్రవాదులను ఆఫ్ఘన్ భద్రతా బలగాలు కాల్చి చంపాయని అధికారులు తెలిపారు. హస్కా మెనా జిల్లాలోని గార్గోర్, వాంగోరా ప్రాంతాల్లో భద్రతా బలగాలు నిర్వహించిన వైమానిక, పదాతి దాడుల్లో వీరిని హతమార్చినట్లు నాంగర్హర్ గవర్నర్ ప్రతినిధి తెలిపారు. ఈ దాడుల్లో ఒక పౌరుడు కూడా మరణించాడని, 13మంది గాయపడ్డారని చెప్పారు. కాగా ఈ దాడులపై ఐఎస్ ఇంతవరకు స్పందించలేదు. ఈ వారం ప్రారంభంలో అమెరికా బలగాలు నిర్వహించిన డ్రోన్ దాడుల్లో 11మంది తీవ్రవాదులు చనిపోయారు.

ట్రంప్ అబద్ధాలు : పాక్ ఆగ్రహం

అమెరికా రాయబారికి నిరసన



పాక్ ప్రధాని అబ్బాసీ

ఇస్లామాబాద్: ఉగ్రవాదంపై పోరుకు తాము సహకరించటం లేదంటూ అమెరికా అధ్యక్షుడు ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తున్న వ్యాఖ్యలన్నీ అబద్ధాలేనని పాకిస్తాన్ స్పష్టం చేసింది. ట్రంప్ వ్యాఖ్యలపై అధికారికంగా నిరసన తెలియచేసేందుకు తమ దేశంలోని అమెరికా రాయబారిని పాక్ విదేశాంగశాఖ పిలిపించుకొని నిరసన తెలిపింది. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కోరుతూ అమెరికా రాయబారి డేవిడ్ హేల్‌కు పాక్ విదేశాంగశాఖ సూచించింది. అమెరికా రాయబారి పాక్ విదేశాంగశాఖ కార్యాలయానికి వెళ్లారని ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయ ప్రతినిధి ఒకరు ధృవీకరించారు. గత పదిహేనేళ్ల కాలంలో పాకిస్తాన్‌కు దాదాపు 3,300 కోట్ల డాలర్ల మేర ఆర్థిక సహాయాన్ని అందించామంటూ ట్రంప్ సోమవారం నాడు ట్విట్టర్‌లో పోస్ట్ చేసిన ట్వీట్‌లన్నీ పూర్తి అబద్ధాలు, మోసపూరితమైనవేనని పాక్ విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ట్రంప్ ట్వీట్లపై మంగళవారం ప్రధాని షాహిద్ ఖాన్ అబ్బాసీ నేతృత్వంలోని జరిగిన కేబినెట్ భేటీలో సమగ్రంగా సమీక్షించిన ప్రభుత్వం దీనిపై అధికారికంగా స్పందించింది. అమెరికాతో నానాటికి దిగజారుతున్న సంబంధాలపై చర్చించేందుకు బుధవారం నాడు ఉన్నత స్థాయి పౌర, సైనికాధికారులతో ప్రభుత్వం భేటీని ఏర్పాటు చేసింది.

జాతీయ భద్రతా కమిటీ అత్యవసర భేటీ

కేబినెట్ సమావేశానికి ముందు జాతీయ భద్రత కమిటీ సమావేశాన్ని కూడా ప్రధాని అబ్బాసీ నిర్వహించారు. అమెరికా చేసిన ఆరోపణలపై పాక్ స్పందన ఏ విధంగా వుండాలనేదానిపైనా, దేశంలో మొత్తంగా భద్రతా పరిస్థితులపైనా సమావేశంలో సవివరంగా చర్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో విదేశాంగ, హోం, రక్షణ మంత్రులు, త్రివిధ బలగాల చీఫ్‌లు, పౌర, సైనిక అధికారులు పాల్గొన్నారు.

పాక్‌కు చైనా మద్దతు

ఉగ్రవాదంపై ప్రపంచ పోరాటంలో పాకిస్తాన్ ఎనలేని భాగస్వామ్యాన్ని కలిగియుందనీ, అంతర్జాతీయ సమాజం పాక్ చేస్తున్న ఈ కృషిని గుర్తించాలని చైనా తెలిపింది. పాక్‌పై ట్రంప్ చేసిన విమర్శలపై చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జెంగ్ షువాంగ్ స్పందిస్తూ ఉగ్రవాదంపై పోరులో పాక్ ఎన్నో త్యాగాలు చేసిందనీ, ఈ కృషిని అంతర్జాతీయ సమాజం గుర్తించాలని అన్నారు. ఉగ్రవాదంపై పోరుతో సహా అన్ని విషయాల్లోనూ అంతర్జాతీయ సహకారంలో పాక్ భాగస్వామ్యాన్ని చైనా స్వాగతిస్తుందని చెప్పారు.

బ్రెజిల్ జైల్లో ఘర్షణ, 9 మంది మృతి

సావోపాలో: బ్రెజిల్‌లోని గోయియాస్ రాష్ట్రంలోని ఒక జైలులో ఖైదీలు, ప్రత్యర్థి వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో 9 మంది మరణించారని, 14 మందికి పైగా గాయపడ్డారని అధికారులు చెప్పారు. అపరేసిడా డి గోయియానియా జైలు కాంప్లెక్స్‌లో కొందరు ఖైదీలు తమ ప్రత్యర్థులున్న బ్యారక్స్‌లోకి దూసుకెళ్లినపుడు ఈ ఘర్షణ ప్రారంభమైందని అధికారులు వివరించారు. దాడి చేసిన వారు పక్కనే వున్న జైలు బ్యారక్స్‌లోకి ప్రవేశించి అక్కడి పరుపులు దగ్ధం చేశారని, ఘర్షణలో మరణించిన వారి మృతదేహాలను కూడా దగ్ధం చేశారని చెప్పారు. ఈ మంటలను అగ్నిమాపక సిబ్బంది అదుపు చేశారన్నారు. ఈ ఘర్షణలో తొమ్మిది మంది మరణించినట్లు నిర్ధారించిన అధికారులు వారి వివరాలను వెల్లడించలేదు. ఈ ఘర్షణ నేపథ్యంలో 106 మంది ఖైదీలుతప్పించుకుని పారిపోయారని, వారిలో 29 మందిని అధికారులు తిరిగి అరెస్ట్ చేశారని స్థానిక మీడియా వెల్లడించింది. ఈ హింసాకాండ సమయంలో మరో 127 మంది ఖైదీలు పారిపోయినప్పటికీ వారు స్వచ్ఛందంగా తిరిగి వచ్చేశారని పేర్కొంది. ఘర్షణలు ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రత్యేక భద్రతా దళాలు జైలును తమ ఆధీనంలోకి తీసుకుని పరిస్థితిని అదుపు చేశాయని అధికారులు వివరించారు.

జర్మనీ ఎంపి రెచ్చగొట్టే వ్యాఖ్యలు

దర్యాప్తు జరుపుతున్న పోలీసులు

బెర్లిన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో రెచ్చగొట్టేలా పోస్ట్‌లు చేసినందుకు జర్మనీకి చెందిన మితవాద ఎంపిపై ప్రస్తుతం పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఎంపి, జర్మనీ ఎఎఫ్‌డి పార్టీ డిప్యూటీ నేత అయిన బీట్రిక్స్ వాన్ స్టార్చ్ ట్విట్టర్ ఖాతాను సోమవారం తాత్కాలికంగా నిలుపుచేశారు. కానీ తర్వాత కూడా ఆమె అందులో కవ్వించే వ్యాఖ్యలను పోస్ట్ చేశారు. "ఆటవిక ప్రవృత్తి కలిగిన, సామూహిక అత్యాచారానికి పాల్పడే, ముస్లిం పురుషులను బుజ్జగించడానికి కొలోన్ పోలీసులు ప్రయత్నిస్తున్నారంటూ ఆమె వ్యాఖ్యానించారు. విద్వేషంతో కూడిన, క్రిమినల్ నేరాభియోగాలను వాన్ స్టార్చ్‌పై మోపాలా వద్దా అనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

ఆమె పోస్ట్ చేసిన వెంటనే సైట్ నిబంధనలు ఉల్లంఘించారంటూ 12గంటల పాటు ఆమె ట్విట్టర్ ఖాతాను సస్పెండ్ చేశారు. తిరిగి సోషల్ మీడియాలోకి వచ్చిన తర్వాత ఆమె స్పందిస్తూ, ఫేస్‌బుక్ కూడా ఇప్పుడు నన్ను సెన్సార్ చేసింది. రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వ పాలన ఇక్కడ లేదని ఆమె వ్యాఖ్యానించింది. విద్వేషపూరితమైన ప్రసంగాలకు పాల్పడితే జర్మనీలో కఠిన శిక్షలు వున్నాయి. నోటిఫికేషన్ అందిన 24గంటల్లోగా ఆ వ్యాఖ్యలను తొలగించని పక్షంలో తీవ్ర చర్యలు తీసుకుంటారు. జర్మనీ సరిహద్దు దాటడానికి ప్రయత్నించే మహిళలు, పిల్లలపై కాల్పులు జరపవచ్చా అని ఫేస్‌బుక్‌లో అడిగిన ప్రశ్నకు జరపవచ్చునని వాన్ స్టార్చ్ సమాధానం చెప్పి అందరినీ ఆశ్చర్య చకితులను చేశారు.

కాంగో అధ్యక్షుడు వైదొలగాలి : ఐక్యరాజ్య సమితి

బ్రజవిల్లె : అధ్యక్ష బాధ్యతల నుండి ప్రశాంతంగా వైదొలగాల్సిందిగా కాంగో డెమోక్రటిక్ రిపబ్లిక్ (డిఆర్‌సి) అధ్యక్షుడు జోసెఫ్ కబిలాని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ కోరారు. 2016 చివరిలో కుదిరిన ఒప్పందం మేరకు కబిలా వైదొలగాలని అన్నారు. కబిలా పాలనకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలు, ఆందోళనల్లో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, 120మందికి పైగా అరెస్టయ్యారు. ఆదివారం ప్రార్థనలు ముగిసిన అనంతరం కేథలిక్ ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో రాజధాని కిన్షాసా, ఇతర నగరాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. 2016 డిసెంబరుతో అధ్యక్షుడుగా కబిలా రెండవ విడత పదవీ కాలం కూడా ముగిసింది. 2017 చివరినాటికల్లా తన వారసుడిని ఎంపిక చేసేందుకు ఎన్నికలు నిర్వహిస్తానని కబిలా ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు ఆ ఎన్నికలను 2018 డిసెంబరు 23న నిర్వహిస్తానని ప్రకటించారు. దీంతో కబిలా ఆలోచనల పట్ల ఆందోళనలు మొదలయ్యాయి. తన పాలనను పొడిగించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఇందుకోసం రాజ్యాంగబద్ధమైన పరిమితులను తొలగించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2016 డిసెంబరు 31న కుదిరిన ఒప్పందానికి అన్ని రాజకీయపార్టీలు, నేతలు కట్టుబడాలని గుటెరస్ కోరారు. సంయమనం పాటించాలంటూ ప్రజలను కోరారు.



మొదటి పేజీ తరువాయి

ఓవర్ డ్రాఫ్ట్ దిశగా

తీర్చుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రధానంగా నీటిపారుదల అభివృద్ధి సంస్థ, రోడ్డు అభివృద్ధి సంస్థ, ఎపిఐఐసి, ఎపిఎస్‌సిఎస్‌సిఎల్ వంటి సంస్థల్లో ఉన్న నిధులపై కసరత్తు ప్రారంభించారు. వీటి నుంచి దాదాపు రూ. 4వేల కోట్ల వరకు సమీకరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇవి వచ్చిన వెంటనే ఓవర్ డ్రాఫ్ట్ నుంచి బయటపడడమే కాకుండా, అవసరాలు కూడా తీర్చుకోవచ్చునని భావిస్తున్నారు. అయితే ఇతర సంస్థల నిధుల ద్వారా జనవరి నుంచి గట్టెక్కినప్పటికీ, ఫిబ్రవరి, మార్చి నెలల పరిస్థితి ఏమిటన్నది మళ్లీ ప్రశ్నార్థకమే అవుతోందని సీనియర్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

కళలకు చావులేదు

పొందేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. మాదాల రవి మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాచీన కళలు దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా సామ్యవాద శక్తులన్నీ ఏకమై పోరాడాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. అంతకు ముందు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎపి ప్రజానాట్యమండలి (సిపిఐ) రాష్ట్ర కార్యదర్శి చంద్రానాయక్ పాల్గొని సౌహార్ధ సందేశాన్ని ఇచ్చారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ప్రజలు అనేక సమస్యల్లోనున్నారన్నారు. వారిని జాగృతి చేసి పోరాటా మార్గంలో నడిపించేందుకు ప్రజాకళలు ఎంతగానో దోహదం చేస్తాయని వివరించారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన సముదాయ్ ప్రధాన కార్యదర్శి దేవేందర్‌గౌడ్ మాట్లాడుతూ నేడు మతతత్వశక్తులు పెచ్చరిల్లుతున్న క్రమంలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛమీద దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా అందరినీ ఏకం చేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు...

బళ్లారి రాఘవ సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా సాయంత్రం ఆర్ట్స్ కళాశాల మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రజానాట్యమండలి నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా 'సైరా బళ్లారి' అంటూ ఉభయ గోదావరి జిల్లాల కళాకారులు ప్రదర్శించిన నృత్యం అందరినీ ఆకట్టుకుంది. ఆ తరువాత విశాఖపట్నం వారు ప్రదర్శించిన వేమన నృత్యరూపకం ఆలోచింపజేసే విధంగా సాగింది. వేమన చెప్పిన పద్యాలను నృత్యరూపంలో ప్రదర్శించారు. ఆ తరువాత శ్రీకాకుళం కళాకారుల తప్పెటగూళ్లు, 'ఓభార్య, ఓభర్త, ఇంకో అది', గోగ్రహణం నాటికలు అందరినీ ఆలోచింప చేసేవిగా కొనసాగాయి.

హెచ్1 బి వీసాలకు పొడిగింపు లేదు

70 శాతం భారతీయులేనని అంచనా. మళ్లీ ఇందులో ఐటి రంగానికి చెందిన వారు ఎక్కువ. ఈ వీసా నిబంధనలు కఠినతరం చేయడం వలన భారతీయులపై ప్రభావం ప్రధానంగా పడనుందని అంచనా. కాగా, ట్రంప్ ప్రభుత్వం ప్రారంభంలోనే హెచ్-1 బి వీసాదారులను ఉద్యోగాల్లో చేర్చుకుంటున్న కంపెనీలకు హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. 'అమెరికా ఫస్ట్' అనే నిబంధనను నమ్మాలని పేర్కొంది.

అమరావతికి రూ.3,324 కోట్ల రుణం..

మదింపు ప్రాథమిక దశలో ఉన్నాయని, ప్రాజెక్టు మదింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత రుణానికి సంబంధించిన సంప్రదింపులు ప్రారంభమవుతాయని, ఈ సంప్రదింపుల ప్రక్రియ పూర్తయ్యాకనే రుణాన్ని మంజూరు చేస్తుందని ఆయన చెప్పారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం జనరల్ కేటగిరీ రాష్ట్రాలు ప్రపంచ బ్యాంకు వంటి బహుముఖ ఆర్థిక సంస్థల నుంచి పొందే ఆర్థిక సహాయం మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 70 శాతం మించకూడదన్నారు.

మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచే సమకూర్చుకోవలసి ఉంటుందని తెలిపారు. ప్రాజెక్టు ప్రారంభించిన తర్వాత జరిగే ఖర్చును రుణంలో భాగంగా ప్రపంచ బ్యాంకు నియమిత కాలపరిమితి ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తూ వస్తుందని వివరించారు. ప్రపంచ బ్యాంకు రుణం ఇంకా ఆమోదం పొందనందున ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధులు, వాటి వినిమయ పత్రాల సమర్పణ ప్రసక్తే లేదని మరో ప్రశ్నకు జైట్లీ సమాధానమిచ్చారు.

లైంగిక వేధింపుల కేసులో

గజల్ శ్రీనివాస్ అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

వివరాల మేరకు.. గతేడాది ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చిన యువతి గజల్ శ్రీనివాస్ నిర్వహిస్తున్న ఆలయ వాణి రేడియోలో జాకీగా చేరింది. గత రెండు నెలల నుంచి శ్రీనివాస్ బాధితురాలిపై లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్నాడని, తాను చెప్పినట్టు వినకుంటే ఉద్యోగంలో ఉండవంటూ బెదిరించండంతోపాటు, వాట్సాప్ ద్వారా అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలు పంపుతూ మానసికంగా వేధిస్తున్నాడని, గత రెండు నెలల నుంచి మసాజ్ చేయాలంటూ ఒత్తిడి చేస్తుండడంతో భరించలేకపోతున్నానని బాధితురాలు ఆరోపించింది. ఈ మేరకు గత నెల 29న పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించింది. గజల్ శ్రీనివాస్ లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ఫిర్యాదు చేసింది. తన దగ్గరున్న సాక్ష్యాధారాలను కూడా పోలీసులకు అందజేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. లైంగిక వేధింపుల కేసులో ఆడియో టేపులు, వీడియో క్లిప్పుంగులతోపాటు శ్రీనివాస్ కార్యాలయంలో పనిచేసే కొందరిని విచారించి పక్కా ఆధారాలతో అరెస్టు చేసినట్టు పంజాగుట్ట ఎసిపి విజయ్ కుమార్ తెలిపారు. కేవ్ టెంపుల్ అనే ఆర్గనైజేషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న గజల్ శ్రీనివాస్‌కు పంజగుట్టలోని వెంకటరమణ కాలనీలో కార్యాలయం ఉందని చెప్పారు. శ్రీనివాస్‌పై ఐపిసి 354, 354ఏ, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎసిపి చెప్పారు.

బెయిల్‌కు నో

లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్‌ను పంజగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం గజల్ శ్రీనివాస్‌కు 10 రోజుల రిమాండ్ విధించారు. ఆ వెంటనే గజల్ శ్రీనివాస్ తరపు న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టులో వాదోపవాదనలు జరిగిన అనంతరం బెయిల్ పిటిషన్‌ను న్యాయమూర్తి రద్దు చేశారు. దీంతో పోలీసులు గజల్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలావుండగా, గజల్ శ్రీనివాస్‌ను మూడు రోజుల కస్టడీకి ఇవ్వాలని పంజగుట్ట పోలీసులు కోర్టును కోరనున్నట్టు సమాచారం. ఇదిలావుండగా తాను గత కొద్ది రోజుల క్రితం ప్రమాదంలో గాయపడ్డానని అప్పటి నుంచి భుజం, కాలు నొప్పితో బాధపడుతున్నతాను ప్రతి రోజు ఫిజియో థెరపి చేయించుకుంటున్నానని గజల్ శ్రీనివాస్ చెప్పారు. తన వద్ద పనిచేస్తున్న యువతి తనకు ఫిజియో థెరపి వచ్చునని చెప్పి, వద్దని వారించినా ఆమె బలవంతంగా మసాజ్ చేసిందని, అంతే తప్ప తాను ఎలాంటి లైంగిక వేధింపులకు పాల్పడలేదని ఆయన చెప్పారు.

మరిన్ని విషయాలు వెలుగులోకి

ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు పక్కా సాక్ష్యాలను పోలీసులకు అందజేసింది. ఇంట్లో పని మనిషితో గజల్ శ్రీనివాస్ మసాజ్ చేయించుకుంటున్న వీడియోలను బాధితురాలు పోలీసులకు అందజేసింది. గజల్ ఆఫీస్‌లో బెడ్‌రూం ఏర్పాటు చేసుకున్నారని, దీనికి సంబంధించిన ఆధారాలను అరుణ పోలీసులకు అందజేసింది. ఈ కేసుకు సంబంధించిన పోలీసులు పనిమనిషి పార్వతి స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేశారు.

కుట్రతో ఇరికించారు...

గాయకుడు గజల్ శ్రీనివాస్ అలాంటి వ్యక్తి కాదని ఆయన కుటుంబ సభ్యులతోపాటు ఆలయ వాణి రేడియో జాకీలో పనిచేస్తున్న పార్వతి అన్నారు. గజల్‌పై కావాలనే కుట్రపూరింతాగా ఇరికించారన్నారు. ఆయనపై ఫిర్యాదు చేసిన అమ్మాయి పేరు అరుణ అని పేర్కొన్నారు. ఆ అమ్మాయి నాలుగు నెలలుగా ఆఫీసులో పనిచేస్తున్నట్టు తెలిపారు. గజల్ శ్రీనివాస్‌కు మసాజ్ చేసినట్టు వచ్చిన వార్తలు నిజమేనని ఆ రోజు తాను కూడా ఉన్నానని తెలిపారు. గజల్ శ్రీనివాస్ భుజం నొప్పితో బాధపడుతున్నప్పుడు తనకు ఫిజియోథెరపీ వచ్చని అరుణే వచ్చి మసాజ్ చేసిందని ఆమె పేర్కొన్నారు.

బాపట్ల మున్సిపాలిటీ భూ కేటాయింపులు నిలిపివేత

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్

భావపురి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రగతి టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, బాపట్ల లయన్స్ క్లబ్‌లకు బాపట్ల మున్సిపాల్టీ భూ కేటాయింపులను హైకోర్టు నిలిపి వేసింది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి శ్యాంప్రసాద్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 19వ వార్డులోని సర్వే నెంబర్ 576లో ఉన్న సర్కార్ భూమిని ఆ సంఘాలకు ఇచ్చేస్తూ మున్సిపాలిటీ తీర్మానం చేయడాన్ని తప్పుపడుతూ వైసిపి ఎమ్మెల్యే కోన రఘుపతి హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై లోతుగా విచారణ చేపడతామని ప్రకటించిన బెంచ్ విచారణను వాయిదా వేసింది.

పోలీసులపై హైకోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించింది. ఈసారి కోడి పందేలు నిర్వహిస్తే అందుకు ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలనే బాధ్యులను చేస్తామని హైకోర్టు తేల్చి చెప్పింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం శ్రీరాంపురం , వెంప గ్రామాల్లో కోడిపందేల పేరుతో జూదం, అశ్లీల నత్యాలు, వ్యభిచారం నిర్వహిస్తున్నారంటూ కలిదిండి రామచంద్రరాజు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి జి.శ్యాంప్రసాద్‌లతో కూడిన డివినజ్ బెంచ్ మంగళవారం మరోసారి విచారణ జరిపింది. కోర్టు ఉత్తర్వులంటే లెక్క లేకుండాపోతోందని, గత ఏడాది డిసెంబర్‌లో ఇచ్చిన హైకోర్టు ఉత్తర్వుల్ని అమలు చేసుంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని, నాయకులు మాత్రం కోర్టులంటే గౌరవం లేకుండా కోడి పందేలను నిర్వహించి తీరుతామని చెప్పడం తీవ్ర విషయంగా పరిగణించాల్సి వస్తుందని బెంచ్ హెచ్చరించింది. ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కోడి పందేలు నిర్వహించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాల్లో కోడి పందేలకు ఎన్ని బరులు సిద్ధం చేశారో చెప్పమంటే ప్రభుత్వ లాయర్ అంటీ ముట్టనట్టుగా కౌంటర్ దాఖలు చేయడంపై బెంచ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. రాత్రికి రాత్రే బరులు ఏర్పటు కాబోవని, అన్నీ ముందు నుంచే ఏర్పాట్లు ఉంటాయని, వాటి వివరాలు సమర్పించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీలను బెంచ్ ఆదేశిస్తూ విచారణను 4వ తేదీకి వాయిదా వేసింది. కోడి పందేలకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదని హైకోర్టు స్పష్టం చేసింది.

భారీగా బరులు

(మొదటిపేజీ తరువాయి)

పర్యవేక్షిస్తున్నారు. గత నాలుగేళ్లుగా గోదావరి జిల్లాలకు పోటీగా కృష్ణా, గుంటూరు జిల్లాల తమ్ముళ్లు పందేలు జోరుగా సాగిస్తున్నారు. ఈ ఏడాది అమరావతి రాజధాని చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ ఇందుకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజధాని ప్రాంతంలో ఉండే ఒక ఎమ్మెల్యే ఇప్పటికే 25 ఎకరాల సువిశాల స్థలంలో ముమ్మర ఏర్పాట్లు చేస్తుండటం విశేషం. గతంలో అనేక ఆరోపణలు వచ్చిన ఆ ఎమ్మెల్యే సిఎం క్యాంప్ కార్యాలయానికి కూతవేటు దూరంలో నిర్వహించిన కోడి పందేలకు గతేడాది మంత్రులూ, ఎమ్మెల్యేలు, ఎంపిలు కూడా హాజరు కావడం గమనార్హం. ఈ ఏడాది పగలూ, రాత్రి తేడా లేకుండా 24 గంటలూ కోడి పందేలతో పాటు అన్ని రకాల జూదాల నిర్వహణకు ఫ్లడ్‌లైట్లతో నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

నాలుగు జిల్లాలు.. రూ. 600 కోట్లు..

గతేడాది ఉభయ గోదావరి సహా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల్లో రూ.600 కోట్లు విలువైన జూదం సాగినట్లు అంచనా. తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగునున్న కర్ణాటక, తమిళనాడు, ఒడిశా నుంచీ ఈ పందేల కోసం కొందరు ప్రత్యేకంగా గోదావరి జిల్లాలకు వస్తుండటం ఆనవాయితీ. ఈ పందేలతో పాటు కోతముక్క, మద్యం అమ్మకాలు, గుండాట, రింగాట, నలుపు, తెలుపు ఒక్కటేమిటి జేబులు ఖాళీ కావడానికి ఉన్న అవకాశాలన్నిటినీ బరిలో ఆయా నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల ముందు సంవత్సరం కావడంతో 2018లో సంక్రాంతి పందేల నిర్వహణను కొందరు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సిఎం చంద్రబాబు సహా పోలీస్ ఉన్నతాధికారులు సంక్రాంతి అంటే జూదం కాదని చెబుతున్నా, కొందరు ఎమ్మెల్యేలు బహిరంగంగానే పందేల నిర్వహకులకు మద్దతు ఇస్తున్నారు.

కమీషనే కోట్ల రూపాయాలు

పందేల నిర్వాహకులకు పది శాతం కమీషన్ రూపంలో ముడుతోంది. దాన్నుంచి ఆయా స్థానిక పోలీసులకు, మరి కొందరు ప్రజా ప్రతి నిధులకు మామూళ్లు ఇస్తారన్న ఆరోపణలూ ఉన్నాయి. మూడు రోజుల్లో కమీషన్ రూపంలోని మొత్తమే చాలా ఎక్కువగా ఉండటంతో ఎక్కువ మంది నిర్వహకులకు కొమ్ము కాస్తున్నారు. కోడి పందేలు నిర్వహిస్తుంటే చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు ఏం చేస్తున్నారని ఎపి పోలీసులతో పాటు ప్రభుత్వానికీ తాజాగా హైకోర్టు కోర్టు మొట్టికాయలు వేసింది. కోర్టు వద్దంటున్నా పందేలు నిర్వహిస్తామని నేతలు ప్రకటించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని, ప్రభుత్వం పందేలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యం లోనూ ఏర్పాట్లు చకచక సాగిపోతున్నాయి.

పంచాయతీలకు రేటింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఐదో విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. వడ్డీలేని రుణాలను మాఫీ చేసేందుకు రూ.680 కోట్లు కేటాయించామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.24 వేల కోట్ల రుణమాఫీ చేశామని, విడతల వారీగా రైతులకు అందజేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో 1.42 కోట్ల రేషన్ కార్డులుండగా వీటి ద్వారా 4.05 కోట్ల మందికి బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. కేంద్రం చక్కెర నిలిపేస్తే జనవరి నుంచీ అందరికీ అరకిలో చక్కెర ఇస్తున్నామన్నారు. జన్మభూమిలో 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు ఇస్తున్నామన్నారు. ఇందులో రాజకీయాల్లేవని, పేదవాడికి కార్డులు, పింఛన్లు, ఇళ్లు ఇలా ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నాని చెప్పుకొచ్చారు. 2022 నాటికి దేశంలో మూడు అగ్రరాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌ను ఒకటిగా, 2029 నాటికి నెం.1 చేస్తామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జీవనదులను అనుసంధానం చేస్తామన్నారు. వెలుగొండ ప్రాజెక్టును 2018 చివరి నాటికి పూర్తి చేస్తామన్నారు. దొనకొండ పారిశ్రామికవాడకు సంబంధించి భూ సమస్యలున్నందున వాటిని తొలగించాకే ముందుకు పోతామన్నారు. తాను గతంలో దీపం పథకం కింద గ్యాస్ ఇస్తే కాంగ్రెసోళ్లు వాటిని ఆర్పేశారని ఎద్దేవా చేశారు. ఎన్టీఆర్ భరోసా కింద 46.19 లక్షల మందికి నెలనెలా జీతాలు మాదిరిగా పింఛను సొమ్ము అందజేస్తున్నామన్నారు. మరో నాలుగైదు లక్షల మందికి పింఛన్లు ఇస్తామన్నారు. అపుడు దేశంలో మన రాష్ట్రమే 50 లక్షల మందికి పింఛన్లు ఇస్తూ మొదటి స్థానంలో నిలుస్తుందని చెప్పారు. 15 లక్షల మందికి ఒక్కొకరికి రూ.1200 చొప్పున పిల్లల చదువులకు సాయం చేస్తున్నామన్నారు. పెళ్లి కానుకల కింద ఎస్‌టిలకు రూ.50 వేలు, బిసిలకు రూ.35 వేలు, ఎస్‌సిలకు రూ.40 వేలు ఇస్తున్నామని చెప్పారు. ఆడబిడ్డల ఆత్మగౌరవం కోసం ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి తప్పనిసరి చేశామన్నారు. ప్రకాశం జిల్లాలో నూరుశాతం ఇళ్లకు మరుగుదొడ్లు ఉండటం అభినందనీయమన్నారు. ఇళ్ల విసయానికి వస్తే గ్రామీణ ప్రాంతాలకు 13.06 లక్షల ఇళ్లు, పట్టణాల్లోనూ 6 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, సంక్రాంతికి వీటిని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎన్నికలకు ముందే వీటిని పూర్తి చేస్తామన్నారు. కోడి పందేలు బెట్టింగులతో పెడదారి పట్టవద్దన్నారు. సభలో మంత్రులు శిద్ధా రాఘవరావు. పి.నారాయణ, ఎమ్మెల్సీలు కరణం బలరాం, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్, జిల్లా పరిషత్ చైర్మన్ ఈదర హరిబాబు, కలెక్టర్ వినయచంద్ ఉన్నారు.


సాయి పల్లవి

పల్లవి కోసం ముందే షూటింగ్

సినిమాలో మన ఇంట్లోనో, పక్క ఇంట్లోనో ఉండే అమ్మాయిలా ఓ కథానాయిక చేస్తే ప్రేక్షకులు నీరాజనాలు పలుకుతారు. అలాంటివారికి కాల్‌షీట్ల సమస్యా తలెత్తుతుంది. ఎందుకంటే సినిమా ఆఫర్లు భారీ స్థాయిలో పెరుగుతాయి కాబట్టి. ఆ తరహాలో ప్రస్తుతం నటిస్తుందన్నది ఎవరంటే సాయి పల్లవి. తెలుగు చిత్రసీమలో ఆమె చేసిన రెండు చిత్రాలూ విజయం సాధించడంతో విపరీతమైన క్రేజ్ పెరిగిపోయింది. టాలీవుడ్‌లో 'ఫిదా' తో మొదలైంది ఆమె కెరీర్. ఇప్పుడు రెండో చిత్రం 'ఎంసీఏ' కూడా సూపర్‌హిట్ అయింది. త్వరలో శర్వానంద్, తమిళ్ హీరో సూర్యతో చేయనుంది. సోమవారమే సూర్య చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి సాయి పల్లవి ఆ చిత్రం షూటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. శర్వానంద్‌తో హను రాఘవపూడి దర్శకత్వంలో చేయబోయే సినిమాలో పల్లవి కథానాయిక. ఫిబ్రవరి చివరిలో షూటింగ్ అనుకున్నారు. దీనికి ముందు శర్వా సుధీర్ వర్మ దర్శకత్వంలో చేయనున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్‌ను డిసెంబర్ చివరిలో ప్రారంభించాడు. కానీ ఫిబ్రవరిలో సాయి పల్లవి తన చిత్రం షూటింగ్‌కు రావడం సాధ్యం కాదని తెలుసుకుని వెంటనే సుధీర్ వర్మతో చేసే చిత్రీకరణను ఆపు చేసి హను రాఘవపూడి సినిమా చిత్రీకరణను ఈ నెలలో ప్రారంభించబోతున్నారట. దానికి పల్లవి కూడా గ్రీన్ స్నిగల్ ఇచ్చిందట. అంటే పల్లవికి తెలుగులో ఎంత క్రేజ్ ఉందో అర్థమవుతుంది.

కథ నచ్చితే కొత్తవారితోనైనా చేస్తా


బెల్లంకొండ శ్రీనివాస్

బెల్లకొండ శ్రీను... 'అల్లుడు శ్రీను'తో తెలుగు తెరకు హీరోగా పరిచయమైన హీరో. చిత్రసీమకు చెందిన కుటుంబం నుంచి వచ్చినా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు కోసం శ్రమిస్తున్న నటుడు. 'జయ జానకి నాయక' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నాడు. త్వరలో 'సాక్ష్యం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. శ్రీనివాస్ పుట్టిన రోజు బుధవారం. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న కొత్త చిత్రం గురించి మీడియాతో పంచుకున్నాడు.

'సాక్ష్యం' కథేమిటి?

కథా పరంగా నేను ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో 'సాక్ష్యం' బెస్ట్ సినిమా అవుతుంది. సినిమాలో 5 యాక్షన్ ఎపిసోడ్స్ ఉంటాయి. పీటర్ హెయిన్స్ మాస్టర్ ఛాలెంజింగ్‌గా తీసుకొని వాటిని కంపోజ్ చేశారు.

మీ పాత్ర ఎలా ఉంటుంది?

దర్శకుడు శ్రీవాస్ నా పాత్రను చాలా బాగా డిజైన్ చేశారు. నేను వీడియో గేమ్ డిజైనర్‌గా ఈ సినిమాలో కనిపించబోతున్నాను.

చిత్రం ఎంతవరకు వచ్చింది?

మూడు పాటలు, క్లైమాక్స్ మినహా సినిమా మొత్తం పూర్తయ్యింది. త్వరలోనే న్యూయార్క్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభంకానుంది.

ఎవరికి ఎవరు సాక్ష్యం?

మా సినిమా ప్రకృతి చుట్టూ తిరుగుతుంది. అందుకే ఆ టైటిల్ అయితే బాగుంటుందని పెట్టాం.

దర్శకుడు శ్రీవాస్ దర్శకత్వం ఎలా ఉంది?

కష్టపడే తత్త్వం ఉన్న దర్శకుల్లో శ్రీవాస్ ఒకరు. ఈ సినిమాతో ఆయన మరో ఎత్తుకు ఎదుగుతాడు. ఈ సినిమాకు మంచి స్క్రీన్ ప్లే అందించారాయన.

ఆదిలోనే వినాయక్, బోయపాటి శ్రీను దర్శకులతో పనిచేశారు?

నాన్న మంచితనం వల్ల నాకు పెద్ద దర్శకులతో పనిచేసే అవకాశం ఇచ్చింది. వారి దగ్గర చాలా నేర్చుకున్నాను. కెరీర్ మొదట్లోనే వారితో వర్క్ చెయ్యడం అదృష్టంగా భావిస్తున్నాను.

సినిమాపరంగా ఎటువంటి ప్రత్యేకతలు తీసుకున్నారు?

యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. సన్నివేశపరంగా బిఎం.ఎక్స్ సైక్లింగ్ చేయాలి. వెరీ టఫ్ సైక్లింగ్.. దుబాయ్‌లో శిక్షణ తీసుకుని చేశాను.

మీ సినిమాలకు విమర్శకులు ఎవరు?

నా స్నేహితులు, కుటుంబ సభ్యులే నా విమర్శకులు. నేను ఎక్కువ బయట తిరగను కాబట్టి వారి సలహాలు సూచనలే పాటిస్తాను. ఇంకా ఏమైనా మార్పులు చేయాలనుకుంటే దానివైపు దృష్టి పెడతాను.

సినిమా ఎప్పుడు విడుదల కానుంది ?

ఈ ఏడాది వేసవిలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. మే నెలలో రిలీజ్ అవ్వొచ్చు.

ఎలాంటి నటుడిగా ఉండాలని అనుకుంటున్నారు?

నేను చేసే ప్రతి సినిమాలోనూ నా ముద్ర కూడా ఉండాలని నేను ఎంతగానో కష్టపడతాను. ఆ విషయాన్ని మన దర్శకులతో పాటు, ప్రేక్షకులు కూడా గుర్తిస్తున్నారు. అందుకే ప్రముఖ దర్శకులు నాతో సినిమాలు ప్లాన్ చేస్తున్నారు. 'స్పీడున్నోడు' క్లైమాక్స్‌లో నా నటన చూసి 'జయ జానకి నాయక' కథ రాసుకున్నానని బోయపాటి చెప్పినప్పుడు.. ఆ సినిమా మిగిల్చిన డిజప్పాయింట్‌మెంట్ మటుమాయమైపోయింది. 'సాక్ష్యం' విషయానికొస్తే.. మన తెలుగు సినిమా రంగంలో ఇదొక ట్రెండ్ సెట్టర్ అవుతుందని కచ్చితంగా చెప్పగలను.

పేరున్న దర్శకులతోనే చేస్తారా?

ప్రతి సినిమా పేరున్న దర్శకులతోనే చేయాలనీ నియమంగా ఏమీ పెట్టుకోలేదు. కథ నచ్చితే కొత్తవాళ్లతో చేయడానికి కూడా నేను సిద్ధంగానే ఉన్నాను.


రాజ్ తరుణ్, చిత్ర శుక్ల

రంగుల రాట్నం

రాజ్ తరుణ్ హీరోగా 'రంగుల రాట్నం' రూపొందుతోంది. 'ఉయ్యాల జంపాల' తర్వాత అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. చిత్రా శుక్లా జంటగా నటించింది. శ్రీరంజని దర్శకత్వం వహిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ఫైనల్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఈ చిత్రానికి సంగీతం : శ్రీచరణ్ పాకాల, సినిమాటోగ్రఫీ: ఎల్.కె.విజయ్, ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఆర్ట్: పురుషోత్తం ఎం.

వైఎస్ఆర్ బయోపిక్!



నటుడు రాజశేఖర్ టైటిల్ పాత్రలో 'వైఎస్సార్' బయోపిక్ రాబోతుందని గతంలో ప్రచారం జరిగింది. కానీ కారణమేదైనా ఆ చిత్రం షూటింగ్ మొదలు కాలేదు. ఇప్పుడు మళ్లీ వైఎస్సార్ బయోపిక్ రాబోతుందని ప్రచారం జరుగుతుంది. టైటిల్ రోల్‌లో మలయాళ నటుడు మమ్ముట్టి నటిస్తారని అనుకుంటున్నారు. 'ఆనందో బ్రహ్మ' దర్శకుడు మహి రాఘవ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారట. 2019 ఎన్నికలకు ముందే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఈ చిత్ర నిర్మాణానికి కొంత ఆర్థిక సాయం చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కానీ మమ్ముట్టి ఈ పాత్ర చేయడానికి అంగీకరిస్తారో? లేదో? చూడాలి. ఇప్పటికే మోహన్‌లాల్ 'జనతా గ్యారేజ్' 'మనమంతా' చిత్రాల ద్వారా తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నాడు. ఇప్పుడు మమ్ముట్టి వంతు రాబోతుందన్న మాట.


మమ్ముట్టి

మూడు పువ్వులు ఆరు కాయలు

ప్రేమంటే చంపటమో చావటమో కాదు, చచ్చేదాకా కలిసి బతకటం. కన్నవాళ్ల కలలతో పాటు, ఆశించిన లక్ష్యాన్ని చేరుకోగలిగితే ప్రతి ఒక్కరి జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుంది... అనే కథాంశంతో స్మైల్ పిక్చర్స్ ఓ సినిమాను తెరకెక్కిస్తోంది. దాదాపు 40 చిత్రాలకు పైగా సంభాషణల రచయితగా పనిచేసిన రామస్వామి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి 'మూడు పువ్వులు ఆరు కాయలు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. చిత్రీకరణ పూర్తయింది. అర్జున్ యజత్, భరత్ బండారు, రామస్వామి హీరోలుగా నటించారు. సౌమ్య వేణుగోపాల్, పావని, సీమా చౌదరి నాయికలు. డాక్టర్ మల్లె శ్రీనివాసరావు సమర్పిస్తున్నారు. వబ్బిన వెంకటరావు నిర్మాత.

నిర్మాత మాట్లాడుతూ 'నవ్వినా ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి. ఈ చిత్రంలో కడుపుబ్బా నవ్వించే హాస్యరసంతో పాటు, కంటతడి పెట్టించే కరుణ రసం కూడా ఉంటుంది' అని అన్నారు. 'చాలా చిత్రాలకు మాటల రచయితగా పనిచేశాను. దర్శకుడిగా ఇదే నా తొలి చిత్రం. మంచి కాన్సెప్ట్‌తో సకుటుంబాన్ని అలరించేలా తెరకెక్కించానని' దర్శకుడు తెలిపారు. ఈ సినిమాకు సాహిత్యం: చంద్రబోస్, భాస్కరభట్ల, కెమెరా: ఎం.మోహన్ చంద్, ఆర్ట్: కె.వి.రమణ, సంగీతం: కృష్ణసాయి, నిర్మాత: వబ్బిన వెంకట రావు, కథ-స్క్రీన్‌ప్లే-మాటలు-దర్శకత్వం: రామస్వామి.


అర్జున్ యజత్, సౌమ్య వేణుగోపాల్

అభిమానులకు కృతజ్ఞతలు


నయన తార

నయన తార జీవితంలో అనేక ఎత్తుపల్లాలు ఉన్నాయి. తీసుకున్న నిర్ణయాల వలనో, పరిస్థితుల కారణమో కానీ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంది. కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే మహిళా ప్రాధాన్య చిత్రాల్లో మెప్పిస్తుంది. ఈ ఏడాది ఆమె చేసిన 'ఆరమ్' బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించింది. ఇటువంటి సందేశాత్మక చిత్రాలు చేస్తే నష్టపోతామని సినిమా తీసేందుకు ముందుకు రాని నిర్మాతలు ఎంతోమంది. కానీ ఆ పరిస్థితులను అధిగమించి నయన చరిష్మాతోనే చేశారు. తన అంచనాలకు తగ్గట్టే మంచి విజయం సాధించింది. ఈ ఏడాది ఈమెకొచ్చిన గొప్ప హిట్‌చిత్రమిది. ఈ సందర్భంగా నయన తన అభిమానుకు లేఖ రాసింది. "నా జీవితానికి అర్థాన్నిచ్చిన అభిమానులకు కృతజ్ఞతలు. మీ ప్రేమానురాగాలతో నా జీవితాన్ని అందంగా తీర్చిదిద్దారు. కష్టించి పనిచేయడం ఒక్కటే చేసి మిగిలినవన్నీ దేవుడికే వదిలయాలన్నది నేర్చుకున్నా. నేను ఎంటర్‌టైనింగ్‌గా ఉన్న చిత్రాలనే కాదు..అరమ్ వంటి సందేశాత్మక చిత్రాల్లోనూ చేశాను. 2018లో మరింత బాధ్యతాయుత చిత్రాలు చేస్తా" అని పేర్కొంది.


అర్చన

'మర్ల పులి' భయపిస్తుందా?

వరుణ్ సందేశ్ ప్రత్యేక పాత్రలో అర్చన వేద, పోసాని కృష్ణ మురళి ముఖ్య పాత్రలో నటిస్తున్న చిత్రం 'మర్ల పులి'. భవాని శంకర్, బి.సుధాకర్ రెడ్డి, ఐ.ఎస్.దినకర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. డి.రామకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే 'సైరా' సినిమా కార్యాలయంలో చిత్ర దర్శకులు సురేందర్ రెడ్డి థియేట్రికల్ ట్రైలర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. మన తెలుగు ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకముంద'ని అన్నారు.

ఎగ్జిక్యూటివ్ నిర్మాత వాకాడ అప్పారావు మాట్లాడుతూ 'రామకృష్ణ సూపర్ గుడ్ ఫిలిమ్స్ సంస్థలో సహాయ దర్శకుడిగా చాలా సినిమాలకి పనిచేశాడు. ఈ ట్రైలర్‌లో కొత్తదనం కన్పిస్తోంది. అన్ని వర్గాలకి ఈ చిత్రం నచ్చుతుంద'ని అన్నారు. చిత్ర దర్శకుడు డి.రామకృష్ణ మాట్లాడుతూ 'సురేందర్ రెడ్డి మాలాంటి దర్శకులకు ఆదర్శం. వినూత్నమైన కథ, కథనం ఇందులో వున్నాయి. అర్చన వేద క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. మంచి నటనకు స్కోప్ ఉన్న పాత్రని పోషించారు. ఇక వరుణ్ సందేశ్ క్యారెక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పోసాని మురళి పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. త్వరలో చిత్రాన్ని విడుదల చేయనున్నామ'ని చెప్పారు.

నా ఫస్ట్ లవ్ తెలుగు చిత్రసీమే


రకుల్

తెలుగు చిత్రసీమలో చేస్తున్న కథానాయికల్లో 99శాతం మంది తెలుగేతర్లే. నటనొక్కటే వాళ్ల పని మిగిలినవన్నీ అరువే. తెలుగులో మాట్లాడాలని అనుకున్నా అనర్గళంగా సాధ్యం కాదు. రకుల్ ప్రీత్ సింగ్‌కు తెలుగు చిత్రసీమే కెరీర్‌ను ఇచ్చింది. కాబట్టి ఈ ఏడాది తెలుగులో అనర్గళంగా మాట్లాడడం, తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకోవడమే తన లక్ష్యమని చెప్పుకొచ్చిందీ భామ. బాలీవుడ్‌లో నీరజ్ పాండే దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'అయ్యారీ'లో రకుల్ కథానాయికగా చేస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్ర, మనోజ్ బాజ్‌పాయి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 26వ తేదీన విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆమె ముంబాయిలో మీడియాతో మాట్లాడింది. 'నా మొదటి లవ్ తెలుగు సినిమా. తెలుగుకే నా మొదటి ప్రాధాన్యం. మీరు గమనించారో లేదో? కానీ నా మాతృభాష పంజాబీ అయినా దాని కంటే అనర్గళంగా తెలుగు మాట్లాడుతా. ఈ ఏడాది తెలుగులో నా పాత్రలకు నేనే డబ్బింగ్ చెప్పుకుంటా. అదే నా లక్ష్యం. నేనింకా నేర్చుకునే దశలో ఉన్నా కాబట్టి 'స్పైడర్'లో డబ్బింగ్ చెప్పలేకపోయా. కానీ మురగదాస్‌తో పని చేయడం ఎంతో ఆనందాన్నిచ్చింది" అని చెప్పింది.



టెలిగ్రాంలో ఇక మూడు అకౌంట్లు

ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా నిలిచిన యాప్ టెలిగ్రాం. వాట్సాప్‌కు దీటుగా కొత్తకొత్త ఫీచర్లను అందుబాటులోకి తెస్తోంది. ఈ క్రమంలో 'టెలిగ్రాం' తన వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమైన ఫీచర్ అందుబాటులోకి తెచ్చింది. ఇక నుంచి ఒక ఆండ్రాయిడ్ ఫోన్‌లో మూడు టెలిగ్రాం అకౌంట్లను వాడుకోవచ్చు. ఒకటి కన్నా ఎక్కువ టెలిగ్రాం అకౌంట్లు ఉన్నవారికి ఈ ఫీచర్ బాగా ఉపయోగపడుతుంది. అయితే ఇది ఆండ్రాయిడ్ ఫోన్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఐఓఎస్ ప్లాట్‌ఫాంపై లభిస్తున్న టెలిగ్రాం ఆప్‌లో కూడా రెండు కొత్త థీమ్‌లను జత చేశారు. ఇక రెండు ప్లాట్‌ఫాంలపై కూడా టెలిగ్రాం యూజర్లు తమకు వచ్చే మెసేజ్‌లకు క్విక్ రిప్లై ఇవ్వవచ్చు. టెక్స్ట్, ఎమోజీ, స్టిక్కర్, జిఫ్ ఇమేజ్‌లను పంపుకోవచ్చు. తాజా వెర్షన్ 4.7ను ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు తమ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

మీ చిట్కాలు :

కంప్యూటర్, మొబైల్, యాప్, ఇంటర్నెట్ టెక్నాలజీ వినియోగంలో మీకు మాత్రమే తెలిసిన చిట్కాలను మాకు పంపండి. 'సైటెక్' పేజీలో ప్రచురిద్దాం... మన విజ్ఞానాన్ని అందరితో పంచుకుందాం.

పంపించాల్సిన చిరునామా :
సైటెక్ పేజీ, ప్రజాశక్తి
డోర్ నెం: 27-30-4
ఆకులవారి వీధి, గవర్నర్ పేట
విజయవాడ, కృష్ణాజిల్లా, ఎపి
ఇమెయిల్ : scitechpage@gmail.com

గూగుల్‌కు దీటైన ఫొటోలు

నేడు వివిధ మాధ్యమాల్లో ఫొటోలు, గ్రాఫిక్స్‌కు అత్యధిక ప్రాధాన్యత చోటుచేసుకుంది. 'ఒక్క చిత్రం వెయ్యి మాటలకు సమానం' అన్నట్టుగా వార్తా పత్రికల దగ్గర నుంచి ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా వంటి మాధ్యమాల్లో ఈ ఇమేజెస్ ప్రాధాన్యత బాగా పెరిగింది. ఈ క్రమంలో ఫొటోల కోసం గూగుల్ సెర్చ్‌పై ఆధారపడక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే గూగుల్‌కు దీటుగా మంచి క్వాలిటీ ఇమేజ్‌లను అందించే అనేక సైట్లు ఇప్పుడు అందుబాటులో వున్నాయి. వాటిలో ముఖ్యమైన కొన్నిటి గురించి తెలుసుకుందాం...

టినీ ఐ (Tineye) : ఇదొక రివర్స్ ఇమేజ్ సెర్చ్ ఇంజన్. గూగుల్ కీ వర్డ్‌తో ఇమేజ్ సెర్చ్ చేసినట్లే దీనితో ఇమేజ్‌ను బట్టి దాని వివరాలు తెలుసుకునే రివర్స్ సెర్చ్ పని చేస్తుంది. సోషల్ మీడియాలో లేదా గూగుల్ ఇమేజెస్‌లో మీరు ఏదైనా ఇమేజ్‌ను చూసి అది ఎక్కడైనా వాడాలనుకుంటే దాని వివరాలు తెలుసుకోవడానికి ఈ 'టినీ ఐ' బాగా ఉపయోగపడుతుంది. ఇమేజ్‌ను లేదా దాని యూఆర్‌ఎల్‌ను ఈ సెర్చ్ ఇంజిన్‌లో అప్‌లోడ్ చేస్తే ఆ ఇమేజ్‌కు సంబంధించిన వివరాలు తెలుస్తాయి. https://www.tineye.com/

అన్‌స్ప్లాష్ (Unsplash) : క్రియేటివ్ కామన్స్ లైసెన్స్ కింద ఉన్న ఇమేజ్‌లు మాత్రమే దీనిలో దొరుకుతాయి. వీటిని ఉచితంగా వాడుకోవచ్చు. ఎంతో మంది ఫొటోగ్రాఫర్లు ఈ సైట్‌కు గిఫ్ట్‌గా ఇచ్చిన హైక్వాలిటీ ఇమేజ్‌లు దీనిలో వేలకొద్దీ ఉంటాయి. వీటిని కూడా కేటగిరీ వారీగా సెర్చ్ చేసుకోవచ్చు. https://unsplash.com/

పిక్సాబే (Pixabay) : పిక్సాబేలో 12 లక్షలకుపైగా హైక్వాలిటీ ఇమేజ్‌లున్నాయి. మీరు సెర్చ్ చేసిన ఇమేజ్ దొరికితే దాన్ని డిఫరెంట్ సైజ్‌ల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హై రిజల్యూషన్‌తో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అయితే రిజిస్టర్ చేసుకోవాల్సి వుంటుంది. క్లాస్‌రూమ్‌లో, ఆఫీస్‌లో మీరు సెర్చ్ చేయాలనుకుంటే సేఫ్ సెర్చ్ మోడ్ అనేబుల్ చేసుకోవచ్చు. https://pixabay.com/

పిక్ విజార్డ్ (PikWizard) : ఇది మరో మంచి సెర్చ్ ఇంజిన్. హైక్వాలిటీ



ఇమేజ్‌లను కేటగిరీ, కీవర్డ్స్, ఫేవరెట్స్, ట్రెండింగ్ ఇలా రకరకాలుగా బ్రౌజ్ చేసుకుని వాడుకోవచ్చు. మీరు బ్లాగర్ లేదా రైటర్ అయితే ఇందులో ఉండే editorial ఆప్షన్‌ను ఉపయోగించుకొని మరింత లోతుగా సెర్చ్ చేసుకోవచ్చు. ఫొటో తీసిన ఫొటోగ్రాఫర్స్‌కి క్రెడిట్స్ ఇస్తుంది ఈ సైట్. అందుకే ఇమేజ్ తీసుకునేముందు రూల్స్ చూడండి. https://pikwizard.com/

ఫొటోస్ ఫర్ క్లాస్ (Photos for Class) : టీచర్లు తమ విద్యార్థులకు పాఠాలు బోధించడానికి అవసరమైన అనేక ఇమేజ్‌లు ఇందులో దొరుకుతాయి. దీనిలో ఇమేజ్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే ఆథర్ క్రెడిట్స్, సైటేషన్స్ ఆటోమేటిగ్గా డౌన్‌లోడ్ అవుతాయి. http://www.photosforclass.com/

డ్రైవర్ లేయర్ (Driver Layer) : గూగుల్, ఫ్లికర్ తర్వాత అతి పెద్ద డేటా ఇమేజ్ బ్యాంక్ ఉన్న సైట్ ఇదే. ఇందులో దాదాపు 1000 కోట్ల ఇమేజ్‌లు ఉంటాయి. గూగుల్ లాగే సైజ్, డేట్, టైం, కీవర్డ్స్‌తో సెర్చ్ చేసుకోవచ్చు.

ఫ్లికర్ (Flickr) : రెండు మిలియన్ గ్రూపులకు సంబంధించిన బిలియన్స్ కొద్దీ ఫొటోలు ఈ ఫ్లికర్ సైట్‌లో లభ్యమౌతాయి. లైసెన్స్‌డ్, నాన్ లైసెన్స్‌డ్ ఇమేజ్‌లు కూడా ఉంటాయి. వీటిని కీవర్డ్స్, లైసెన్స్‌ల ఆధారంగా సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు. కలర్‌ను బట్టి సెర్చ్ చేయగలిగే సూపర్ ఫీచర్ ఫ్లికర్ ప్రత్యేకతగా చెప్పొచ్చు. https://www.flickr.com/




ఎగిరే విమానం ఎందుకు పడిపోదు?

ప్రశ్న: గాల్లో ఎగిరే విమానం పడిపోకుండా ఎలా వుంటుంది?
– షేక్ ఖాసిమ్, జైన్ పాఠశాల


జవాబు : పక్షిలాగా గాల్లో విహరించాలని మానవుడు కొన్ని సహస్రాబ్దిల తరబడి ప్రయత్నించాడు. పక్షులు ఎగరగా లేనిది మనిషి ఎందుకు ఎగరలేడన్నది వారి ప్రశ్న. ఏదైనా ఒక వస్తువును పైకి పంపాలంటే అది గురుత్వాకర్షణను అధిగమించాలి. అందుకోసం శక్తికావాలి. మానవ శ్రమశక్తి, పెంపుడు జంతువుల జీవశక్తి తప్ప మొదట్లో మరే యితర సహజ శక్తుల వినిమయం గురించి మనిషికి తెలియలేదు. పక్షులు ఎగిరే క్రమంలో రెక్కలు కదలడాన్ని గమనించిన మనిషి... రెక్కలు లేకపోవడం వల్లే మనిషి కదలడంలేదని తీర్మానించుకున్నాడు. పెద్దపెద్ద చాటల్లాగా రెక్కల్ని చేతులకు కట్టుకొని ప్రయత్నించినా పైకి ఎగర్లేకపోయారు. ఇక గాల్లోకి ఎగరడానికి కలల్లో, ఊహల్లో, భావాల్లో, కథానికల్లో తప్ప వాస్తవంగా కుదరలేదు. ఆ క్రమంలోనే పుష్పక విమానం తదితర ఆలోచనలు వచ్చాయి. కానీ గ్రంథాల్లో పుష్పక విమానాలకు రకరకాల చిత్రీకరణలు వున్నాయి. గాలి గుమ్మటంలాగా ఒక బొమ్మ, రెక్కలున్నట్లుగా మరో బొమ్మ, రాకెట్టులాగా ఇంకో బొమ్మ వున్నాయి. ఇవేవీ నిజంగా ఎగరాలంటే తప్పకుండా గాలి వుండాలి. లేదా వేగంగా నాజిల్ గుండా వాయువులు లేదా ప్రవాహకాలు (fluids) బయటపడే యంత్రాంగం ఉండాలి. ఇవేవీ వాస్తవంగా తెలీని రోజుల్లోనే గ్రహాంతర ఆకాశయానం వీలయ్యిందని మత ఛాందసులు, కుహనా శాస్త్రవేత్తలు శాస్త్రం పేరుతో ప్రచారం చేయడానికి ప్రయత్నించి విఫలం అవుతున్నారు. రెక్కలతో గిర్రున తిరుగుతూ అటుయిటూ కదిలే విత్తనాలను చూసి లియొనార్డో డావిన్సీ హెలికాప్టర్ బొమ్మను పోలిన చిత్రాన్ని గీశాడు. కానీ డావిన్సీ మత ఛాందసుడు కాదు కాబట్టి 'తన బొమ్మ కేవలం ఊహ మాత్రమేనని' అంగీకరించాడు. ఇలా రెక్కల్ని తిప్పగలిగితే గాల్లో ఎగిరే విత్తనంలాగా యంత్రం కూడా పైకి ఎగురుతుందని డావిన్సి పేర్కొన్నాడు. కానీ డావిన్సీ మరణించాక కొన్ని వందల సంవత్సరాల తర్వాతే హెలికాప్టరుకు వాస్తవ రూప కల్పన సిద్ధించింది. రెక్కలున్న పక్షుల్లాగే ఆకులు, ఈగలు, తుమ్మెదలు, బొద్దింకలు, కోళ్లు, ఎగిరే ఉడతలు, ఎగరడాన్ని గమనించిన శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత ఉన్న మనుషులు, శ్రామికులు రెక్కలున్న యంత్రాలతోనే పైకి ఎగరగలమని తీర్మానించుకొన్నారు. తొలిసారిగా రైట్ సోదరులు (Wright Brothers) 1903 సంవత్సరం డిసెంబర్ 17 నాడు కేవలం కొన్ని అడుగుల దూరం మేరకే కొన్ని అడుగుల ఎత్తులో మాత్రమే, మోటారు సహాయంతో ఎగరగలిగారు. మానవ శాస్త్ర సాంకేతిక శాస్త్రాల చరిత్రలో అది ఒక అద్భుత ఘట్టం. నేటి ఆధునిక విమానాలు ఇదే సూత్రం మీద పనిచేస్తాయి. రెక్కలకున్న రేఖా గణిత నిర్మాణం వల్ల యంత్రం సాయంతో విమానం ముందుకు దూసుకెళ్తున్న సందర్భంలో గాలివేగం రెక్కల పైభాగంలో అధికంగా, రెక్కల క్రింది భాగంలో తక్కువగా ఉండే ఏర్పాటు వుంటుంది. ప్రవాహకాల వేగానికి ప్రవాహకాల ద్రవ పీడనానికి (Hydrodynamic pressure) విలోమ సంబంధం వుంటుందని బెర్నౌలీ (Bernoulli Principle) సిద్ధాంతం చెబుతోంది. తద్వారా విమానాల రెక్క మీద తక్కువ పీడనం, రెక్కల క్రింది భాగంలో అధిక పీడనం సిద్ధిస్తాయి. అంటే రెక్కల మీద నికరంగా పైవైపు బలం వుంటుంది. ఈ ఊర్ధ్వోముఖ చలనం వల్లనే విమానాలు పైకి ఎగురుతాయి. కదలకుండా విమానం ఆకాశంలో ఉండలేదు. కాబట్టే హెలికాప్టర్లు తర్వాత వచ్చేయి.

1903 లో మానవుడు కేవలం కొన్ని అడుగులు దూరానికి, కొన్ని అడుగుల ఎత్తులోనికి వెళ్లగలిగినా అద్భుత మానవ మేధస్సు సాంకేతిక పరిజ్ఞానాలు, పరిశోధనల కారణంగా నేడు (100 లోపే) కొన్ని వేల టన్నుల బరువున్న విమానాన్ని కిలోమీటర్ల ఎత్తులో ఎక్కడా ఆగకుండా వేలాది కిలోమీటర్ల మేర నడప గలుగుతున్నాడు. నేడు విమానం ఏదైనా దానిని ముందువైపునకు నెట్టడానికి ప్రొపెల్లర్లను గానీ, జెట్ ఇంజన్‌ను గానీ వాడతారు. కొన్ని వందల కి.మీ. వేగంతో విమానం వెళ్లే క్రమంలో దానికి అటు యిటూ ఎంతో నిడివి (అటునుంచి యిటు దాదాపు విమానం అంతటి పొడవు)తో దృఢమైన రెక్కలు వుంటాయి. రెక్కల అడ్డుకోత వంపు తిరిగిన గొడ్డలి ఆకారంలో వుంటుంది. ఒకవైపు కుంభాకృతి (Convex) మరోవైపు పుటాకృతి (Concave) వుంటుంది. రెక్కల విస్తారం విమానం దగ్గర ఎక్కువగా, దూరం వెళ్లే కొలది తక్కువగా, పలచగా వుంటుంది. విమానం పైకి ఎగిరేపుడు, కిందికి దిగేటపుడు విమానం రెక్కలు క్షితిజ సమాంతరం (Horizontal) గా కాకుండా కొంచెం వాలుగా వుంటాయి. ఈ వాలులో పుటాకార రూపం భూమి వైపు, కుంభాకార రూపం పై వైపు వుండేలా వాలుగా వుంటాయి. విమానం ముందుకు వెళ్తున్న క్రమంలో రెక్కల మీదుగా గాలి పొరలు ప్రయాణిస్తాయి. పటంలో చూపినట్లు A నుంచి బయలు దేరిన గాలిన పొరలు B వరకు చేరుకుంటేనే A, B ల దగ్గర పీడనం ఒకేవిధంగా వుంటుంది. లేదా A, B ల దగ్గర ఒకే వాయు పీడనం వుండడం అంటే అర్థం ఏమిటంటే A నుంచి B వైపు రెక్కల పైనుంచి వెళ్లే గాలి పొరలు, A నుంచి B వైపు రెక్కల కింది వైపు నుంచి వెళ్లే పొరలు సమాన కాలంలో A నుంచి B వైపు చేరాలి. అయితే A నుంచి B వైపు రెక్కల పై వైపు నుంచి ఎక్కువ దూరం ప్రయాణించాలి. రెక్కల కింద తక్కువ దూరమే వుంది. దూరాన్ని కాలంతో భాగిస్తే వచ్చేదే వేగం కాబట్టి దూరాలు వేరయినా కాలం ఒకటే కాబట్టి పై పొరల వేగం కింది పొరల వేగం కన్నా ఎక్కువ వుంటుంది. అంటే బెర్నౌలీ సూత్రం ప్రకారం కింద ఎక్కువ పీడనం, పై వైపున తక్కువ పీడనంతో గాలి పొరలు వుంటాయి. కానీ A, B ల దగ్గర సమానం అవుతాయి. దీనర్థం ఏమిటంటే రెక్కల మీద నికర బలం భూమ్యాకర్షణకు వ్యతిరేక దిశలో పైవైపునకు పనిచేస్తున్నదన్న మాట. పీడనమంటేనే ప్రమాణ వైశాల్యం మీద ప్రవాహకాల పీడన బలం (Force of impact) కాబట్టి విమానాన్ని రెక్కలు వంగినందు వల్ల కలిగే సింగారం బెర్నౌలీ సూత్రాల ఫలితంగా ఎంతోకొంత మేరకు భూమ్యాకర్షణను అధిగమించేలా చేస్తున్నది. అయితే ఈ బలం ఒక్కటే విమానాన్ని కింద పడకుండా వుంచలేదు. విమానాల రెక్కల వంపు వల్ల మరో యింపైన ఊర్ధ్వోముఖబలం విమానాలను పై వైపు వుంచుతుంది. అదే న్యూటన్ మూడవ సూత్రం.

రెండవ పటం చూడండి. విమానాల రెక్కలు నిట్ట నిలువుగా కాకుండా, క్షితిజ సమాంతరంగాను కాకుండా ఏటవాలుగా వుండడం వల్ల విమానం ముందుకు వెళ్లే క్రమంలో విమానం రెక్క వల్ల విమాన రెక్కల ఉపరితలానికి లంబ దిశలో (పటములో Q P దిశలో) గాలి మీద వత్తిడి పనిచేస్తుంది. అయితే ప్రతి చర్యకు వ్యతిరేకంగా (action) అంతే మోతాదులో ప్రతిచర్య (reaction) వుంటుందన్న న్యూటన్ 3వ సూత్రం ప్రకారం గాలి కూడా విమానాల రెక్కల మీద అదే దిశలో అదే మోతాదులో (P Q దిశలో) ప్రతిబలాన్ని ప్రయోగిస్తుంది. ఈ ప్రతిబలం విమానాన్ని కొంచెం వెనక్కు నెట్టినట్టుగాను (QX) కొంచెం పైకి నెట్టినట్టుగాను (QY) విశదీకరణలో (resolve) వుంటుంది. Q X నిరోధాన్ని విమానపు గమనం అధిగమించుతుంది. QY బలం భూమ్యాకర్షణను అధిగమించేలా మునుపు చెప్పిన బెర్నౌలీ బలానికి తోడవుతుంది. మొత్తం మీద విమానం తన ఒంపు రెక్కలతో ముందుకు వెళ్లడం వల్ల పైపైకి వెళ్లే సామర్థ్యాన్ని అందిపుచ్చుకుంటుంది.



పటం -1



పటం -2



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com



పిల్లల్లారా.. రారండి!!

హాయ్ పిల్లలూ!
మీలో చాలా టాలెంట్ ఉంది కదూ! మీకు పాటలొచ్చు. బొమ్మలొచ్చు, బోల్డన్ని ఆటలొచ్చు. మేజిక్కులొచ్చు. అలాగే కథలూ రాస్తారు కదూ?!. మాకెలా తెలుసంటారా? అసలు పిల్లలంటేనే.. క్రియేటివ్ కిడ్స్‌కదా?! చక్కగా చదువుకుంటూనే ఆటలు, పాటలతో మీరంతా అదరగొట్టేస్తారని మాకు తెలుసు. అందుకే మీరు వేసిన బొమ్మలు, కార్టూన్లు, రాసిన బుల్లిబుల్లి కథలు.. వేసిన నాటకాలు.. ఇంకా మీరు కనిపెట్టిన సైన్స్ సంగతులు.. మీరు చూసొచ్చిన కొత్త ప్రదేశాల విశేషాలూ ... 'చిన్నారి' పేజీలో పంచుకోండి. వాటిని మీ పేరుతో, మీ ఫొటోతో ప్రచురిస్తాం. నిజమా?! అని ఆశ్చర్యపోకండి. నిజమే. అందుకే మీలో దాగి ఉన్న ఏ టాలెంట్ గురించి అయినా మాకు రాసి పంపండి. ఇంకెందుకు ఆలస్యం... పెన్ను, పెన్సిల్, బ్రష్‌తో రెడీ అయిపోండి.!


చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



రంగులు వేయండి

పిల్లలూ..! కింద ఉన్న పులి పిల్లకు రంగులు వేయండి!



పొడుపు కథ

నేనేమో నల్లన
నా కంఠం తీయన
పుట్టేది పరుల పంచన
పలికేది అమ్మ
గొంతున...నేనెవరిని?

జోక్ :

సన్ని : 'అయాం గోయింగ్' అంటే అర్థం చెప్పరా?
బన్ని : నేను వెళుతున్నా ...
సన్ని : ఆగరా... దీనికి సమాధానం చెప్పు ...

తోడేళ్ళతో స్నేహం!



పిల్లలూ..! తోడేళ్లు, ఎలుగుబంటి, ధ్రువపుజింక, నక్కలు వంటి జంతువులను చూస్తే మనం భయంతో వణికిపోతాం కదా! కానీ వాటి చిన్నపిల్లలతో ఆడుకున్నట్లు వాటితో ఆడుకోవచ్చు. సెల్ఫీలు దిగవచ్చు. అంతేకాదు పిల్లలూ..సంతోషంగా అవి మన ఫొటోలకు ఫోజులూ ఇస్తాయి. ఇదంతా నిజమే అంటారా! నిజమే. అదెక్కడో తెలుసుకోవాలంటే నార్వేలోని పోలార్ జూకు వెళ్లాల్సిందే. అక్కడ జంతువులు మనుషులతో స్నేహం చేస్తాయి. ఇది నార్వేలోనే ప్రసిద్ధ పార్కుగా పేరుపొందింది. ఈ పార్కును 1994, జూన్18న ప్రారంభించారు. ఈ పార్కు 112 ఎకరాల్లో ఉంటుంది. ఇక్కడ 'తోడేళ్ల క్యాంప్' ప్రత్యేక ఆకర్షణ. పిల్లలూ మీకు తెలుసా? ఈ క్యాంప్‌లో తోడేళ్లను మచ్చిక చేసుకోవడానికి సందర్శకులు తోడేళ్ల ఎన్‌క్లోజర్‌లో గంట సమయం గడపవచ్చు. ఒకరోజు మొత్తమూ వాటితో ఉండొచ్చు. అమ్మో! తోడేళ్లతో మనం ఉంటే అవి ఏమీ చేయవా అనే సందేహం వచ్చిందా! అవి సందర్శకులను ఏమీ చేయకుండా ఉండటానికే తోడేళ్ల శిక్షకులూ అక్కడే ఉంటారు. వాటితో ఎలా మెలగాలో, ఎలా మచ్చిక చేసుకోవాలో వారు చెప్తారు. అత్యుత్సాహంతో వాటిని బెదరకొట్టకూడదు. అవి దగ్గరికి వచ్చినప్పుడు నిండైన ఆత్మవిశ్వాసంతో ఉండాలి. ఎందుకంటే అవి భయాన్ని పసిగడతాయి. ఒక్కసారి మచ్చిక అయితే పెంపుడు జంతువుల్లా బుద్ధిగా ఉంటాయి. పార్కులోని మిగతా జంతువులూ



సందర్శకులకు ఎలాంటి ఇబ్బందిని కలిగించవు. ఈ పార్కుకు వెళ్లాలంటే ఒకే ఒక్క షరతు. అదేంటంటే 15 సంవత్సరాల వయసు దాటిన వారినే పోలార్ పార్కులోకి అనుమతిస్తారు. ★

బాలోత్సవాల్లో నృత్యం చేశా ...

నా పేరు కొత్తపల్లి లక్ష్మీసౌమ్య. నేను లిటిల్‌బడ్స్ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్నా. ఈ మధ్య విజయవాడలో జరిగిన 'అమరావతి బాలోత్సవా'ల్లో పాల్గొన్నాను. అక్కడ చాలా కాంపిటేషన్స్ జరిపినప్పటికి నేను కొన్నింటిలో మాత్రమే పాల్గొన్నాను. ఒకరోజు తరగతిగదిలో మా టీచర్స్ మనం స్కూలు తరపున బాలోత్సవాల్లో పాల్గొంటున్నాం, అక్కడ మీరందరూ మీలో ఉన్న టాలెంట్‌తో పోటీపడాలి అని చెప్పారు. నాకయితే ముందు చాలా భయమేసింది. నేను అక్కడకు రాను అని చెప్పా. కానీ మా ఉపాధ్యాయులు, స్నేహితులు నీవు జానపద నృత్యం చాలా బాగా చేస్తావుగా! ఎందుకు భయపడుతున్నావు? నీకు గతంలోనూ ఆ డాన్స్‌లకు బహుమతులు వచ్చిన విషయం మరిచిపోయావా? అంటూ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. బాలోత్సవాలకు రెండురోజులు ఉందనగా జానపద గీతానికి డ్యాన్స్‌ను ప్రాక్టీసు చేశా. బాలోత్సవాల్లో ఎట్టకేలకు స్టేజీమీద డ్యాన్స్ చేశా. నేను డ్యాన్స్ చేస్తుంటే మా స్నేహితులందరూ నా పేరుతో పెద్దగా అరుస్తూ.. ఈలలు వేస్తుండటంతో నేను ఇంకా ఉత్సాహంగా డాన్స్ చేశా. నాకు బహుమతి రాలేదు కానీ, ఇతర స్కూల్ విద్యార్థులతో పోటీపడటం, వందలమంది మధ్య డాన్స్ చేయడం చాలా సంతోషంగా అనిపించింది. ఇంకా నేను కథా రచన పోటీలోనూ పాల్గొన్నా. వచ్చేఏడాది 'విజయవాడలో బాలోత్సవాలు' పెడితే జానపద నృత్యాలలో మొదటి బహుమతి నేనే తెచ్చుకుంటా.



కె. లక్ష్మీసౌమ్య,
ఏడవ తరగతి,
లిటిల్‌బడ్స్ హైస్కూల్,
విజయవాడ.



క్రికెట్ సంచలనం 'గుల్బానీ'

రెండు నెలల క్రితం అతని పేరు ఎవరికీ తెలియదు... రంజీట్రోఫీ చరిత్రలో తొలిసారి ఆ జట్టుకు టైటిల్‌ను అందించాడు... ఒక హాట్రిక్‌తో పాటు మూడు మ్యాచ్‌లలో 27 వికెట్లతో రాణించాడు... ఆ కుర్రాడే రజ్నేష్ గుల్బానీ...

బౌలింగ్ రికార్డ్...

	తొలి ఇన్నింగ్స్	రెండో ఇన్నింగ్స్
క్వార్టర్ ఫైనల్ (కేరళపై)	14-6-38-5	9-2-30-2
సెమీఫైనల్ (కర్ణాటకపై)	34-7-94-4	23.1-3-68-7
ఫైనల్ (ఢిల్లీపై)	24.4-8-59-6	18-2-92-2

(మూడు మ్యాచ్‌లలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజేత)

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

విదర్భ జట్టు రంజీట్రోఫీ టైటిల్‌ను చేజిక్కించుకోవడంలో ముఖ్య భూమిక పోషించిన ఆటగాళ్ళలో గుల్బానీ ఒకడు. క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్, ఫైనల్స్‌లో విదర్భ జట్టును ఒంటిచేత్తో గెలిపించి టైటిల్ అందించాడు. కీలకమైన మూడింటిల్లోనూ తానే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. రంజీట్రోఫీ ప్రారంభానికి ముందు అతడో అనామక క్రికెటర్. రంజీట్రోఫీ ముగిసే సరికి అతని పేరు తెలియని వారు మరొకరు ఉండరు. కుడిచేతి స్వింగ్ బౌలర్ అయిన గుల్బానీ రంజీట్రోఫీ ఫైనల్ ఆడే ముందురోజు రాత్రి 12.30 నుండి 4.30 గంటల వరకు నిద్ర పట్టేది కాదు. భువనేశ్వర్ కుమార్ స్వింగ్ బౌలింగ్‌ను అందిపుచ్చుకున్న గుల్బానీ రానున్న ఐపిఎల్ 11వ సీజన్‌లో ఏ ఫ్రాంచేజీ చేజిక్కించుకోనుందో...

హోరా హోరీ పోరులో అవధే వారియర్స్ గెలుపు

ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్

లఖ్‌నోవ్ : బ్యాడ్మింటన్ లీగ్‌లో మంగళవారం అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్‌తో తలపడిన అవధే వారియర్స్ జట్టు ఉత్కంఠపోరులో 4-3 పాయింట్ల తేడాతో గెలిచింది. కశ్యప్, శ్రీకాంత్, సైనా నెహ్వాల్‌తో పటిష్టంగా ఉన్న అవధే జట్టు చెమటోడ్చి చివరి పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో విజయం సాధించి ఊపిరి పీల్చుకుంది. తొలి మిక్సిడ్ డబుల్స్ మ్యాచ్‌ను అవధే 14-15, 15-12, 15-14తో గెలిచి 1-0 ఆధిక్యత సంపాదించింది. కశ్యప్ సింగిల్స్ మ్యాచ్‌ను ట్రంప్ మ్యాచ్‌గా తీసుకొని 11-15, 15-13, 15-14తో సమీర్ వర్మ (అహ్మదాబాద్)పై గెలిచి 3-0 ఆధిక్యత సంపాదించింది. పురుషుల సింగిల్స్ మరో మ్యాచ్‌లో శ్రీకాంత్ (అవధే) 8-15, 11-15తో సమీర్‌వర్మ (అహ్మదాబాద్) చేతిలో ఓటమి పొందడంతో 3-1 ఆధిక్యతను తగ్గింది. నాల్గో మ్యాచ్ సైనా నెహ్వాల్ (అవధే) ట్రంప్ మ్యాచ్‌గా తీసుకొని 5-15, 14-15 పాయింట్ల తేడాతో టిటి ఇంగ్ (అహ్మదాబాద్) చేతి ఓడింది. దీంతో ఇరుజట్లు 3-3తో సమంగా నిలిచాయి. నిర్ణయాత్మకమైన పురుషుల డబుల్స్‌లో అవధే జట్టు 15-14, 15-10తో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది.

నేటి నుంచి సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్

ఐదు రాష్ట్రాల నుంచి పాల్గొననున్న 98 టీమ్‌లు

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

ఆంధ్ర యూనివర్సిటీ రెండున్నర దశాబ్దాల తరువాత సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ (మెన్స్) టోర్నమెంట్‌ను నిర్వహిస్తోంది. రఘు ఇంజనీరింగ్ కళాశాల సౌజన్యంతో ఆ కళాశాల క్యాంపస్‌లో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు పోటీలు జరగనున్నట్లు ఎయు విసి ఆచార్య జి.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఎయు అకడమిక్ సెనేట్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. టోర్నమెంట్‌లో ఐదు రాష్ట్రాల నుంచి 98 క్రీడా బృందాలు పాల్గొంటాయని తెలిపారు. ఈ పోటీలకు 1900 మందికి పైగా క్రీడాకారులు, టీం సిబ్బంది, కోచ్‌లు, మేనేజర్లు విశాఖ నగరానికి వస్తున్నారని తెలిపారు.

201 పరుగులకు ఆంధ్ర ఆలౌట్

ప్రజాశక్తి- విజయనగరం టౌన్



వంశీకృష్ణ (95)

ఆంధ్ర, గుజరాత్ అండర్-19 జట్ల మధ్య విజయనగరం సమీపంలోని చింతలవలస ఎసిఎ స్టేడియంలో కూచ్‌బెహరా కప్ నాలుగు రోజుల మ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 55.3 ఓవర్లలో 201 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆంధ్ర జట్టు బ్యాట్స్‌మన్ వంశీకృష్ణ అత్యధికంగా 95 పరుగులు చేశాడు. మహీప్‌కుమార్ 26, మనిష్‌వర్మ 27 పరుగులు సాధించారు. మిగతావారెవరూ రాణించకపోయారు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన గుజరాత్ జట్టు మొదటి రోజు ఆటలో 32 ఓవర్లు ఆడి ఒక వికెట్ నష్టానికి 71 పరుగులు చేసింది. ఓపెనర్‌గా దిగిన ఎం.ఎ.ఉమ్రిగర్ 32 పరుగులతో నాటౌట్‌గా ఉన్నారు. మరో ఓపెనర్ హెట్ 36 పరుగులు జోడించి ఎస్.ఆశిష్ బౌలింగ్‌లో కె.ఎన్.పృధ్వికి క్యాచ్ ఇచ్చి ఔటయ్యారు. తర్వాత ఉమ్రిగర్‌కు తోడుగా విడిషా బ్యాటింగ్‌కు దిగి రెండు పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. అంతకు ముందు ఆంధ్ర జట్టును ఆలౌట్ చేయడంలో గుజరాత్ బౌలర్లు ఆకాశ్‌పాండే 15 ఓవర్లు వేసి మూడు వికెట్లు తీశాడు. కె.ఆర్.పటేల్ 9.3 ఓవర్లు వేసి మూడు వికెట్లు, ఎస్ఎస్ సూర్య తొమ్మిది ఓవర్లు వేసి రెండు వికెట్లు తీశారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు రెండో రోజు ఆట ప్రారంభం కానుంది.



కొనసాగేదెవ్వరో?



ముంబాయి : ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపిఎల్)లో తమ ఫ్రాంచేజీల్లో కొనసాగే క్రీడాకారుల జాబితాను గురువారం సాయంత్రంలోగా అందజేయాలని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బిసిసిఐ) తెలియజేసింది. మంగళవారంనాడు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఈ విషయాన్ని ఐపిఎల్ పాలకమండలి తెలిపింది. ఆ రోజు సాయంత్రం జరిగే ఐపిఎల్ నిర్వాహక కమిటీ సమావేశంలో వారి వారి ఫ్రాంచేజీల్లో కొనసాగే క్రీడాకారుల జాబితాను వెల్లడిస్తారు. ప్రతి ఫ్రాంచేజీలో ముగ్గురు స్వదేశీ క్రీడాకారులకు, ఇద్దరు విదేశీ క్రీడాకారులను కొనసాగించుకొనేందుకు ఆయా ఫ్రాంచేజీలకు అవకాశమిచ్చింది.

అత్యంత ప్రజాదరణ పొందిన ఐపిఎల్ పదేళ్ళు దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. 11వ ఎడిషన్లో వివిధ ఫ్రాంచేజీలు కేవలం ఐదుగురు క్రీడాకారులను తమవద్ద ఉంచుకొని మిగతా క్రీడాకారులందరినీ వేలంలో పెట్టాల్సి ఉంది. ఐపిఎల్ క్రీడాకారుల వేలం జనవరి 27, 28 తేదీలలో ముంబాయిలో జరగనుంది. ఇప్పటికే ప్రతి ఫ్రాంచేజీలో కొనసాగుతున్నామంటూ ప్రకటనలు వస్తున్నాయి. దానిలో భాగంగా చెన్నైకి ధోనీ, రైనా, రవీంద్ర జడేజా, బ్రావోలు కొనసాగనున్నారంటూ... బెంగుళూరు జట్టు విరాట్ కోహ్లీ, ఎబి డివిలియర్స్, గేల్స్, షేన్ వాట్సన్ ముంబాయి ఇండియన్స్‌కు రోహిత్‌శర్మ, పాండ్యా బ్రదర్స్, సన్ రైజర్స్‌కు ధావన్, వార్నర్, స్టివ్ స్మిత్, భువనేశ్వర్ కుమార్‌లు కొనసాగుతున్నారంటూ ప్రకటనలు వెలువడుతున్నాయి.

స్టార్ ఇండియా గత ఏడాది సెప్టెంబర్‌లో 2018 నుండి 2022 వరకు ప్రసార హక్కులను దక్కించింది. ఈ ఐదేళ్ళ బ్రాడ్‌కాస్ట్ హక్కులకై అది బిసిసిఐకి 16,347.50 కోట్లు చెల్లించనుంది. భారత్‌లో ప్రసారమయ్యే హక్కులను సోనీ ఇండియా, సోనీ పిక్చర్స్‌ద్వారా ఈ ఏడాది ఐపిఎల్ మ్యాచ్‌లు ప్రసారం కానున్నాయి. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) నిర్వహణలో ఈ క్రీడాకారుల వేలం, మొదలగు వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మెగా టోర్నీ ఏప్రిల్ 4 నుండి మే 27వ తేదీ వరకు ఐపిఎల్ 11వ ఎడిషన్ ప్రారంభం కానుంది.

ఈ నియామకంపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రధాన కోచ్ డేనియల్ వెటోరి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ 'కోచింగ్ టీమ్‌లోకి వస్తున్న గ్యారీ కిరిస్టన్, ఆశిష్ నెహ్రాకి స్వాగతం అని తెలిపారు. గ్యారీ కిరిస్టన్ 2015 ఐపిఎల్ సీజన్‌లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టుకి కోచ్‌గా పనిచేయగా.. అతని పర్యవేక్షణలోనే భారత్ జట్టు 2011లో ప్రపంచకప్ నెగ్గిన విషయం తెలిసిందే. గత ఏడాది వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకి ప్రాతినిథ్యం వహించిన ఆశిష్ నెహ్రా.. ఇటీవల క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు.

11వ సీజన్ ఐపిఎల్‌లో పాల్గొనే జట్లు

ముంబాయి ఇండియన్స్
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు
కలకత్తా నైట్ రైడర్స్
కింగ్స్ ఎలెవెన్ పంజాబ్
సన్‌రైజర్స్ హైదరాబాద్
ఢిల్లీ డేర్ డెవిల్స్
రైజింగ్ పూణే
గుజరాత్ లయన్స్
చెన్నై సూపర్ కింగ్స్
రాజస్తాన్ రాయల్స్

ఫ్రాంచేజీల్లో ఉండే క్రీడాకారుల జాబితా ప్రకటన...

తేదీ : జనవరి 4
సమయం : సాయంత్రం 6.50 గం.లకు
టివి ఛానల్ : స్టార్ స్పోర్ట్స్2/హెచ్‌డి, స్టార్ స్పోర్ట్స్ హిందీ 1 / హెచ్ డి.
క్రీడాకారుల వేలం : జనవరి 27, 28
ఐపిఎల్ టోర్నీ ప్రారంభం : ఏప్రిల్ 4 నుండి మే 27 వరకు

బెంగళూరు ఫ్రాంచేజీకి కిరిస్టన్, నెహ్రా



ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి టైటిల్ అందని ద్రాక్షగా ఉన్న జట్లలో బెంగళూరు ఒకటి. ఆ జట్టులో విధ్వంసకరమైన క్రీడాకారులున్నప్పటికీ ఒక్కసారి కూడా టైటిల్‌ను ముద్దాడలేకపోయింది. కోహ్లి సారథ్యంలోని ఆ జట్టు 2016లో ఫైనల్ చేరగా.. గత ఏడాది ఘోరంగా విఫలమై పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పరిమితమైంది. విరాట్ కోహ్లి, ఏబీ డివిలియర్స్, క్రిస్‌గేల్, షేన్ వాట్సన్‌లాంటి హేమా హేమీలున్నప్పటికీ ఆశించిన మేర ఫలితాలు రాబట్టలేకపోయింది. దీంతో బెంగళూరు ఫ్రాంఛైజీ ఈ ఏడాది జట్టు బ్యాటింగ్ కోచ్‌గా గ్యారీ కిరిస్టన్‌ను, బౌలింగ్ కోచ్‌గా ఆశిష్ నెహ్రాను నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

ఎన్‌ఎంసి బిల్లును వ్యతిరేకిస్తూ వైద్యుల నిరసన

12 గంటల పాటు సేవల నిలిపివేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



ఎన్‌ఎంసి బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న కడప రిమ్స్ ప్రభుత్వ వైద్యులు, జూడాలు

భారత వైద్య మండలి (ఎమ్‌సిఐ) స్థానంలో జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎమ్‌సి)ను తీసుకు రావడాన్ని భారతీయ వైద్యుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎన్ఎమ్‌సి కోసం లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం ప్రభుత్వ వైద్యుల సంఘం ఆందోళన చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ వైద్య విద్యా కళాశాలల్లో తరగతులు, ఆస్పత్రుల్లో సాధారణ సేవలను 12 గంటలు నిలిపివేస్తూ నిరసన తెలిపారు. ప్రాచీన వైద్యంగా పరిగణిస్తున్న ఆయుష్ (ఆయుర్వేద, యోగ, యునాని, సిద్ధ, హోమియోపతి) కోర్సులకు బ్రిడ్జి కోర్సు ద్వారా ఆధునిక అల్లోపతి వైద్యానికి అర్హులను చేయడం అశాస్త్రీయ విధానమని ప్రభుత్వ వైద్యులు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ప్రయివేటు వైద్య కళాశాలలకు అడ్డు కట్టవేసే అవకాశం లేదని రాష్ట్ర జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి. రవి ప్రజాశక్తితో అన్నారు. ఎన్ఎమ్‌సి బిల్లు ప్రయివేటు మెడికల్ కాలేజీలకు లబ్ధి చేకూరేలా, వైద్య విద్యను వ్యాపారంగా చేసేలా ఉందని వ్యాఖ్యానించారు. ఈ బిల్లు అమలులోకి వస్తే ప్రయివేటు మెడికల్ కాలేజీలను తనిఖీలు చేయకుండానే ఒకేసారి అనుమతులు వస్తాయని తెలిపారు. మెడికల్ కాలేజీలపై ప్రభుత్వానికి నియంత్రణ తగ్గించేలా ఈ బిల్లు ఉందని చెబుతున్నారు. దీంతో వైద్య విద్య నాణ్యత తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. కేవలం డబ్బున్న వారికే వైద్య విద్య చదివే అవకాశం వస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలకు అందే వైద్యం కూడా నాసి రకంగా ఉంటుందని, అది వారి ప్రాణాలకే ప్రమాదమని ప్రభుత్వ వైద్యులు హెచ్చరిస్తున్నారు. అల్లోపతి కోర్సు స్పెషలైజేషన్ కోసం బ్రిడ్జి కోర్సు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆయుష్ విభాగం నీరుగారిపోయే అవకాశముందన్నారు. ప్రాచీన వైద్యాన్ని ప్రోత్సహిస్తామని చెబుతున్న ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఈ నిర్ణయం ఉందన్నారు.

23న సమ్మె చేస్తున్నాం

ఎన్‌హెచ్‌ఎం ఫెడరేషన్ నోటీస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర ప్రభుత్వ పథకాల ఉద్యోగులు ఈనెల 23న నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొంటున్నామని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ తెలిపింది. ఈ మేరకు కుటుంబ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఒక రోజు ఎన్‌హెచ్‌ఎం, న్యాకో, ఐసిడిఎస్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల కార్మికులు ఈ నెల 23న సమ్మె నిర్వహిస్తున్నారని వివరించారు. ఎన్‌హెచ్‌ఎం పరిధిలోని కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ సుప్రీంకోర్టు కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. 180 రోజులు వేతనంతో కూడిన మెటర్నిటీ సెలవులు, 35 రోజుల క్యాజువల్ లీవులు అమలు చేయాలని, అందర్ని రెగ్యులరైజ్ చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలల్లోని కార్మికులందరికీ కనీస వేతనం రూ.18వేలు, కనీస పెన్షన్ రూ.3వేలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని, ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలకు అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వాలు కేటాయించాలని, పథకాలను ప్రైవేటీకరించొద్దని కోరారు.

లాక్ సూపరింటెండెంట్ల సంఘ క్యాలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు నీటి పంపిణీ విధానంలో జల వనరుల శాఖ లాక్ సూపరింటెండెంట్లు ప్రభుత్వానికి, రైతాంగానికి మధ్య వారధిగా ఉండాలని ఆ సంఘ రాష్ట్ర ఛైర్మన్ వివిఎల్‌వి ప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడలో జల వనరులశాఖ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం సంఘ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న లాక్ సూపరింటెండెంట్ల సమస్యలపై ఐక్యతతో పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలకు అనుకూలంగా సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి చంద్రశేఖర్, బి ప్రసాద్, పి రమేష్ తదితరులు మాట్లాడారు.



టిడిపి కార్యకర్తలపై జవహర్ దాడి

ప్రజాశక్తి-కొవ్వూరు



కొవ్వూరు విజయ విహార్ సెంటర్లో మంత్రి జవహర్‌కు వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న అన్నదేవరపేట టిడిపి కార్యకర్తలు, నేతలు

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్, ఇతరులు కలిసి తమపై దాడి చేశారని, వారిపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ కొందరు టిడిపి కార్యకర్తలు పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరులో మంగళవారం నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. డిఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన టిడిపి నేతలు సత్యహరిశ్చంద్రప్రసాద్, గణపతికృష్ణ, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి విజయవిహార్ సెంటర్ వరకూ ర్యాలీ చేసి, అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్, కృష్ణ మాట్లాడుతూ మంత్రిని కలవడానికి వెళ్లిన తమపై జవహర్‌తోపాటు ఇతరులు దాడి చేశారని చెప్పారు. దీనిపై సోమవారం రాత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా డిఎస్‌పి కార్యాలయానికి వెళ్లి ఆందోళన చేపట్టారు. మంత్రి పిఎ ఫిర్యాదు మేరకు అన్నదేవర పేటకు చెందిన కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఎస్‌పి ఎన్.వెంకటేశ్వరరావును కలిసి సంఘటన వివరాలను తెలిపారు. అదే సమయంలో మంత్రికి అనుకూలంగా కొందరు, వ్యతిరేకంగా మరికొందరు నినాదాలు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరు పక్షాలకూ సర్దిచెప్పి పంపేశారు. దీనిపై డిఎస్‌పిని వివరణ కోరగా టిడిపి నేతలు మంత్రిపై ఇచ్చిన ఫిర్యాదుపై విచారణ నిర్వహిస్తున్నామన్నారు. దీని ఆధారంగా కేసు నమోదు చేసే అవకాశం లేదన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తులు గతంలో మంత్రి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, మంత్రి పిఎ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయని తెలిపారు. అధికార పార్టీకి చెందిన మంత్రిపై, అదే పార్టీకి చెందిన వారు ఫిర్యాదు చేయడం, ఆందోళన చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

డిఎస్‌పి కార్యాలయం వద్ద ఆందోళన

ఎవరిపైనా దౌర్జన్యం చేయలేదు : మంత్రి

ఎవరిపైనా దౌర్జన్యం చేయలేదు : మంత్రి

తాను ఎవరిపైనా దౌర్జన్యం చేయలేదని మంత్రి జవహర్ చెప్పారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కొందరు తనకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68